www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 22-9-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 158 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: పంచమి మ. 3.44 తదుపరి షష్ఠి; నక్షత్రం: కృత్తిక రా. 11.02 తదుపరి రోహిణి; వర్జ్యం: ఉ. 11.49-1.18; దుర్ముహూర్తం: సా.4.31-5.19; అమృతఘడియలు: రా.8.47-10.17; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.07 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్.. మహా పాతకం!



తిరుమల లడ్డూను కాపీ కొట్టాలని ప్రైవేటు వ్యక్తులే కాదు.. అనేక దేవాలయాలు కూడా ప్రయత్నించాయి. ఈ విషయంలో ఇంతవరకూ ఎవరూ సక్సెస్ కాలేదు. లడ్డూ ప్రసాదాన్ని ఎవరూ కాపీ చేయలేకపోవడం అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి మహత్యం అని శ్రీవారి భక్తులు విశ్వసిస్తారు. శతాబ్దాలుగా తన ప్రాశస్త్యం నిలుపుకొంటూ వచ్చిన లడ్డూను గత జగన్ రెడ్డి ప్రభుత్వం కాపీ కొట్టలేకపోయినా నాణ్యతను మాత్రం దెబ్బతీయగలిగింది.

ఇప్పుడు లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో కల్తీ జరిగిందని తేలింది. ఈ మహా పాతకానికి ఎవరు కారణం? జగన్ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన దిక్కుమాలిన రివర్స్ టెండరింగ్ విధానమే ఇందుకు కారణం.

నాణ్యమైన ఆవు నెయ్యిని పేరొందిన కంపెనీలు మార్కెట్‌లో కిలో 800 రూపాయల వరకు విక్రయిస్తుండగా టీటీడీ మాత్రం 400 కంటే తక్కువకు నెయ్యి టెండర్లను ఖరారు చేసింది. ఈ తప్పుడు నిర్ణయం కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయింది.

క్రైస్తవ మతాన్ని ఆచరించే వైఎస్ కుటుంబంలోని మహిళలు తిరుమల కొండకు వెళ్లి దేవదేవుడిని దర్శించుకోవడానికి కూడా ఇష్టపడరు. తిరుమలను సొంత అవసరాలకు వాడుకోవడం కోసం జగన్ అండ్ కో బ్రహ్మాండమైన స్కెచ్ రూపొందించారు. జగన్ రెడ్డి సొంత పనులు చక్కబెట్టడానికి తిరుమలను వేదికగా మార్చుకున్నారు. దైవ దర్శనానికి వచ్చే ప్రముఖులకు వీఐపీ ఆతిథ్యం ఇచ్చి మంచి చేసుకొనేవారు. ఇటు జగన్ రెడ్డికీ, అటు ఆ ప్రముఖులకూ అనుసంధానకర్తగా మాజీ ఈవో ధర్మారెడ్డి వ్యవహరించేవారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర ఏజెన్సీల అధికారులు కొండకు వచ్చినప్పుడు ధర్మారెడ్డి చేసిన హడావిడి అంతా ఇంతా కాదు.

శ్రీవేంకటేశ్వరుడిపై భక్తితో కాకుండా ఆ దేవదేవుడిని సొంత అవసరాలకు వాడుకోవడానికి 10 నుంచి 20 కోట్లు చెల్లించైనా పాలక మండలి సభ్యులుగా నియమితులు కావడానికి కొందరు ప్రయత్నించారు. బోర్డు సభ్యుడిగా నియమిస్తామంటే 20 కోట్లు ఇవ్వడానికి కూడా సిద్ధం అనేవారు ఎందరో! గతంలో స్వామి వారిపై భక్తితో సేవ చేయడానికి బోర్డు సభ్యులుగా నియమితులు కావాలని కోరుకునేవారు. క్రమంగా టీటీడీ చైర్మన్ పదవి కూడా రాజకీయ పునరావాస కేంద్రంగా మారిపోయింది.

కల్తీ వ్యవహారం బయటపడగానే దేశ విదేశాలకు చెందిన భక్తులు మండిపడ్డారు. మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలన్న డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీఐ విచారణకు వెంటనే అనుమతివ్వాలి.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

పవిత్రతకు పాతర!

అరాచకానికి ఆది.. అంతం జగనే

- స్వలాభం కోసం స్వామివారితోనే ఆటలు
- ఆ పాపమే తిరుమల సేవలకు శాపం
- తొలి నుంచీ డెయిరీల నుంచే నెయ్యి
- పవిత్రతకూ, రైతుల లబ్ధికీ భరోసా
- మొదట చిత్తూరు డెయిరీ, ఆ తర్వాత కర్ణాటక ఫెడరేషన్ నుంచి సరఫరా
- ఇతర ఆలయాలకూ వర్తించేలా 2019కి ముందు దీనిపై కీలక జీవోలు
- ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియకు గట్టి రూల్స్
- రావడంతోనే బుట్టదాఖలు చేసిన జగన్
- 'నచ్చిన' కంపెనీలకు టెండరు దక్కేలా అడ్డగోలుగా నిబంధనలు మార్పు
- లడ్డూ అపచారం అప్పటి నుంచే..

తిరుమల పవిత్రతకు ఉద్దేశపూర్వకంగానే పాతర వేశారని తేలిపోయింది. తవ్వేకొద్దీ జగన్ అరాచక పాలన సృష్టించిన సంక్షోభం తెలిసి వస్తోంది. అధికారంలోకి రావడం రావడమే తిరుమల పాలనను అస్తవ్యస్తం చేసేశారు. అత్యంత వివాదాస్పదులుగా ముద్రపడిన తన బంధువులకు, అధికారులకు టీటీడీ పగ్గాలు అప్పగించి, వారి ఇష్టారాజ్యానికి కలియుగ దైవాన్నీ, భక్తులనూ వదిలేశారు. నాణ్యతకు, పవిత్రతకు భరోసా ఇచ్చిన డెయిరీల నుంచి నెయ్యి సేకరణను ఆపివేయించడం జగన్ అరాచకపర్వానికి పరాకాష్ఠ. నచ్చిన కంపెనీలకు నెయ్యి కాంట్రాక్టు ఇవ్వడానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన లడ్డూ పవిత్రతను సైతం మంటగలిపేశారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని టీటీడీ సహా ప్రముఖ ఆలయాల అవసరాల కోసం నెయ్యిని స్థానిక సహకార డెయిరీల నుంచి కొనుగోలు చేసేవారు. తిరుమల పవిత్రతను, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక డెయిరీల నుంచి మంచి నెయ్యిని సేకరించేవారు. దీనికోసం అప్పటి ప్రభుత్వాలు జీవో 418ను కూడా జారీచేశాయి. ఈ ప్రక్రియను ఈ - ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా చేపట్టాలని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. తిరుమల పవిత్రతను కాపాడటానికి తీసుకున్న ఈ నిర్ణయాన్ని మరింత బలపరుస్తూ 2019లో అప్పటి టీడీపీ

మిగతా 11వ పేజీలో...



లోపలి పేజీల్లో..

ఆ ముగ్గురి వైపే అందరి వేళ్లూ!

సుబ్బారెడ్డి, భూమన, ధర్మారెడ్డి హయాంలో నిత్య వివాదాలమయంగా తిరుమల పాలన

దైవాన్నీ భక్తులనూ లూటీ చేసేలా పలు జీవోలు

ఐదేళ్లూ అడ్డగోలు వ్యవహారాలు

కాసుల కక్కుర్తితోనే!

'తిరుమల' నెయ్యి కల్తీకి ఇదే కారణం

సరుకుల కొనుగోళ్లలో చేతివాటం!

టీటీడీలో భారీగా కమీషన్ల బాగోతం

గత ఐదేళ్లలో రూ.450 కోట్ల దోపిడీ



శ్రీవారి లడ్డూ అపవిత్రం కావడంపై నిరసన తెలుపుతూ భోపాల్‌లో జగన్ దిష్టిబొమ్మను తగులబెడుతున్న సంస్కృతీ బచావో మంచ్ కార్యకర్తలు

ఏడుకొండలవాడా.. క్షమించు

- గత పాలకుల వికృత పోకడలతో తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రం
- జంతు అవశేషాలతో మలినం చేశారు
- ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మేవారంతా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి

నేటి నుంచి ప్రాయశ్చిత్త దీక్ష

11 రోజుల పాటు దీక్షలోనే



దీక్ష తర్వాత శ్రీవారి దర్శనానికి: డిప్యూటీ సీఎం

11

లం.. కొడకా.. చంపేస్తా

వైద్య కళాశాల ప్రొఫెసర్‌పై జనసేన ఎమ్మెల్యే నానాజీ వీరంగం

- బూతుల దండకం... దాడికి యత్నం
- ఆచార్యునిపై చేయిచేసుకున్న పంతం మేనల్లుడు
- ఆర్ఎంసీ మైదానంలో తన అనుచరుల వాలీబాల్ ఆటకు అనుమతి నిరాకరణపై గుర్రు.. ఘటనపై పవన్ ఆగ్రహం
- ఇలాంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు
- చట్టప్రకారం వెళ్లండి.. కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం ఆదేశాలు
- ఘటనపై వైద్య విద్యార్థుల ఆగ్రహం.. దళిత సంఘాల ధర్నా
- రాష్ట్రవ్యాప్త ఆందోళనకు ప్రభుత్వ వైద్యుల సంఘం హెచ్చరిక

12



ప్రొఫెసర్ ఫేస్ మాస్క్‌ను తొలగించి దౌర్జన్యం చేస్తున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ... చుట్టుముట్టిన ఆయన అనుచరులు

చరిత్రహీనుల్లా మిగిలిపోయేలా శిక్షిస్తాం




లడ్డూ అపవిత్రంపై చంద్రబాబు హెచ్చరిక

- తదుపరి చర్యలపై అందరితోనూ చర్చిస్తున్నాం
- తిరుమల ప్రక్షాళనతోనే పాపం బయటపడింది
- బాబాయిని చంపి చెప్పిన అబద్ధాలే చెబుతున్నారు
- తిరుమల లడ్డూకు వందల ఏళ్ల ప్రాశస్త్యం
- గత ఐదేళ్లలో దాన్నంతా నాశనం చేశారు
- లడ్డూలో వాడే నెయ్యికీ రివర్స్ టెండర్లు ఏమిటి?
- తిరుమల కొండపై అసలు ల్యాబే లేదు..
- జగన్ వెళ్లి కూర్చుని పరీక్షలు చేశారా?: సీఎం

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): "దేశంలోనే అతి పవిత్ర క్షేత్రాల్లో తిరుమల ఒకటి. భక్తుల మనోభావాలు దెబ్బ తినేలా అక్కడ తప్పు చేసినవారు చరిత్ర హీనులుగా మిగిలిపోయేలా శిక్షిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. శనివారం ఉదయం ఆయన ఇక్కడ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా

మిగతా 12వ పేజీలో...

వరద బాధితులకు పరిహారం 25న



శ్రీవారి ఆలయ శుద్ధిపై ఏం చేద్దాం?

- సంప్రోక్షణా.. మహాశాంతి యాగమా?.. ఏయే ప్రాంతాల్లో ఎన్ని రోజులు?
- నేడు ఆగమ సలహా మండలి భేటీలో నిర్ణయం.. నివేదిక కోరిన టీటీడీ ఈవో
- మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

తిరుమల/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): లడ్డూ ప్రసాదం కల్తీ తర్వాత శ్రీవారి ఆలయాన్ని సంప్రోక్షణ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో అర్చకులు, ఆగమ సలహామండలి సభ్యులతో టీటీడీ ఈవో శ్యామలరావు శనివారం సమావేశమయ్యారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆగమ సలహా మండలి సభ్యులు వేణుగోపాల దీక్షితులు, వైఖానస ఆగమ పండితులు మోహనరంగాచార్యులు, సీతారామాచార్యులు, పలువురు అర్చకులు పాల్గొన్నారు. ఆలయాన్ని సంప్రోక్షణ చేయాలనే అభిప్రాయాలు వస్తున్నాయని, దీనిపై ఆగమశాస్త్రంలో ఎలాంటి చర్యలు చేపట్టాలని ఉందనే అంశాలపై చర్చించారు. నెయ్యిలో కల్తీ జరిగిన నేపథ్యంలో పరిహారం కింద ఎలాంటి చర్యలు తీసుకోవాలని ఈవో ప్రశ్నించారు. ఆగమ సలహా మండలి సభ్యులు స్పందిస్తూ.. అనుమానాలు తలెత్తిన క్రమంలో

మిగతా 11వ పేజీలో...

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆపేందుకు
చొరవ చూపండి

- మోదీని కోరిన అమెరికా అధ్యక్షుడు బైడెన్
- భద్రత, సాంకేతికత, ఆర్థిక అంశాలపై ద్వైపాక్షిక చర్చలు
- ఇండో-పసిఫిక్ రీజియన్‌పైనా చర్చ



ప్రధాని మోదీతో అమెరికా అధ్యక్షుడు బైడెన్ కరచాలనం

2

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్!



సీఐఐ సదరన్ రీజియన్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

పారిశ్రామిక రంగానికి స్కిల్ ఫోర్స్‌ను అందిస్తాం

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం: లోకేశ్

- పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు రాయితీలు
- కావాల్సిన మౌలిక సదుపాయాలూ కల్పిస్తాం
- ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తాం
- విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా మారుస్తాం
- డేటా సెంటర్, ఏఐ వర్సిటీని ఏర్పాటు చేస్తాం
- సీఐఐ సదస్సులో మంత్రి నారా లోకేశ్ వెల్లడి

అమరావతి, విజయవాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం రాయితీలు ఇవ్వడంతోపాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు

మిగతా 12వ పేజీలో...



అశోక్ లేల్యాండ్.. రెడీ!

- మల్లవల్లిలోని ప్లాంట్ ముస్తాబు.. నెలలో బస్ బాడీబిల్డింగ్ పనులు
- వందల సంఖ్యలో మహిళలకు ఉపాధి

12

ఢిల్లీ సీఎం పీఠంపై అతిశీ



- ప్రమాణం చేయించిన లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా
- అతిపిన్న వయస్కురాలైన ఢిల్లీ ముఖ్యమంత్రిగా రికార్డు
- ఢిల్లీకి 3వ మహిళా సీఎం.. దేశంలో 17వ మహిళా సీఎం
- ఆమెతో పాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం

2



ఢిల్లీ సీఎం పీఠంపై అతిశీ

ఆమెతో ప్రమాణం చేయించిన ఎల్జీ వీకే సక్సేనా.. ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిపిన్న వయస్కురాలు ఆమే

ఢిల్లీకి 3వ మహిళా సీఎం.. దేశంలో 17వ మహిళా సీఎం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠంపై ఆతిశీ ఆసీనులయ్యారు. శనివారం, ఇక్కడ రాజ్‌నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎల్జీ వినయ్‌కుమార్ సక్సేనా అతిశీతో ప్రమాణం చేయించారు. ఆమెతో పాటు క్యాబినెట్ మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లోత్, ఇమ్రాన్ హుస్సేన్, ముకేశ్ అహ్లావత్ ప్రమాణం చేశారు. మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, ఆప్ నేతల కుటుంబసభ్యులు అతిశీ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. కార్యక్రమ అనంతరం కేజ్రీవాల్‌కు ఆతిశీ పాదాభివందనం చేశారు. ఆతిశీ సీఎంగా ప్రమాణం చేయడంతో ఢిల్లీలో వరుసగా నాలుగోసారి ఆప్ ప్రభుత్వం ఏర్పడినట్లయింది. మంత్రులకు శాఖలను కూడా అతిశీ కేటాయించారు. ఆమె తన వద్ద 13 శాఖలను అట్టిపెట్టుకున్నారు. రెవెన్యూ, ఆర్థికం, విద్య తదితర ముఖ్యమైన శాఖలు ఆమె పరిధిలోనే ఉన్నాయి. సౌరభ్ భరద్వాజ్‌కు 8 శాఖలు, గోపాల్ రాయ్‌కు 3 శాఖలు, కైలాశ్ గెహ్లోత్‌కు 5శాఖలు, ఇమ్రాన్ హుస్సేన్‌కు 2 శాఖలు, ముఖేశ్ అహ్లావత్‌కు 5 శాఖలను ఆమె కేటాయించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఆమె కొద్ది కాలమే సీఎం పదవిలో ఉంటారు. ఢిల్లీ సీఎం పదవి చేపట్టిన ఎనిమిదో వ్యక్తి అతిశీ. ఆమె వయసు 42 ఏళ్లు. ఢిల్లీ సీఎం పీఠాన్ని అధిష్ఠించిన అతి పిన్న వయస్కురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. దేశంలో 17వ మహిళా ముఖ్యమంత్రిగా, ఢిల్లీకి మూడో మహిళా సీఎంగా రికార్డుల్లోకి ఎక్కారు.

కేజ్రీవాల్ ఢిల్లీ ముఖచిత్రాన్ని మార్చారు

గత పదేళ్లలో ఢిల్లీ ముఖచిత్రాన్ని మార్చిన ఘనత మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్‌ది అని ముఖ్యమంత్రి అతిశీ వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరి బాధను కేజ్రీవాల్ అర్థం చేసుకున్నారని, ప్రజలకు ఉచిత వైద్యం అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల జీవితాలను మెరుగుపర్చడానికి కేజ్రీవాల్ కృషి చేశారని పేర్కొన్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సీఎంగా అవకాశమిచ్చినందుకు కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా బీజేపీ చేస్తున్న కుట్రలను సఫలం కానివ్వబోమని తెలిపారు. సీఎం పదవిలో కొనసాగకుండా ఆ పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయడం తనను బాధిస్తోందని తెలిపారు. వచ్చే ఏడాది ప్రారంభంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కేజ్రీవాల్‌ను సీఎంగా గెలిపించాలని ఢిల్లీ ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. బీజేపీ గెలిస్తే కుట్ర చేసి ఉచిత విద్యుత్తును నిలిపివేస్తుందని హెచ్చరించారు.



నూతన వైమానిక దళాధిపతిగా
ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: యుద్ధ విమాన పైలట్, 5000 గంటలు విమానాన్ని నడిపిన విశేష అనుభవం కలిగిన ఫైటర్ పైలట్ ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌ను నూతన వైమానిక దళాధిపతిగా ఎంపిక చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుత భారత వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చతుర్వేది ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రస్తుతం వైస్ చీఫ్‌గా సేవలందిస్తున్న ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్, పీవీఎస్ఎం, ఏవీఎస్ఎంను ఎయిర్ చీఫ్ మార్షల్‌గా నియమిస్తున్నాం. ఈ నియామక ఉత్తర్వులు సెప్టెంబరు 30 మధ్యాహ్నం నుంచి అమలులోకి వస్తాయి' అని రక్షణ శాఖ ప్రకటించింది. గొప్ప వ్యూహకర్తగా పేరున్న ఎయిర్ మార్షల్ అమర్ సింగ్ గత జూలైలో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ, 'రక్షణ రంగంలో స్వయం సమృద్ధి భావన దేశ రక్షణను పణంగా పెట్టకూడదు' అని వ్యాఖ్యానించారు.

ఏడు హైకోర్టులకు సీజేల నియామకం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: దేశంలోని ఏడు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తూ శనివారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జులై 11న చేసిన సిఫార్సుల్లో కొన్నింటిని సవరిస్తూ మంగళవారం సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకోవడంతో ఈ నియామకాలు జరిగాయి. ఇవికాకుండా హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్ర రావును ఝార్ఖండ్ హైకోర్టుకు బదిలీ చేసింది. జస్టిస్ రావును ఝార్ఖండ్ హైకోర్టు సీజేగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసినా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే ఆయన బదిలీ జరిగింది. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ అదే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజీవ్ షక్దర్ హిమాచల్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి పొందారు. ఇదే హైకోర్టుకు చెందిన జస్టిస్ సురేష్ కుమార్ కైత్ మధ్యప్రదేశ్ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ నితిన్ మధుకర్ జమ్‌దార్ కేరళ హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు. బాంబే హైకోర్టుకే చెందిన జస్టిస్ కె.ఆర్.శ్రీరాం మద్రాసు హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు. కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ ఇంద్ర ప్రసన్న మేఘాలయ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. జమ్మూ-కశ్మీర్-లద్దాఖ్ హైకోర్టు జడ్జి జస్టిస్ తాషి రబస్తాన్ అదే హైకోర్టులో సీజేగా విధులు నిర్వర్తించనున్నారు. ఆయన లద్దాఖ్ ప్రాంతానికి చెందిన తొలి ప్రధాన న్యాయమూర్తి కానుండడం విశేషం.

పొగాకు వ్యతిరేక ప్రకటనలు
ఓటీటీల్లోనూ తప్పనిసరి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: ఓటీటీ ప్లాట్‌ఫాంలలో పొగాకు వ్యతిరేక ప్రకటనలను తప్పనిసరి చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రతిపాదించింది. సినిమా ఆరంభంలో, మధ్యలోనూ 30 సెకన్ల నిడివికి తగ్గకుండా పొగాకు, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ ఆడియో, వీడియో ప్రకటనలు, 20 సెకన్ల నిడివితో బిల్‌బోర్డు లేదా నిశ్చల ప్రకటనలు ఉండాలని పేర్కొంది. ఓటీటీ వినియోగదారు ఆ ప్రకటనలను తప్పించడానికి వీలులేని విధంగా పొందుపరచాలని సూచించింది. సెప్టెంబరు 1, 2023 తరువాత సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్ పొందిన ప్రతి సినిమాకూ పైన పేర్కొన్న ప్రకనటలను జత చేయాలని పేర్కొంది.

ఫిష్ ప్లేట్లు తొలగించి రైలు ప్రమాదానికి కుట్ర

సూరత్, సెప్టెంబరు 21: గుజరాత్‌లో రైలును పట్టాలు తప్పించేందుకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చేసిన ప్రయత్నం లైన్‌మ్యాన్ అప్రమత్తత కారణంగా విఫలమయింది. శనివారం వేకువజామున సూరత్ జిల్లాలోని కోసంబ- కిమ్ స్టేషన్ల మధ్య రైలు పట్టాలను కలిపే ఫిష్‌ప్లేట్లను తొలగించడంతోపాటు, 40-50 బోల్టులను వదులు చేశారు. రెండు ఫిష్ ప్లేట్లను తొలగించి పక్కనున్న ట్రాక్‌పై పెట్టారు. తెల్లవారు జాము 5.30 గంటల సమయంలో దీన్ని గమనించిన లైన్‌మ్యాన్ అధికారులను అప్రమత్తం చేశాడు. ఇంజినీర్లు, సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసిన తరువాత రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి.

ఔషధ కొనుగోళ్లలో సందీప్ ఘోష్ మోసాలు

- 42 రోజుల తర్వాత బెంగాల్‌లో జూడాల పాక్షిక హాజరు

కోల్‌కతా, సెప్టెంబరు 21: ఆర్జీకర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ ఔషధ కొనుగోళ్లలో భారీ అక్రమాలకు పాల్పడినట్లు సీబీఐ ఆరోపించింది. బయట ఏజెన్సీల నుంచి మందుల కొనుగోళ్ల జరిగినట్లు గుర్తించింది. బిడ్డర్ల ప్రక్రియలో నైపుణ్యాల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేయకుండా నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘించినట్లు పేర్కొంది. చాలా సందర్భాల్లో తక్కువ ధరకు కోట్ చేయడంతో అర్హత లేని బిడ్డర్లకు టెండర్లను కేటాయించారని, దీనిని గుర్తించి ఆర్జీకర్ యంత్రాంగం అప్రమత్తం చేసినా ఘోష్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలుస్తోంది. కాగా 42 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత బెంగాల్‌లో జూనియర్ వైద్యులు ఆందోళనలను విరమించారు. శనివారం పాక్షికంగా విధులకు హాజరయ్యారు.

కేదార్‌నాథ్ నడక దారిలో కుంగిన భూమి

రుద్రప్రయాగ్, సెప్టెంబరు 21: కేదార్‌నాథ్ యాత్ర శనివారం తాత్కాలికంగా నిలిచిపోయింది. నడకదారిలోని జంగిల్ చట్టి ఆకస్మికంగా 10-15 మీటర్ల మేర భూమి కుంగి భారీ గొయ్యి ఏర్పడడంతో అధికార్లు యాత్రను నిలిపివేశారు. దాంతో కేదార్‌నాథ్ నుంచి తిరిగి వస్తున్న యాత్రికులు చిక్కుకుపోయారు. అప్రమత్తమైన అధికారులు వారిలో సుమారు 5,000 మందిని సురక్షితంగా తరలించారు. ఈ మార్గంలో నడవడం కష్టంగా మారడంతో వేలాది మంది యాత్రికులు తిరిగి కేదార్‌నాథ్ మందిరం వద్దకే వెళ్లిపోయారు. కేదార్‌నాథ్ వెళ్లే భక్తులు మాత్రం మార్గాన్ని పునరుద్ధరించే వరకు పాటా, గుప్తకాశీ, రుద్రప్రయాగ్, శ్రీనగర్‌ల్లోనే ఉండిపోవాలని అధికారులు సూచించారు. కేదార్‌నాథ్‌కు నిర్వహిస్తున్న హెలికాప్టర్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని వివరించారు.

ఐఐటీహెచ్ ప్రొఫెసర్లకు ప్రపంచస్థాయి గుర్తింపు

- టాప్ శాస్త్రవేత్తల జాబితా ప్రకటించిన
- స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ.. 23 మందికి చోటు

కంది, సెప్టెంబరు 21: సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరిశోధనలతో ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలకు సంబంధించిన జాబితాను అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఎల్సెవియర్ సంస్థలు శనివారం విడుదల చేశాయి. అందులో ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు 23 మంది ఉన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ప్రొఫెసర్లను అభినందించారు. అధ్యాపకుల అత్యున్నత పరిశోధనల ప్రతిభ, వారి అంకితభావంతోనే ఇంతటి గౌరవప్రదమైన స్థానం దక్కిందని ఆయన కొనియాడారు.

చొరవ చూపండి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించాలని మోదీని కోరిన బైడెన్



శనివారం విల్మింగ్టన్‌లో మోదీ, బైడెన్ ఆత్మీయ ఆలింగనం

వాషింగ్టన్, సెప్టెంబరు 21: రెండేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాల్సిన అవసరం ఉందని, దీనికి భారత్ చొరవ చూపాలని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కోరారు. మోదీ-బైడెన్ మధ్య శనివారం జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా.. ఇరువురు నేతలు పలు అంశాలపై మాట్లాడారు. బైడెన్ తన స్వస్థలం విల్మింగ్టన్(వాషింగ్టన్‌కు 170 కిలోమీటర్ల దూరం)లో క్వాడ్ నాయకుల భేటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఉదయం ఫిలడెల్ఫియా చేరుకున్న భారత ప్రధాని మోదీకి.. భారతీయ-అమెరికన్ల నుంచి ఘన స్వాగతం లభించింది. అక్కడి నుంచి ఆయన నేరుగా విల్మింగ్టన్‌కు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఆయనను ఆప్యాయంగా కౌగిలించుకుని, ఆహ్వానించారు. విల్మింగ్టన్‌లో క్వాడ్ నేతల సమావేశానికి ముందు.. మోదీ-బైడెన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని గురించి బైడెన్ ప్రస్తావించారు. యుద్ధాన్ని నిలువరించే అంశంపై భారత్ చొరవ తీసుకోవాలని ఆయన మోదీని కోరారు. ప్రధాని మోదీ కూడా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో తన ఇటీవలి భేటీ గురించి బైడెన్‌కు వివరించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో చైనా చర్యలపైనా ఇరువురు నేతలు చర్చించారని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ వెల్లడించారు. ఇరువురు నేతలు భద్రత, సాంకేతికత, ఆర్థిక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. భారత్ కొనుగోలు చేయనున్న 31 ప్రిడియేటర్ డ్రోన్లపైనా ఒప్పందాలు కుదిరినట్లు సమాచారం. అంతరిక్ష రంగంలో సహకారం.. ఇతర అంశాలపైనా ఇరువురు నేతలు చర్చించారు. మోదీ కూడా తమ ద్వైపాక్షిక చర్చలు భారత పౌరులు, ప్రపంచ మేలు కోసం ఉద్దేశించినవని ఎక్స్‌లో పేర్కొన్నారు. సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు జరిగినట్లు తెలిపారు. కాగా.. ఆదివారం ఉదయం మోదీ న్యూయార్క్ చేరుకుంటారు. అక్కడ లాంగ్ ఐలాండ్‌లో 'మోదీ అండ్ యూఎస్' పేరుతో భారతీయ అమెరికన్లు నాసౌ వెటరన్స్ మెమోరియల్ కొలీజియంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి 14 వేల మంది హాజరవుతారని అంచనా. మోదీ తన అమెరికా పర్యటనలో భాగంగా సోమవారం ఐరాస సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పలు అమెరికా సంస్థలు, కంపెనీలకు సీఈవోలుగా ఉన్న భారత సంతతి అమెరికన్లతో ఆయన సమావేశమై.. కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్ల రంగంపై చర్చించే అవకాశాలున్నాయి.

శ్వేతసౌధంలో ఖలీస్థానీ మద్దతుదారులు

అమెరికా జాతీయ భద్రతా మండలి ఆధ్వర్యంలో భేటీ


వాషింగ్టన్, సెప్టెంబరు 21: మోదీ అమెరికాలో అడుగుపెట్టే కొన్ని గంటల ముందే కీలక పరిణామం జరిగింది. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఖలీస్థానీ మద్దతుదారులు, సిక్కు వేర్పాటువాద నాయకులతో కీలక సమావేశం జరిపింది. అమెరికా జాతీయ భద్రతామండలి ఆధ్వర్యంలో తొలిసారి జరిగిన ఈ సమావేశానికి అమెరికన్ సిఖ్ కాకస్ కమిటీ వ్యవస్థాపకుడు ప్రీత్‌పాల్ సింగ్‌తో పాటు సిఖ్ అమెరికన్ లీగల్ డిఫెన్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫండ్ సభ్యులు, పలు సిక్కు సంఘాల నేతలు హాజరయ్యారు. అమెరికా పౌరుల రక్షణకు భరోసానిచ్చింది. అదే సమయంలో అమెరికా గడ్డపై ఇతర దేశాలు తమ పౌరులను లక్ష్యంగా చేసుకోనీయబోమని శ్వేతసౌధం స్పష్టం చేసింది. సమావేశం తర్వాత ప్రీత్‌పాల్ సింగ్ మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అమెరికా సిక్కులకు మరింత రక్షణ కల్పించాలని కోరామన్నారు. ఖలీస్థానీ వేర్పాటువాదులకు అమెరికా, కెనడా ఆశ్రయం కల్పిస్తున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో స్వయంగా అధ్యక్ష భవనం సాక్షిగా జరిగిన పరిణామాలు కలకలం రేపుతున్నాయి. కాగా, ఖలీస్థానీ ఉగ్రవాది పన్నూ హత్యాయత్నం కేసులో అమెరికా జిల్లా కోర్ట్ భారత ప్రభుత్వానికి, దోభాల్‌కు సమన్లు జారీ చేసిన రోజుల వ్యవధిలోనే వైట్‌హౌస్‌లో ఈ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

23 వరకూ మోదీ బిజీ షెడ్యూల్

మూడు రోజుల పర్యటనలో మోదీ విల్మింగ్‌టన్‌లో క్వాడ్ సదస్సులో బైడెన్‌తో సమావేశమవుతారు. క్వాడ్ దేశాధినేతలను కలుసుకుంటారు. రెండో రోజున న్యూయార్క్ వెళ్లి పలువురు ప్రముఖ వ్యాపార, వాణిజ్యవేత్తలను కలుసుకుంటారు. అదే రోజున ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈనెల 23న ఐరాస జనరల్ అసెంబ్లీలో జరిగే సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్‌పై ప్రధాని ప్రసంగిస్తారు.

ఇకపై వారానికి ఒక్కసారే ఇన్సులిన్! షుగర్ వ్యాధిగ్రస్తులకు శుభవార్త

- త్వరలో భారత్‌లోనూ అందుబాటులోకి..
- షుగర్ వైద్య నిపుణుడు ఎ.రామ్‌కుమార్



స్పెయిన్ సదస్సుకు హాజరైన గుంటూరుకు చెందిన షుగర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ రామ్‌కుమార్

గుంటూరు(మెడికల్), సెప్టెంబరు 21: షుగర్ వ్యాధిగ్రస్తులకు ఇది శుభవార్తే. ఇకపై వారు నిత్యం ఇన్సులిన్ ఇంజక్షన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. వారానికి ఒక్కసారి ఇన్సులిన్ చేసుకొంటే సరిపోతుందని గుంటూరుకు చెందిన షుగర్ వైద్య నిపుణుడు డాక్టర్ ఎ.రామ్ కుమార్ స్పష్టం చేశారు. స్పెయిన్ దేశంలోని మ్యాడ్రీడ్ నగరంలో యూరోపియన్ అసోసియేషన్ ఫర్ స్టడీ ఆఫ్ డయాబెటిస్ వార్షిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో 30 దేశాల నుంచి 13000లకు పైగా డాక్టర్లు, వైద్య నిపుణులు పాల్గొన్నారు. సదస్సులో షుగర్ వ్యాధిలో నూతన చికిత్స విధానాలు, పరికరాలు గురించి చర్చించారు. సదస్సుకు హాజరైన రామ్‌కుమార్ శనివారం మీడియాతో మాట్లాడుతూ 'షుగర్ వ్యాధిగ్రస్తులు ఇప్పుడు బాసల్ ఇన్సులిన్, అంటే రోజుకోసారి ఇన్సులిన్ ఇంజక్షన్ తీసుకుంటుంటే, త్వరలో వారానికి ఒక్కసారి (ప్రతి ఆదివారం) తీసుకుంటే సరిపోతుంది. దీని పేరు ఏడబ్లూఐక్యూఎల్ఐ. ఇది ప్రస్తుతం కొన్ని దేశాల్లో అందుబాటులో ఉంది. ఇది మన దేశానికి కూడా త్వరలో రావచ్చు. ఆహార నియంత్రణ పాటిస్తూ లో-క్యాలరీ డైట్ ద్వారా ఇది సాధించవచ్చు. బ్రిటన్‌కు చెందిన ప్రొఫెసర్ రాయ్ టేలర్ చేసిన పరిశోధనల్లో తేలింది' అని డాక్టర్ రామ్ కుమార్ వెల్లడించారు.

నా వ్యాఖ్యలపై దుష్ప్రచారం

- అమెరికాలో చేసిన వ్యాఖ్యలపై రాహుల్ స్పందన



న్యూఢిల్లీ/జమ్ము-బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో సిక్కులను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. అమెరికాలో తాను చేసిన వ్యాఖ్యలపై అధికార బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తుందని, తన నోరు మూయించాలని అనుకుంటోందని శనివారం ఎక్స్ పోస్టులో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రతి సిక్కు, ప్రతి భారతీయుడూ.. నిర్భయంగా తన మతాన్ని ఆచరించే దేశం భారత్ కాకూడదా? నిజం వైపు నిలబడలేని బీజేపీ.. నా నోరు మూయించాలని అనుకుంటోంది. అమెరికాలో నేను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తోంది. దేశ, విదేశాల్లోని సిక్కు సోదరసోదరీమణులను నేను ఒక్కటే అడగాలనుకుంటున్నా. నేను చేసిన వ్యాఖ్యల్లో ఏమైనా తప్పు ఉందా?' అని రాహుల్ గాంధీ తన పోస్టులో అడిగారు. మరోవైపు, రాహుల్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని పలు సిక్కు సంఘాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. కాగా, రాహుల్‌గాంధీపై కర్ణాటక బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బెంగళూరు హైగ్రౌండ్స్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. బీజాపూర్, బెళగావి, బాగల్కోటెలలోనూ రాహుల్ గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రీన్‌కార్డు దారులకు శుభవార్త

- చెల్లుబాటును 36నెలలకు పొడిగించిన యూఎస్

వాషింగ్టన్, సెప్టెంబరు 21: చట్టబద్ధ శాశ్వత నివాస హోదాను సూచించే గ్రీన్ కార్డు చెల్లుబాటు కాలాన్ని పొడిగిస్తూ అమెరికా నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న 24 నెలల కాలాన్ని 36 నెలలకు పెంచింది. ఇది సెప్టెంబరు 10, 2024 నుంచి అమలులోకి వస్తుందని యూఎస్ ప్రకటించింది. ఇది గ్రీన్‌కార్డు దారులకు భారీగా ఊరట కలిగించే అంశం. చాలా వరకు గ్రీన్‌కార్డులు 10 సంవత్సరాల కాలపరిమితితో జారీ చేస్తారు. షరతులతో కూడిన శాశ్వత నివాస గుర్తింపు అయితే రెండు సంవత్సరాల కాలపరిమితితో జారీ చేస్తారు. ఆ కాలపరిమితి ముగియడానికి ఆరు నెలల ముందు లేక ముగిసిన వెంటనే గ్రీన్‌కార్డుదారు రెన్యువల్ కోసం 'ఐ 90'ని దరఖాస్తు చేసుకోవాలి. సక్రమంగా ఈ దరఖాస్తును సమర్పించిన గ్రీన్‌కార్డుదారులందరికీ ఓ రశీదు జారీ చేస్తారు. ఆ రశీదు జారీ అయిన వారందరికీ మొన్నటి వరకూ ఆటోమేటిక్‌గా 24 నెలల అదనపు వాలిడిటీ లభించేది. ఇప్పుడు ఆ వాలిడిటీ కాలాన్ని 36 నెలలకు పొడిగించారు.

రేపు అల్పపీడనం

- కోస్తా, రాయలసీమలకు వర్షసూచన

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మరోవైపు శనివారం ఉదయం నుంచి కోస్తా, రాయలసీమల్లో తీవ్రమైన ఎండ, ఉక్కపోత కొనసాగాయి. అమరావతి, వాల్తేరుల్లో 35.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, అటు ఉపరితల ఆవర్తనం, ఇటు ఎండలతో వాతావరణ అనిశ్చితి నెలకొని మధ్యాహ్నం నుంచి కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది.

కాసుల కక్కుర్తితోనే!

- మార్కెట్‌లో కిలో ధర 600 పైమాటే
- రూ.430కే సరఫరా ఎలా సాధ్యం
- నాడు ఆలోచించని యంత్రాంగం
- అంతా కలసి భక్తులకు మోసం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మార్కెట్‌లో స్వచ్ఛమైన నెయ్యి ఖరీదైనది. అందులోనూ ఆవు నెయ్యి అయితే మరింత ఎక్కువ ధర. తక్కువ క్వాలిటీ నెయ్యి తీసుకున్నా కిలో కనీసం రూ.600 ఉంటుంది. అంతకంటే తక్కువ ధరకు అమ్మాలంటే కల్తీ చేయాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. లేకుంటే గిట్టుబాటు కాదు. సాధారణంగా హోటళ్లలో ఉపయోగించే నెయ్యిలో వనస్పతి కలుపుతారు. చాలామంది ఇళ్లలోనూ అదే నెయ్యి వాడుతారు. వెజిటబుల్ వనస్పతి కిలో రూ.100-150 మధ్యలో ఉంటుంది. వనస్పతి కలిపిన నెయ్యిని తక్కువ ధరకు అమ్మినా గిట్టుబాటు అవుతుంది. నెయ్యిలో వనస్పతిని కలపడం నేరం. అయితే కొందరు చౌక ధర పేరిట వనస్పతి కలిపిన కల్తీ నెయ్యిని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక రెండో రకం.. నెయ్యిలో చనిపోయిన జంతువుల కొవ్వును కలిపి కల్తీ చేయడం. జంతువుల కొవ్వును చాలావరకు తినరు. దీంతో తక్కువ ధరకు అమ్ముతుంటారు. కిలో 50 రూపాయలకే ఎక్కడపడితే అక్కడ అమ్మేస్తుంటారు. ఎక్కువ లాభాలు రావాలనే దురాశతో జంతువుల కొవ్వును కూడా నెయ్యిలో కల్తీ చేసి అమ్ముతున్నారు. ఇలా కొందరు వెజిటబుల్ వనస్పతిని, మరికొందరు జంతువుల కొవ్వును నెయ్యిలో కలిపి చౌక ధర అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో ఈ రెండు రకాల వెజిటబుల్ వనస్పతి, జంతువుల కొవ్వును కలిపిన నెయ్యిని వాడినట్టు నిపుణులు చెబుతున్నారు. నెయ్యిని ఇదే తీరులో కల్తీ చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్ నివేదికలోనూ నెయ్యిలో వెజిటబుల్ వనస్పతి, జంతువుల కొవ్వు కల్తీ గురించి ప్రస్తావించింది. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడినట్టు నిర్ధారణ అయింది. కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. నెయ్యి కల్తీ చేయడానికి కారణం కాసుల కక్కుర్తే. గత ప్రభుత్వంలో టీటీడీ సేకరించిన నెయ్యి కిలో గరిష్ఠ ధర రూ.430 మాత్రమే. రివర్స్ టెండరింగ్ పేరిట టీటీడీకి ఆదా చేశామని నాడు వైసీపీ ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పారు. ఇంత తక్కువ ధరకు ఎలా వస్తుందని పాలకులు కానీ, టీటీడీ అధికారులు కానీ ఆలోచించలేదు. కాంట్రాక్టు పొందిన సంస్థ నాసిరకం నెయ్యిని సరఫరా చేసి సొమ్ము చేసుకుంది. అంతా కలసి తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేసి భక్తులను దారుణంగా మోసం చేశారు.

'తిరుమల' నెయ్యి కల్తీకి ఇదే కారణం

కల్తీ జరిగే తీరు ఇదీ

వనస్పతితో పాటు వేరుశనగ, నువ్వుల వంటి నూనె గింజల ఉత్పత్తుల నుంచి తీసే వెజిటబుల్స్ ఆయిల్స్‌ను నెయ్యిలో కలుపుతున్నారు. వనస్పతిని నెయ్యిలో కలిపితే.. పెద్దగా అనుమానం రాదు. అలాగే మరింత కారుచౌకగా లభించే జంతు కొవ్వు పదార్థాల నుంచి తీసే నూనెను శుద్ధి చేసి, నెయ్యిలో కలిపితే.. ఎవరికీ అనుమానం రాదని అంటున్నారు. జంతు మాంసం, రక్తం వాసన కోల్పోయే వరకు శుద్ధి చేస్తే.. ఈ నూనెను నెయ్యిలో కలిపే అవకాశం ఉంటుంది. ఇలాంటి శుద్ధి కేంద్రాలు రాష్ట్రంలో చెప్పుకోదగ్గ స్థాయిలో లేవు. ఇతర రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. కిలో నెయ్యిలో పావు కిలో కలిపితే మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు అమ్మినా గిట్టుబాటు అవుతుంది. తిరుమల ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యిని ఇదేతీరులో కల్తీ చేసి ఉంటారన్న అనుమానాలున్నాయి. హైదరాబాద్‌లో బిర్యానీ తయారీలో జంతుకొవ్వు వాడినట్టు ఇటీవలి దాడుల్లో వెల్లడైంది. బిర్యానీ సువాసనతో రుచిగా ఉండటానికి జంతువుల కొవ్వును వాడినట్టు తేలింది. జంతు వ్యర్థాలను సేకరించే వ్యక్తులు,సంస్థలు యూపీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాల్లో చాలాఉన్నాయి. అలాంటివాటినుంచి నెయ్యి సరఫరా సంస్థలు నూనె సేకరిస్తున్నట్లు తెలిసింది.

సరుకుల కొనుగోళ్లలో చేతివాటం!

- టీటీడీలో భారీ కమీషన్ల బాగోతం
- ఏటా రూ.600కోట్ల విలువైన కొనుగోళ్లు
- ప్రసాదాల్లో నాణ్యతకు తిలోదకాలు

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

తిరుమల, తిరుపతి దేవస్థానాల్లో ముడిసరుకుల కొనుగోళ్లలో భారీ కమీషన్ల దందా వెలుగు చూసింది. గత ఐదేళ్లలో కమీషన్ల పేరిట కొందరు కీలక వ్యక్తులు రూ.వందల కోట్లు దోచేశారని ప్రచారం సాగుతోంది. ఈ కారణంగానే ముడిసరుకుల విషయంలో నాణ్యతకు తిలోదకాలిచ్చినట్టు టీటీడీలోనే పలు వర్గాలు వాపోతున్నాయి. తిరుమలలో శ్రీవారి ప్రసాదాలు, అన్న ప్రసాదాలతో పాటు అన్నదాన సత్రం, అనుబంధ ఆలయాల్లో అవసరాలకు టీటీడీ ఏటా భారీగా ముడిసరుకులు కొనుగోలు చేస్తుంది. బడ్జెట్‌లో దీనికోసం రూ.600 కోట్లకు పైగా నిధులు కేటాయిస్తోంది. ఇందులో 90శాతం సరుకులు కొండపైన, మరో 10శాతం తిరుపతి, ఇతర అనుబంధ ఆలయాల్లో వినియోగిస్తున్నారు. మొత్తం 80 రకాల ముడిసరుకులు, వస్తువులు కొనాల్సి ఉంటుంది. ఏటా 5,475 టన్నుల నెయ్యి అవసరం కాగా, బియ్యం 7,300 టన్నులు, చక్కెర 18,250 టన్నులు, జీడిపప్పు 1,100 టన్నులు, ఎండు ద్రాక్ష 550 టన్నులు, యాలకులు 165 టన్నులు, బాదంపప్పు 22 టన్నులు, బెల్లం 550 టన్నులు, తేనె 6 టన్నులు, కొబ్బరికాయలు 58.40 లక్షల చొప్పున టీటీడీ కొనుగోలు చేస్తుంది. ఇవికాకుండా గోధుమ పిండి, గోధుమ రవ్వ, ఎండు మిర్చి, ఆవాలు, మిరియాలు, పసుపు, ధనియాలు, శెనగపిండి, కంది, వినప, పెసర తదితర పప్పులు వంటి అనేక ముడిసరుకులు భారీ పరిమాణంలో సేకరిస్తుంది. ఐదేళ్ల క్రితం వరకూ టీటీడీలో ప్రొక్యూర్‌మెంట్ విభాగంపై ఎప్పుడూ ఆరోపణలు రాలేదు. ఉద్యోగులు, అధికారులు చాలావరకూ నిబద్ధతతో, చిత్తశుద్ధితో వ్యవహరించే వారన్న పేరుండేది.

జోరుగా కమీషన్ల దందా

గత ఐదేళ్లుగా ప్రొక్యూర్‌మెంట్ విభాగంపై ఒత్తిడి పెరిగిందని సమాచారం. ముడిసరుకుల కొనుగోళ్లలో గతానికి భిన్నంగా కమీషన్ల కోసం కీలక వ్యక్తులు ఒత్తిడి చేయడం మొదలైందని ఆ విభాగానికి చెందిన కొందరు చెబుతున్నారు. ముడిసరుకులను తప్పనిసరిగా, భారీ పరిమాణంలో కొనాల్సి ఉండటం అవినీతిపరులకు కలిసొచ్చింది. ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా పర్సంటేజీల రూపంలో సులువుగా పెద్దమొత్తాలు చేతికొచ్చే అవకాశం ఉండటంతో దీన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఏడాదికి రూ.600 కోట్ల విలువైన ముడిసరుకుల కొనుగోళ్లు జరుగుతుండటంతో 15శాతం కమీషన్ కింద ఏడాదికి రూ.90 కోట్ల వరకూ దోచుకున్నారని సమాచారం. ఆ లెక్కన మొత్తం ఐదేళ్లలో రూ.450కోట్ల వరకూ వెనకేసుకున్నారని తెలుస్తోంది. ఇంత భారీస్థాయిలో అవినీతి టీటీడీలో మునుపెన్నడూ లేదని దేవస్థానం ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. ముడిసరుకుల కొనుగోళ్లలో కమీషన్ల కారణంగానే నాణ్యతకు తిలోదకాలిచ్చారనే ఆరోపణలున్నాయి. తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం గోదాముల్లో ముడిసరుకులను నిల్వ ఉంచి, తిరుమలకు, ఇతర ప్రదేశాలకు తరలిస్తారు. ప్రతి ముడిసరుకూ నమూనాలను తిరుమలలోని ల్యాబ్‌కు పంపించి అక్కడి సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేశాకే వినియోగంలోకి తీసుకుంటారు. అయితే ఈ ల్యాబ్ పేరుకే తప్ప వాస్తవంగా అక్కడ పరీక్ష చేసేదేమీ లేదన్న ఆరోపణ ఉంది. కీలక వ్యక్తుల ప్రమేయంతో నాణ్యత పరీక్షలు తూతూమంత్రంగానే సాగినట్టు చెబుతున్నారు. సరుకుల్లో నాణ్యత లేకపోవడంతోనే లడ్డూ మొదలుకుని అన్నప్రసాదాల వరకూ రుచిగా లేవన్న అభిప్రాయం భక్తుల్లో నెలకొంది.

ఆర్గానిక్ పేరిట దందా

టీటీడీకి పలువురు వ్యక్తులు, సంస్థలు విరాళంగా అందజేస్తున్న ఆర్గానిక్ ముడిసరుకుల వ్యవహారంలో పెద్ద ఎత్తున దందా సాగుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. విరాళాలుగా అందించే ముడిసరుకులకు ప్రతిగా దేవస్థానం దాతలకు దర్శనాల నిమిత్తం పాస్‌బుక్‌లు జారీ చేస్తోంది. ఈ అంశమే దందాకు దారి తీసినట్టు టీటీడీ వర్గాలు చెబుతున్నాయి. ఆర్గానిక్ ఉత్పత్తుల పేరిట చాలామంది అధిక ధర కోట్ చేసి భారీ మొత్తం విలువైన ముడిసరుకులు విరాళంగా ఇస్తున్నామని రికార్డు చేయించి పాస్‌బుక్కులు పొందుతున్నారని తెలుస్తోంది.

చివరి ఎకరానికీ నీరందాలి

- దెబ్బతిన్న గట్ల గండ్లు పూడ్చాలి
- కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ఇంజనీర్లు, కలెక్టర్ల సమావేశంలో మంత్రి నిమ్మల

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కాలువల చివరి ఎకరానికీ సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లు, జల వనరుల శాఖ ఇంజనీర్లను జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. శనివారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీసాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావుతో కలసి జిల్లాల కలెక్టర్లు, జల వనరుల శాఖ ఇంజనీర్లతో మంత్రి అత్యవసర సమావేశం నిర్వహించారు. అకాల వర్షాలు, వరదలతో దెబ్బతిన్న కాలువలు, చెరువులకు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను కోరారు. జలవనరుల శాఖ ఇంజనీర్లతో కలసి కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలని సూచించారు. ఉభయగోదావరి జిల్లాలు, కోనసీమ, గుంటూరు, ఎన్‌టీఆర్, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలేరు, ఎర్రకాలువ, బుడమేరు, కొల్లేరు గండ్ల పూడిక పనులతోపాటు ఆక్రమణలను కూడా గుర్తించాలన్నారు. కృష్ణా డెల్టాలో ఏలూరు, బందరు కాలువలు, బుడమేరు, గూడూరు చానల్ గండ్లు పూడ్చడంతోపాటు బకింగ్‌హామ్ కెనాల్ శివారు వరకూ నీరందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, మంత్రి నిమ్మల ఆదివారం నుంచి హంద్రీ నీవాసహా .. రాయలసీమ ప్రాజెక్టుల పర్యటన చేయనున్నారు. ప్రాజెక్టుల పరిస్థితిని రామానాయుడు పర్యవేక్షిస్తారు.

దీపావళి కానుకగా ఉచిత గ్యాస్: నిమ్మల


సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేస్తున్న మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 21: మహిళలకు ఉచిత గ్యాస్ పథకాన్ని దీపావళి పండుగనాడు ప్రారంభిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భగ్గేశ్వరంలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా వేలాది మంది రైతులతో కలిసి మంత్రి పాదయాత్ర చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ధాన్యంతో అభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ పాల్గొన్నారు.

కందిరీగల దాడిలో ఇద్దరు కూలీలు మృతి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు

రణస్థలం, సెప్టెంబరు 21: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం రావాడ పంచాయతీ పరిధి లంకపేటలో కందిరీగల దాడిలో ఇద్దరు రైతు కూలీలు మృతి చెందారు. మరో ఇద్దరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. లంకపేటకు చెందిన కిల్లారి రమణమ్మ, కిల్లారి సూరికృష్ణప్పడు, బొంతు కాంతమ్మ, ఇప్పిలి శ్రీరాములు మరికొందరు రైతులు శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా.. గ్రామ సమీపంలో కందిరీగలు దాడిచేశాయి. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు తొలుత రావాడ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కొండమలగాం సీహెచ్‌సీకి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)కి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ రమణమ్మ(60), సూరికృష్ణప్పడు(70) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. శ్రీరాములు, కాంతమ్మ గాయలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

బోట్ల ఆపరేషన్ పూర్తి

- మూడో బోటూ బయటకు!
- 12 రోజులపాటు సాగిన ఆపరేషన్


మూడో బోటును బయటకుతీసి శనివారం మధ్యాహ్నం పున్నమి ఘాట్‌కు తరలిస్తున్న దృశ్యం

విజయవాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజ్ వద్ద బోట్ల ఆపరేషన్ ముగిసింది. బ్యారేజ్‌లో ఇరుక్కుపోయిన మూడు బోట్లను పున్నమి ఘాట్‌కు చేర్చారు. భారీ క్రేన్లతో బోట్లను తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులు తొలుత అనుకున్నారు. అది విఫలం కావడంతో కావడి సూత్రాన్ని ఎంచుకున్నారు. రెండు బోట్లను కావడిలా తయారుచేసి.. వాటి సహాయంతో బ్యారేజీ వద్ద ఇరుక్కున్న మూడు బోట్లను బయటకు తీశారు. శనివారం మధ్యాహ్నానికి మూడో బోటును పున్నమి ఘాట్‌కు చేర్చారు. ఈ నెల ఒకటో తేదీన ప్రకాశం బ్యారేజీకి 11.47లక్షల క్యూసెక్కుల వరద రావడంతో ఎగువన గొల్లపూడి వైపు నుంచి ఐదు కార్గో బోట్లు కొట్టుకువచ్చాయి. ఈ బోట్లలో రెండు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. మిగిలిన మూడింటిలో ఒకటి పైకి కనిపించగా, రెండు నీటిలో మునిగిపోయాయి. ఈ మూడు బోట్లను బయటకు తీసే ఆపరేషన్‌ను బెకమ్, సీ లయన్ కంపెనీలు, కాకినాడ అబ్బులు టీం కలిసి పూర్తి చేశారు. బెకమ్ కంపెనీ కౌంటర్ వెయిట్లను ఏర్పాటుచేసి ఈ నెల 10 నుంచి బోట్ల ఆపరేషన్ చేపట్టింది. తొలుత భారీ క్రేన్లతో బోట్లను బయటకు లాగాలని అనుకున్నారు. బోట్లు నీటిలో మునిగిపోవడంతో బరువు బాగా పెరిగింది. దీంతో క్రేన్లతో తీయడం సాధ్యం కాలేదు. తర్వాత వైజాగ్‌కు చెందిన సీ లయన్ కంపెనీ డైవర్లు బోట్లను ముక్కలు చేసి, క్రేన్లతో తీద్దామని భావించారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో బోట్ల కటింగ్ కుదరలేదు. దీంతో కాకినాడకు చెందిన అబ్బులు టీం రెండు కార్గో బోట్లపై టన్ను బరువు కలిగిన మూడు ఇనుప గడ్డర్లను అమర్చి కావడిలా ఏర్పాటు చేసింది. వాటి ద్వారా నీటిలో మునిగిన మొదటి బోటును లాగడం సాధ్యం కాకపోవడంతో మరో రెండు బోట్లు ఏర్పాటు చేశారు. ఈ నాలుగు బోట్లు కలిసి మొదటి బోటును బయటకు లాగాయి. తర్వాత రెండో, మూడో బోట్లను కూడా బయటకు తీశారు. ప్రస్తుతం ఈ మూడు బోట్లు పున్నమిఘాట్ వద్ద ఉన్నాయి.

సౌమ్యనాథస్వామి సేవలో జస్టిస్ రామకృష్ణ ప్రసాద్


సౌమ్యనాథస్వామి ఆలయంలో జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ దంపతులు

నందలూరు, సెప్టెంబరు 21: అన్నమయ్య జిల్లా నందలూరులోని సౌమ్యనాథ స్వామి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గమ్మినేని రామకృష్ణప్రసాద్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టత గురించి వివరించారు. ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ వెంట రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సీతారామమూర్తి దంపతులు, కడప జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీదేవి, నందలూరు కోర్టు మేజిస్ట్రేట్ భార్గవి, రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్, నందలూరు కోర్టు సూపరింటెండెంట్ రమేష్, టీటీడీ ఇన్‌స్పెక్టర్ దిలీప్ ఉన్నారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకం

- వీఐటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్


స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

తుళ్లూరు, సెప్టెంబరు 21: వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో యువత పాత్ర కీలకమని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. రాజధాని అమరావతిలోని వీఐటీ (వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)-ఏపీ విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయ విద్యార్థులుగా దేశ నిర్మాణం అభివృద్ధికి మీ వంతు కృషి చేయాలని కోరారు. విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న అనేక నైపుణ్యాభివృద్ధి సామాజిక సేవా కార్యక్రమాలను గవర్నర్ కొనియాడారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో జూనియర్ కళాశాలలో చదివి మొదటి స్థానంలో నిలిచిన ప్రతిభావంతులైన విద్యార్థినీ, విద్యార్థులకు వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో ఉచిత విద్య, వసతి సౌకర్యాలను అందించే స్టార్ పథకం చాలా గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ స్నాతకోత్సవంలో 1,665 మందికి డిగ్రీ పట్టాలు, 19 మందికి బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఫౌండర్ అండ్ చాన్సలర్ విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర విశ్వనాథన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి విశ్వనాథన్, వైస్ చాన్సలర్ ఎస్‌వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ ముదిగంటి, డీన్ అకాడమిక్ ఎస్.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్సీ 'తోట'కు షాక్

- త్రిమూర్తులు కుటుంబం ఆధీనంలో12.64 ఎకరాల సీలింగ్ భూమి
- పోలీసు బందోబస్తు నడుమ స్వాధీనం... బోర్డులు ఏర్పాటు


భూముల వద్ద పోలీసులు

కాకినాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు షాక్ తగిలింది. కాకినాడ జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెంలో ఆయన అధీనంలో ఉన్న సీలింగ్ భూమిని ఎట్టకేలకు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. పోలీసుల సమక్షంలో కాకినాడ ఆర్డీవో శనివారం ఉదయం ఆ భూముల్లో అక్రమ రొయ్యల చెరువులను ధ్వంసం చేశారు. అక్కడ ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. త్రిమూర్తులు 2005లో తన కుటుంబ సభ్యుల పేరున సీలింగ్ భూములు కొనుగోలు చేశారు. ఆ భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు పలుమార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. విషయం కోర్టు వరకూ వెళ్లింది. ఇటీవల న్యాయస్థానం నుంచి అధికారులకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో సీలింగ్ భూములను ప్రభుత్వానికి దఖలు పర్చాల్సిందేనంటూ కాకినాడ ఆర్డీవో ఈ నెల 19న తోట వేసిన పిటిషన్‌ను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఆ భూములను శనివారం స్వాధీనం చేసుకున్నారు.

ఇదీ భూమి చరిత్ర...

పల్లిపాలెంలో సుబ్బారెడ్డి అనే వ్యక్తి పేరు మీద 35 ఎకరాల భూమి ఉండేది. ల్యాండ్ సీలింగ్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఆ భూమిని తీసుకోవడానికి అధికారులు వెళ్లారు. ఇరుపక్షాల వాదోపవాదనల తరువాత చట్టం మేరకు 12.64 ఎకరాలు ప్రభుత్వానికి స్వాధీనపర్చాలంటూ అధికారులు ఆదేశించారు. అయితే ఆ తరువాత అధికారులు ఆ విషయాన్ని వదిలేశారు. ఈ వివాదాస్పద భూమి మొత్తాన్ని తోట త్రిమూర్తులు కుటుంబం 2005లో కొనుగోలు చేసింది. రాజకీయ పలుకుబడి ఉపయోగించిన తోట.. అధికారులు తన భూమి జోలికి రాకుండా కొద్దికాలం అడ్డుకోగలిగారు. అయితే 2011లో మళ్లీ ఫైళ్లు కదిలాయి. తోట కుటుంబం అధీనంలోని 12.64 ఎకరాల సీలింగ్ భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేయాలని అధికారులు నోటీసులు పంపారు. వాటిని తన రాజకీయ పలుకుబడితో మళ్లీ పక్కన పెట్టించారు. 2020లో మళ్లీ రెవెన్యూ అధికారులు నోటీసులు పంపారు. ఈసారి త్రిమూర్తులు హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల హైకోర్టు దీనిపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇస్తూ.. త్రిమూర్తులు వాదన కూడా వినాలని ఆదేశించింది. దీంతో సీలింగ్ భూములు తమవేనంటూ తోట రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశారు. ఈనెల 19న ఆ వినతిని రెవెన్యూ కోర్టు కొట్టివేసింది. దీంతో 12.64 ఎకరాల సీలింగ్ భూములను ఎట్టకేలకు తోట త్రిమూర్తుల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇందులో 8.50 ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉండగా ఎక్స్‌కవేటర్లతో చదును చేసి బోర్డులు పెట్టారు. వరి సాగవుతున్న మిగిలిన భూముల్లోనూ బోర్డులు ఏర్పాటు చేశారు.

గెజిటెడ్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజగోపాల్



గుంటూరు సిటీ, సెప్టెంబరు 21: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా ఖజానా శాఖ అధికారి వి.రాజగోపాల్ ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్ష పదవిలో కొనసాగిన శివరామ ప్రసాద్ మంత్రి ఓఎస్‌డీగా వెళ్లడంతో ఈ ఎన్నిక అనివార్యమయింది. రాజగోపాల్ పేరును రాష్ట్రంలోని పలు జిల్లాల ఖజానా శాఖ అధికారులు ప్రతిపాదించారు. అందరి ఆమోదంతో రాజగోపాల్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఇటలీ పర్యాటకులకు తప్పిన ప్రాణాపాయం


ప్రమాదం నుంచి బయటపడిన విదేశీయులు

మల్కాపురం, సెప్టెంబరు 21: ఇటలీ దేశానికి చెందిన దాదాపు పది మంది శనివారం విశాఖ నగర శివారు యారాడ తీరం సందర్శనకు వచ్చారు. వీరిలో ఐదుగురు స్నానానికి దిగారు. ఒక్కసారిగా వచ్చిన కెరటానికి నలుగురు కొంతదూరం కొట్టుకుపోయారు. ఒకరు ఈదుకుంటూ బయటకు వచ్చారు. కెరటాల్లో చిక్కుకున్న మిగిలిన వారు కేకలు వేయడంతో లైఫ్‌గార్డులు (గజ ఈతగాళ్లు) వారిని కాపాడారు.

విశాఖ ఉక్కు ఉద్యోగులకు అలవెన్సుల్లో కోత

- హెచ్‌ఆర్‌ఏ తగ్గింపు, ఎల్‌టీసీ కూడా లేనట్టే

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఉద్యోగులకు మరికొన్ని అలవెన్సులు తగ్గిస్తూ శనివారం యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ప్లాంటు క్వార్టర్లలో కాకుండా బయట ఉంటున్న వారికి ప్రస్తుతం ఇంటి అద్దె అలవెన్స్ ఇస్తోంది. ప్లాంటులో ఆరు వేల క్వార్టర్లు మాత్రమే ఉండడంతో సుమారు ఏడు వేల మంది బయట అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. వారికి నెలకు రూ.6.8 కోట్లు హెచ్‌ఆర్‌ఏగా చెల్లిస్తోంది. ఇకపై ఎవరికీ హెచ్‌ఆర్‌ఏ ఇవ్వబోమని యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అంటే ఒక్కో ఉద్యోగి సగటున నెలకు రూ.9 వేలు నష్టపోతారు. వాస్తవానికి యాజమాన్యం రూ.9 వేలు హెచ్‌ఆర్‌ఏ ఇస్తుంటే.. ఉద్యోగులు ఇంకో మూడు, నాలుగు వేల రూపాయలు ఎక్కువ వేసుకొని డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లలో ఉంటున్నారు. హెచ్‌ఆర్‌ఏ తీసేశారు కాబట్టి వారికి క్వార్టర్లు కేటాయిస్తారా?...అంటే అన్ని అందుబాటులో లేవు. కేవలం 700 వరకూ ఖాళీగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయాలంటే చేతిలో డబ్బులు లేవు. ఇదిలా ఉంటే రెండేళ్లకు ఒకసారి కుటుంబంతో విహార యాత్రకు వెళ్లేందుకు రూ.60 వేల నుంచి రూ.90 వేలు ఎల్‌టీసీ కింద ఇచ్చేవారు. అంటే నెలకు రూ.2,500 నుంచి రూ.3 వేలు వస్తుంది. దీనిని కూడా ఇకపై ఇవ్వబోమని యాజమాన్యం ప్రకటించింది. ఇవన్నీ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు వర్తిస్తాయని వెల్లడించింది. ఉద్యోగులకు అలవెన్సులు అన్నీ తీసేసి, జీతాలు కూడా సకాలంలో ఇవ్వకుండా, ఉత్పత్తి మాత్రం పూర్తిస్థాయిలో చేయాలని చెప్పడం ఏమిటని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఉద్యోగులను చాలా ఒత్తిడికి గురిచేస్తున్నారని, ఉద్యోగాలు మానేసి వెళ్లిపోయే పరిస్థితులు కల్పిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

25న విజయవాడలో ఆలిండియా రేషన్ డీలర్స్ సమావేశం

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా రేషన్ డీలర్స్ సంక్షేమ సమాఖ్య సమావేశాన్ని ఈ నెల 25న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఆ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు తెలిపారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒకే రేషన్ విధానం, డీలర్లందరికీ ఒకే విధంగా కమిషన్ చెల్లించాలనే డిమాండ్‌తో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.

గేదె నోట్లో 60 తాటి టెంకలు!


గేదె నోటి నుంచి తాటి టెంకలు తీస్తున్న వైద్యుడు రాజు, వెలికితీసిన తాటి టెంకలు

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి ప్రాంతీయ పశు వైద్యశాలలో ఓ గేదె నోటి నుంచి సుమారు 60 తాటి టెంకలను బయటకు తీశారు. తాటియాకులగూడెం శివారు మధ్య బర్రింకలపాడుకు చెందిన నారం పుష్పకు చెందిన పాడి గేదె మేతకు వెళ్లిన సమయంలో తాటి కాయలు తింది. దీంతో నోటి కింది దవడలో తాటి టెంకలు ఇరుక్కుపోయాయి. రెండు రోజులుగా గేదె నీరు కూడా తాగలేక ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. గేదెను శనివారం జీలుగుమిల్లి పశు వైద్యశాలకు తీసుకెళ్లారు. పశు వైద్యుడు ఎల్ఎస్ఏ రాజు, సిబ్బంది కలసి గేదె నోటి నుంచి 60 తాటి టెంకలను బయటకు తీశారు. గేదెకు ప్రాణాపాయం తప్పింది.

- జీలుగుమిల్లి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

జగన్.. మహా పాతకం!

తిరుమల లడ్డూను కాపీ కొట్టాలని ప్రైవేటు వ్యక్తులే కాదు.. అనేక దేవాలయాలు కూడా ప్రయత్నించాయి. ఈ విషయంలో ఇంతవరకూ ఎవరూ సక్సెస్ కాలేదు. లడ్డూ ప్రసాదాన్ని ఎవరూ కాపీ చేయలేకపోవడం అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి మహత్యం అని శ్రీవారి భక్తులు విశ్వసిస్తారు. శతాబ్దాలుగా తన ప్రాశస్త్యం నిలుపుకొంటూ వచ్చిన లడ్డూను గత జగన్‌రెడ్డి ప్రభుత్వం కాపీ కొట్టలేకపోయినా నాణ్యతను మాత్రం దెబ్బతీయగలిగింది. ఇటీవలి కాలంలో లడ్డూ నాణ్యత దారుణంగా పడిపోయింది. ఐదేళ్ల క్రితం తిరుమల నుంచి లడ్డూ తీసుకువచ్చి ఎవరికైనా ఇస్తే ఆ పరిసరాలు ఘుమఘుమలాడేవి. ఈ మధ్య కాలంలో ఆ ఘుమఘుమలు మాయమయ్యాయి. లడ్డూ కూడా ఎండిపోయినట్టుగా ఉంటోంది. ఇలా జరగడానికి తిరుమల తిరుపతి దేవస్థానం గత పాలక వర్గం నిర్వాకమే కారణం. నాసిరకం నెయ్యితో పాటు జీడిపప్పు, కిస్మిస్‌లు కూడా నాణ్యమైనవి వాడకపోవడంతో లడ్డూ తన రుచిని కోల్పోయింది. ఇప్పుడు లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో కల్తీ జరిగిందని తేలింది. ఈ మహా పాతకానికి ఎవరు కారణం? జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన దిక్కుమాలిన రివర్స్ టెండరింగ్ విధానమే ఇందుకు కారణం. తిరుమల తిరుపతి దేవస్థానం గత పాలక మండలి ఈ రివర్స్ టెండరింగ్ విధానం అమలు వల్ల రేటు తగ్గించిన నెయ్యి సరఫరాదారులు కల్తీ నెయ్యి సరఫరా చేశారు. నాణ్యమైన ఆవు నెయ్యిని పేరొందిన కంపెనీలు బహిరంగ మార్కెట్‌లో కిలో 800 రూపాయల వరకు విక్రయిస్తుండగా టీటీడీ పాలక మండలి మాత్రం రూ.400 కంటే తక్కువకు నెయ్యి టెండర్లను ఖరారు చేసింది. ఈ తప్పుడు నిర్ణయం కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయింది. మహా ప్రసాదాన్ని కలుషితం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. ఆ దేవదేవుడికి అపచారం చేశారు. చీప్ అండ్ బెస్ట్ అన్న వాదన అర్థరహితం. నాణ్యమైన వస్తువు ఏదీ తక్కువ ధరకు లభించదు. ఈ చిన్న లాజిక్‌ను మిస్సయిన టీటీడీ గత పాలక మండలి రివర్స్ టెండరింగ్ విధానం అమలు చేసి భక్తుల మనోభావాలతో ఆడుకుంది. కల్తీ నెయ్యి సరఫరా చేసిన సంస్థ తొలుత కిలో నెయ్యికి 610 రూపాయలు కోట్ చేసింది. తర్వాత రివర్స్ టెండరింగ్‌లో పాల్గొని ఆ ధరను అమాంతం కిలోకు 424 రూపాయలకు తగ్గించింది. బుద్ధీ జ్ఞానం ఉండి ఉంటే అధికారులకు, పాలక మండలికి అప్పుడే అనుమానం రావాల్సింది. కానీ పట్టించుకోలేదు. భక్తుల సొమ్ముతోనే ప్రసాదాలకు అవసరమైన ముడి సరుకులను కొనుగోలు చేస్తారు. ఇందులో నాణ్యత విషయంలో రాజీపడి కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమిటో గత పాలక మండలే చెప్పాలి. కొండ మీదకు వచ్చే నెయ్యి ట్యాంకర్లను నాణ్యత విషయంలో తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటల్లో కూడా వాస్తవం లేదు. నెయ్యి కల్తీ జరిగిందా? లేదా? అని నిర్ధారించే ల్యాబ్‌లు తిరుపతిలో లేవు. అలాంటప్పుడు ప్రతి ట్యాంకర్‌ను ఎలా పరీక్షించారో జగన్‌రెడ్డి చెప్పాలి. వాస్తవానికి జగన్‌రెడ్డి కుటుంబానికి ఆ దేవదేవుడిపై నమ్మకం, విశ్వాసాలు లేవు. క్రైస్తవ మతాన్ని ఆచరించే వైఎస్ కుటుంబంలోని మహిళలు తిరుమల కొండకు వెళ్లి దేవదేవుడిని దర్శించుకోవడానికి కూడా ఇష్టపడరు. అయితే వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశ వ్యాప్తంగా అనేక మంది ప్రముఖులు వస్తుంటారు. దీంతో తిరుమలను సొంత అవసరాలకు వాడుకోవడం కోసం జగన్ అండ్ కో బ్రహ్మాండమైన స్కెచ్ రూపొందించారు. జగన్ అధికారంలోకి రాగానే ధర్మారెడ్డిని టీటీడీ జేఈఓగా నియమించారు. తర్వాత ఆయననే ఈవోగా ప్రమోట్ చేశారు. అప్పటి నుంచి కొండపైన ధర్మారెడ్డి మాటే శాసనమైంది. జగన్‌రెడ్డి సొంత పనులు చక్కబెట్టడానికి తిరుమలను వేదికగా మార్చుకున్నారు. దైవ దర్శనానికి వచ్చే ప్రముఖులకు వీఐపీ ఆతిథ్యం ఇచ్చి మంచి చేసుకొనేవారు. ఇటు జగన్‌రెడ్డికీ, అటు ఆ ప్రముఖులకూ అనుసంధానకర్తగా ధర్మారెడ్డి వ్యవహరించేవారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర ఏజెన్సీల అధికారులు కొండకు వచ్చినప్పుడు ధర్మారెడ్డి చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. మధ్యలో ఢిల్లీ వెళ్లి ఆయా ప్రముఖులను కలుసుకొని తీర్థ ప్రసాదాలు అందజేసి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఇచ్చి రమ్మన్నారని చెప్పేవారు. ఈ విధంగా చేయడం ద్వారా జగన్‌రెడ్డి పట్ల ఆయా ప్రముఖులకు సాఫ్ట్ కార్నర్ ఏర్పడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ మహా దేవుడిపై విశ్వాసంతో, భక్తితో వ్యయప్రయాసలకు ఓర్చి కొండపైకి చేరుకొనే భక్తులకు సౌకర్యాల కల్పనను గాలికొదిలేసి జగన్‌రెడ్డికి ఉపయోగపడతారనుకున్న ప్రముఖుల సేవలో తరించేవారు. నాటి పాలక మండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి.. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కోసం ఆ దేవదేవుడిని ముడిసరుకుగా వాడుకున్నారు. జగన్ అధికారంలో ఉన్నంతకాలం ఢిల్లీలో వివిధ సంస్థల్లో పలుకుబడి కలిగిన ముగ్గురు నలుగురిని పాలక మండలి సభ్యులుగా నియమిస్తూ వచ్చారు. వీరంతా కలసి జగన్‌రెడ్డి వ్యవహారాలను చక్కబెట్టేవారు. 2019–2024 మధ్య కాలంలో కొండపైన జరిగింది ఇదే!

> కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వివరణ, చేస్తున్న వాదన పేలవంగా ఉంది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తుండటంతో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తెరమీదకు తెచ్చారని ఆయన వాదిస్తున్నారు. రాజకీయాలకు దేవుడిని వాడటం ఏమిటి? అని బోలెడు ఆశ్చర్యపోయారు. 2019కు ముందు పింక్ డైమండ్ పేరిట చేసిన రాజకీయాన్ని జగన్‌రెడ్డి మరచిపోతే ఎలా? శ్రీవారికి భక్తులు ఎప్పటి నుంచో సమర్పించిన కానుకల్లోని విలువైన వాటిని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తస్కరించుకు పోయారని, వాటిని కరకట్టపై ఉన్న ఆయన నివాసంలో దాచిపెట్టారని ఎంపీ విజయసాయిరెడ్డి అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేయలేదా? రమణదీక్షితులు వంటి వారు వంత పాడలేదా? ఇప్పుడు తత్వం బోధపడిన అదే రమణదీక్షితులు గత ఐదేళ్లుగా కొండపై జరిగిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని అంటున్నారు.

అవినీతి మకిలి!

గతంలో కొండ మీద అవినీతి ఎక్కువగా ఉండేది కాదు. దేవస్థానం సిబ్బంది కూడా స్వామివారిపై భక్తి, భయంతో ఉండేవారు. గత ఐదేళ్లుగా రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో శ్రీవారి సన్నిధిలో అవినీతి వేళ్లూనుకుంది. కమీషన్ల సంస్కృతి ప్రవేశించింది. పాలక మండలి సభ్యులు డమ్మీలుగా మారిపోయారు. అంతా వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి కనుసన్నల్లోనే జరిగింది. ఈ నేపథ్యంలోనే కల్తీ నెయ్యి బాగోతం చోటుచేసుకుంది. నాణ్యమైన నెయ్యి కావాలంటే తక్కువ ధరకు ఇవ్వలేమని క్రెడిబిలిటీ ఉన్న కంపెనీలు స్పష్టం చేసినప్పుడు ఎవడో వచ్చి తక్కువకు సరఫరా చేస్తామంటే ఒప్పుకోవడంలోనే గోల్‌మాల్ జరిగింది. కనీస పాపభీతి కూడా లేకుండా దేవుడిపైన నమ్మకంతో భక్తులు సమకూర్చిన సొమ్ముకే కన్నం వేశారు. కమీషన్ల పర్వానికి తెరలేపారు. పవర్ బ్రోకర్లు పుట్టుకొచ్చారు. ప్రముఖులకు దేవుడిపై ఉన్న భక్తిని ఆసరాగా చేసుకొని వ్యక్తిగత పలుకుబడి పెంచుకున్నారు. మొత్తంగా తిరుమలను కలుషితం చేశారు. ఈ క్రమంలో పాలక మండలిలో సభ్యులుగా నియమితులవడానికి పోటీ పెరిగిపోయింది. శ్రీవెంకటేశ్వరుడిపై భక్తితో కాకుండా ఆ దేవదేవుడిని సొంత అవసరాలకు వాడుకోవడానికి ఎంతైనా ఇచ్చి పాలక మండలి సభ్యులుగా నియమితులు కావడానికి కొందరు ప్రయత్నించారు. బోర్డు సభ్యుడిగా నియమిస్తామంటే 20 కోట్లు ఇవ్వడానికి కూడా సిద్ధం అనేవారు ఎందరో! గతంలో స్వామి వారిపై భక్తితో సేవ చేయడానికి బోర్డు సభ్యులుగా నియమితులు కావాలని కోరుకునేవారు. క్రమంగా టీటీడీ చైర్మన్ పదవి కూడా రాజకీయ పునరావాస కేంద్రంగా మారిపోయింది. గత ఐదేళ్లలో పరిస్థితి మరింత వికటించింది. స్వామివారి సేవను విస్మరించి అప్పటి ముఖ్యమంత్రి సేవలో కింది నుంచి పై వరకూ తరించిపోయారు. తిరుమలకు ఉన్న విశిష్టతను మంటగలిపారు. టీటీడీలో పనిచేస్తున్న సిబ్బందిలో భయం, భక్తి సన్నగిల్లింది. అవినీతి స్వైర విహారం చేసింది. దేవుడి సన్నిధిలో అవినీతికి పాల్పడటం మహాపాతకం అన్న పాపభీతి కూడా లేకుండా పోయింది. తన సమక్షంలో జరుగుతున్న అరాచకాలను చూస్తూ కూడా ఆ దేవదేవుడు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. తిరుమల కొండ సర్వ పాపాలకూ వేదికగా మారిపోయినా అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు ఎవరినీ శిక్షించకపోవడం ఏమిటి? అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. ఆ దేవదేవుడిని భక్తి, నమ్మకంతో కాకుండా స్వార్థం కోసం వాడుకున్నారు. ఇంత కాలానికి పాపం పండింది. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టుగా కల్తీ నెయ్యితో ప్రసాదాలు చేయించే స్థాయికి దిగజారారు. ఈ దశలో నేను ఉన్నాను– అన్నీ చూస్తున్నాను అన్నట్టుగా ఆ దేవదేవుడే మేల్కొన్నాడు. ఆవు నెయ్యి కల్తీ జరిగిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చెవిన పడేట్టు చేశాడు.



కల్తీ వ్యవహారం బయటపడగానే దేశ విదేశాలకు చెందిన భక్తులు మండిపడ్డారు. ఆవు నెయ్యిలో పంది కొవ్వు నుంచి తీసిన నూనె కలిపారని నిర్ధారణ కావడంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఉలిక్కిపడింది. ఇంతకాలంగా తాము జంతువుల కొవ్వుతో చేసిన నెయ్యితో తయారుచేయించిన లడ్డూలను తిన్నామా! అని భక్తులు తీవ్ర మానసిక ఆవేదన చెందారు. ఈ మహాపాతకానికి పాల్పడిన వారిని కఠినాతికఠినంగా శిక్షించాల్సిందే. మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలన్న డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీఐ విచారణకు వెంటనే అనుమతివ్వాలి. మార్కెట్ ధరలో సగం ధరకే నెయ్యి సరఫరా చేయడానికి ముందుకు వచ్చిన సంస్థలను అనుమానించకుండా వారికే టెండర్లను కట్టబెట్టిన వారందరినీ శిక్షించాలి. దేవుడిపై భక్తితో తాము సమర్పించే కానుకలను ఆదా చేయాల్సిందిగా భక్తులు ఎవరైనా కోరారా? తిరుమల లడ్డూ విశిష్టతను, పవిత్రతను కాపాడలేకపోయిన ప్రతి ఒక్కరినీ దోషులుగా నిర్ధారించాలి. మొత్తంగా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ప్రక్షాళన చేయాలి. దేవాలయాల్లో కొనుగోళ్లకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనకు ఒక కమిటీని నియమించాలి. ధర ఎక్కువైనా ప్రముఖ బ్రాండ్ కంపెనీల వస్తువులే మనం కొనుగోలు చేస్తాం కదా? అలాంటిది ఆ దేవదేవుడి లడ్డూ ప్రసాదం తయారీ విషయంలో రాజీపడాల్సిన అవసరం ఏమిటి? ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారు? వారికి కలిగిన ప్రయోజనం ఏమిటో కూడా నిగ్గు తేల్చాలి. కల్తీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీని బ్లాక్ లిస్ట్ చేస్తున్నామని ప్రస్తుత ఈవో శ్యామలరావు చెప్పారు. బ్లాక్ లిస్ట్ చేయడం ఏమిటి? భక్తుల మనోభావాలతో ఆడుకున్న ఆ కంపెనీ యజమానిని కఠినంగా శిక్షించాలి కదా? కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వివరణ, చేస్తున్న వాదన పేలవంగా ఉంది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తుండటంతో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తెరమీదకు తెచ్చారని ఆయన వాదిస్తున్నారు. రాజకీయాలకు దేవుడిని వాడటం ఏమిటి? అని బోలెడు ఆశ్చర్యపోయారు. 2019కి ముందు పింక్ డైమండ్ పేరిట చేసిన రాజకీయాన్ని జగన్‌రెడ్డి మరచిపోతే ఎలా? శ్రీవారికి భక్తులు ఎప్పటి నుంచో సమర్పించిన కానుకల్లోని విలువైన వాటిని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తస్కరించుకు పోయారని, వాటిని కరకట్టపై ఉన్న ఆయన నివాసంలో దాచి పెట్టారని ఎంపీ విజయసాయిరెడ్డి అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేయలేదా? రమణదీక్షితులు వంటి వారు వంత పాడలేదా? ఇప్పుడు తత్వం బోధపడిన అదే రమణదీక్షితులు గత ఐదేళ్లుగా కొండపై జరిగిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని అంటున్నారు.

> తన పేరిట భక్తులకు అందజేసే లడ్డూ ప్రసాదాలను కల్తీ నెయ్యితో చేయించిన వారందరినీ ఏదో ఒక రూపంలో శిక్షించడానికి ఆ దేవదేవుడే పూనుకోవాలి. లేని పక్షంలో కొండ మీద కొలువైన శ్రీవెంకటేశ్వరుడిని కూడా అమ్మకానికి పెడతారు.

ఏ దేవుడు ఎంత పవర్‌ఫుల్?

మనుషుల్లో స్వార్థం పరాకాష్టకు చేరుకుంది. స్వార్థం కోసం దేవుళ్లను సృష్టించడం, ఆ దేవుళ్లను వాడుకోవడం అనాదిగా వస్తున్నదే. దేవుళ్లను మార్కెటింగ్ చేయడం కూడా మనుషుల స్వార్థ ఫలితమే. ఫలానా గుడిలోని దేవుడు చాలా పవర్‌ఫుల్ అని ప్రచారం చేయడం చూస్తున్నాం. దేవుడు ఫలానా చోటే ఎందుకు పవర్‌ఫుల్‌గా ఉంటాడు? దేవుడు సర్వాంతర్యామి అని కదా చెబుతారు? కొన్ని దేవాలయాలు వెలవెలబోతుంటాయి. మరికొన్ని దేవాలయాలు కళకళలాడుతుంటాయి. ఇదంతా మార్కెటింగ్ మహత్యమే. చిలుకూరు బాలాజీ దేవాలయాన్నే తీసుకుందాం. అక్కడకు వెళ్లే వారికి అమెరికా వీసాలు లభిస్తాయని ప్రచారం చేశారు. ఇంకేముంది.. అమెరికాలో చదువుకోవాలనుకునేవారు, అక్కడ ఉద్యోగాలు చేయాలనుకొనేవారు చిలుకూరుకు క్యూ కట్టారు. వీసా దరఖాస్తులు ప్రాసెస్ చేయడం చిలుకూరు బాలాజీ టెంపుల్ పని కాదు కదా. మనుషుల బలహీనతలను సొమ్ము చేసుకోవడానికి వాడే ట్రిక్కులు ఇవన్నీ. దేవుడిని నిజంగానే నమ్మేవారు కొందరైతే వారి నమ్మకంతో వ్యాపారం చేయాలనుకొనేవారు ఎందరో! మనలో చాలా మందికి దేవుడిపై నిజంగా నమ్మకం ఉండదు. భయం కారణంగా ఎందుకైనా మంచిదని ఓ దండం పెట్టుకుంటారు. దేవుడి సన్నిధిలో తీర్థ ప్రసాదాలను పెట్టి ఆ తర్వాత వాటిని మనం ఆరగిస్తాం. దేవుడు నిజంగానే తనకు భక్తులు సమర్పించిన తీర్థ ప్రసాదాలను ఆరగిస్తే మనం ఇంత ఉదారంగా వాటిని సమర్పించుకుంటామా? దేవుళ్లు వాటిని తినబోరన్న నమ్మకంతోనే విగ్రహాల ముందు పెడతాం. దేవుడి పేరు చెప్పి మనమే అవన్నీ ఆరగిస్తాం. మనిషి స్వార్థానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి?

శిక్ష పడాల్సిందే!

హిందువుల ఓట్లు దూరం కాకూడదన్న కారణంగానే శ్రీవెంకటేశ్వర స్వామిపై నమ్మకం లేకపోయినా జగన్మోహన్‌రెడ్డి కానీ, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కానీ తిరుమల వెళ్లేవారు. రాజశేఖర రెడ్డి భార్య శ్రీమతి విజయలక్ష్మి గానీ, జగన్‌రెడ్డి భార్య భారతి గానీ ఎన్నడూ తిరుమల వెళ్లలేదే! దేవాలయాలను సందర్శించకూడదని బైబిల్‌లో ఎక్కడా చెప్పలేదే! మతం ఏదైనా దేవుడు దేవుడే అని నమ్మాలి కదా? హిందువులలో సహజంగానే సహనం ఎక్కువ. అందుకే ఆ దేవదేవుడి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో చేశారని తెలిసినా మౌనంగా బాధపడ్డారు కానీ, అందుకు కారణమైన వారిని తరిమికొట్టే ప్రయత్నం చేయలేదు. అంతెందుకు, వినాయక నిమజ్జనం సందర్భంగా మద్యం తాగి నృత్యాలు చేస్తున్నా చూసి ఊరుకుంటున్నాం కదా! ఇలా మరే మతంలోనైనా జరగడాన్ని చూశామా? దేవుడైనా, దెయ్యమైనా మనుషులకు ఉపయోగపడేవరకే. మనుషులకు ఉపయోగపడకపోతే దేవుళ్లను కూడా పూజించరు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడిన విషయమై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ఆవేదన ఎంత ఉందో రాజకీయం కూడా అంతే ఉంది. ఈ దెబ్బతో హిందువులు జగన్‌రెడ్డికి దూరమవుతారని ఆయన రాజకీయ ప్రత్యర్థులు భావిస్తున్నారు. ఈ కారణంగా ఈ వివాదం ఇప్పటిలో సమసిపోదు. హిందువుల మనోభావాలను గమనించిన కేంద్ర మంత్రులు ఈ సంఘటనపై సహజంగానే స్పందించారు. ప్రస్తుతానికి హిందువుల దృష్టిలో జగన్‌రెడ్డి దోషి. రివర్స్ టెండరింగ్ విధానమంటూ పోలవరం ప్రాజెక్టుకు ఏ గతి పట్టించారో చూశాం. ఇప్పుడు అదే రివర్స్ టెండరింగ్ విధానంతో తిరుమల మహా ప్రసాదాన్ని కూడా కలుషితం చేశారు. ఇందుకు తగిన మూల్యాన్ని జగన్‌రెడ్డి చెల్లించుకోక తప్పదు. చంద్రబాబు వంద రోజుల పాలన వైఫల్యాల పుట్ట అని జగన్ అండ్ కో ప్రచారం చేస్తున్నారు గానీ, ఈ లడ్డూ వ్యవహారం వెలుగులోకి రావడంతో రాజకీయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పైచేయి సాధించారు. ఐదేళ్లపాటు అధికారంలో కొనసాగడానికి కూటమి ప్రభుత్వం ఏర్పడింది. 175 మందికి గానూ 164 మంది ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపించారు. అంత భారీ మెజారిటీతో ఏర్పడిన ప్రభుత్వానికి వంద రోజుల పాలన అంటూ మార్కులు వేయాలని అనుకోవడం ఏమిటి? జగన్ చెబుతున్నట్టు ప్రజల్లో అసంతృప్తి నెలకొని ఉంటే తగిన సమయం కోసం వేచి ఉంటారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్‌రెడ్డిని ఎవరైనా ప్రశ్నించారా? నిలదీశారా? లేదే! ఎన్నికల వరకు ఆగి తమ తీర్పు ప్రకటించారు. వరదల్లో చిక్కుకున్న విజయవాడ ప్రజలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తన వయసును కూడా లెక్కచేయకుండా అహర్నిశలు కృషి చేయడాన్ని అందరూ ప్రశంసిస్తుండగా జగన్ అండ్ కోకు మాత్రం అక్కడ కూడా ప్రభుత్వ వైఫల్యమే కనిపిస్తోంది. ప్రభుత్వాల పనితీరుపై ఒక అంచనాకు రావడానికి కనీసం ఏడాది నుంచి రెండేళ్ల సమయాన్ని ప్రజలు తీసుకుంటారు. చంద్రబాబు ప్రభుత్వం జగన్‌రెడ్డికి నచ్చకపోయినా ఐదేళ్ల పాటు వేచి ఉండాల్సిందే కదా! జగన్‌రెడ్డి అరాచక పాలనను ప్రజలు ఐదేళ్లపాటు భరించారు కదా! తిరుమలలో అపచారం జరిగిందని ఆధారాలతో సహా వెల్లడైంది. ఉద్దేశపూర్వకంగా కల్తీ నెయ్యి కొనుగోలు చేసి ఉండకపోవచ్చు గానీ జరిగిన దానికి బాధ్యత తీసుకోవాలి. మార్కెట్ ధరతో పోల్చితే సగం ధరకే నెయ్యి సరఫరా చేస్తామన్న వారిని ఎలా నమ్మారు? ఇప్పుడు ఈ చర్యను సమర్థించుకుంటున్న జగన్‌రెడ్డి కానీ, వైవీ సుబ్బారెడ్డి కానీ తమ ఇంటి అవసరాలకు అంత తక్కువ ధరకు లభించే నెయ్యిని కొనుగోలు చేస్తారా? దేవుడనేవాడు ఉంటే తిరుమల కొండపై తప్పు చేసిన వారికి ఏదో ఒక రూపంలో శిక్ష పడుతుంది. లేని పక్షంలో దేవుడిపై భక్తి సంగతి అటుంచి కనీసం భయం కూడా లేకుండా పోతుంది. అదే జరిగితే మనుషులు మరింత విశృంఖలంగా వ్యవహరిస్తారు. భగవంతుడికి, భక్తుడికి మధ్య అనుసంధానంగా ఉండేది నమ్మకం. తనపై భక్తులకు ఉండే నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భగవంతుడిదే. తన పేరిట భక్తులకు అందజేసే లడ్డూ ప్రసాదాలను కల్తీ నెయ్యితో చేయించిన వారందరినీ ఏదో ఒక రూపంలో శిక్షించడానికి ఆ దేవదేవుడే పూనుకోవాలి. లేని పక్షంలో కొండ మీద కొలువైన శ్రీవెంకటేశ్వరుడిని కూడా అమ్మకానికి పెడతారు. చూద్దాం.. ఈ వివాదం ఎన్ని మలుపులు తిరుగుతుందో? చివరకు ముగింపు ఎలా ఉండబోతున్నదో? దోషులకు ఏదో విధంగా శిక్ష పడితే గానీ భక్తులకు నమ్మకం పెరగదు.. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరుడు ఇవన్నీ వినకుండా, చూడకుండా ఉంటాడా!

> కల్తీ నెయ్యి సరఫరా చేసిన సంస్థ తొలుత కిలో నెయ్యికి 610 రూపాయలు కోట్ చేసింది. తర్వాత రివర్స్ టెండరింగ్‌లో పాల్గొని ఆ ధరను అమాంతం కిలోకు 424 రూపాయలకు తగ్గించింది. బుద్ధి జ్ఞానం ఉండి ఉంటే అధికారులకు, పాలక మండలికి అప్పుడే అనుమానం రావాల్సింది. కానీ పట్టించుకోలేదు. భక్తుల సొమ్ముతోనే ప్రసాదాలకు అవసరమైన ముడి సరుకులను కొనుగోలు చేస్తారు. ఇందులో నాణ్యత విషయంలో రాజీపడి కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమిటో గత పాలక మండలే చెప్పాలి. కొండ మీదకు వచ్చే నెయ్యి ట్యాంకర్లను నాణ్యత విషయంలో తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటల్లో కూడా వాస్తవం లేదు. నెయ్యి కల్తీ జరిగిందా? లేదా? అని నిర్ధారించే ల్యాబ్‌లు తిరుపతిలో లేవు. అలాంటప్పుడు ప్రతి ట్యాంకర్‌ను ఎలా పరీక్షించారో జగన్‌రెడ్డి చెప్పాలి.

> జగన్ చెబుతున్నట్టు చంద్రబాబు పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొని ఉంటే తగిన సమయం కోసం వేచి ఉంటారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్‌రెడ్డిని ఎవరైనా ప్రశ్నించారా? నిలదీశారా? లేదే! ఎన్నికల వరకు ఆగి తమ తీర్పు ప్రకటించారు. వరదల్లో చిక్కుకున్న విజయవాడ ప్రజలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తన వయసును కూడా లెక్కచేయకుండా అహర్నిశలు కృషి చేయడాన్ని అందరూ ప్రశంసిస్తుండగా జగన్ అండ్ కోకు మాత్రం అక్కడ కూడా ప్రభుత్వ వైఫల్యమే కనిపిస్తోంది. ప్రభుత్వాల పనితీరుపై ఒక అంచనాకు రావడానికి కనీసం ఏడాది నుంచి రెండేళ్ల సమయాన్ని ప్రజలు తీసుకుంటారు. చంద్రబాబు ప్రభుత్వం జగన్‌రెడ్డికి నచ్చకపోయినా ఐదేళ్ల పాటు వేచి ఉండాల్సిందే కదా! తిరుమలలో అపచారం జరిగిందని ఆధారాలతో సహా వెల్లడైంది. ఉద్దేశపూర్వకంగా కల్తీ నెయ్యి కొనుగోలు చేసి ఉండకపోవచ్చు గానీ జరిగిన దానికి బాధ్యత తీసుకోవాలి. మార్కెట్ ధరతో పోల్చితే సగం ధరకే నెయ్యి సరఫరా చేస్తామన్న వారిని ఎలా నమ్మారు? ఇప్పుడు ఈ చర్యను సమర్థించుకుంటున్న జగన్‌రెడ్డి కానీ, వైవీ సుబ్బారెడ్డి కానీ తమ ఇంటి అవసరాలకు అంత తక్కువ ధరకు లభించే నెయ్యిని కొనుగోలు చేస్తారా?

ఫ్రాయిడ్‌ను విస్మరించిన మార్క్సిస్టులు


> నిత్యజీవితంలో ఎదురయ్యే హింస, దేశాల మధ్య యుద్ధాలు వ్యక్తుల భావావేశాలు ద్వేషంలో కూరుకుపోతున్నందువల్ల సంభవిస్తున్నాయి. వివక్షలతో కూడిన కుల వ్యవస్థ ప్రభావిత వ్యక్తిత్వ నిర్మాణాలను అర్థం చేసుకొని ఆ సామాజిక దురాచారాన్ని నిర్మూలించాలి. ముందుగా పిల్లల పెంపకంలో ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

కార్ల్ మార్క్స్ 1835లో హైస్కూల్ విద్య పూర్తి చేశాడు. ఆ రోజుల్లో జర్మనీలో స్కూలు విద్య ముగిసేనాటికి విద్యార్థులు ఒక వ్యాసం సమర్పించవలసి ఉంది. జీవితంలోకి ప్రవేశించనున్న యువకుడు వృత్తిని ఎంచుకోవడంపై మార్క్స్ వ్యాసం సమర్పించాడు. వృత్తిని యాదృచ్ఛికతకు వదిలిపెట్టకుండా ఎవరికి వారు ఎంపిక చేసుకోవడం అవసరమని యువ మార్క్స్ స్పష్టం చేశాడు. సమాజ సంక్షేమం, వ్యక్తిగత ఔన్నత్యం ఉండే వృత్తిని ఎంచుకోవడం అవసరం అని మార్క్స్ భావించాడు. వ్యక్తిగత వికాసానికి, సమాజ అభివృద్ధికి దోహదం చేసే వృత్తినే ఆయన ఎంచుకొని కొనసాగించాడు. ఈ లక్ష్యసాధనకు ఆయన విస్తృతంగా అధ్యయనం చేశాడు. పదార్థం ముందా ఆలోచన ముందా అనే చర్చను ముగించి మార్క్స్ తత్వశాస్త్రంలో విప్లవం తెచ్చాడు. చారిత్రక గమనానికి ఆలోచనలు ముందా, లేక భౌతిక పరిస్థితులు ముందా అనే ప్రశ్నకు, ఆలోచనలు, భౌతిక పరిస్థితులు ఒకేసారి తారసపడినప్పుడు మాత్రమే కార్యకలాపాలు సాగుతాయని మార్క్స్ జవాబిచ్చాడు. దీనితో తత్వశాస్త్రం కొత్తమలుపు తిరిగింది. మార్క్స్ మొదటిసారిగా 1844 రాతప్రతులలో తన భౌతిక వాదాన్ని స్పష్టంగా చెప్పాడు. మానవుడు తనకు తానే దూరమైపోతున్నాడని, ఈ పరిస్థితి నుంచి విముక్తి పొందడానికి విప్లవాత్మక కార్యాచరణ మాత్రమే దోహదం చేస్తుందని రాతప్రతులలో ఆయన సవివరంగా తెలియజేశాడు.

పితృస్వామ్యం, సొంత ఆస్తి విధానం, వైవాహిక వ్యవస్థ దాదాపు ఒకేసారి ఆవిర్భవించాయి. సొంత ఆస్తి కారణంగా మనిషి ఆత్మను కోల్పోతున్నాడనే ఎలియనేషన్ (పరాయీకరణ) ప్రక్రియను ఆయన వివరించాడు. ఈ ప్రక్రియ పెట్టుబడిదారీ విధానంలో పరాకాష్టకు చేరుకొని, మనిషి ఛిద్రమయ్యే పరిస్థితులు దాపురించాయని మార్క్స్ విపులీకరించాడు. తాము చేసిన ఉత్పత్తులను తామే మార్కెట్లో కొనుగోలు చేయవలసి వచ్చినప్పుడు అవి శత్రువుల మాదిరిగా ఎదురవుతాయి. ఉత్పత్తులు పెరిగినకొద్దీ ఈ పరాయీకరణ పెరుగుతూనే ఉంటుంది. సృజనాత్మక శ్రమ చేయడం మానవ నైజం కానీ పెట్టుబడిదారీ సంబంధాలలో శ్రామికుడు తన ఉత్పత్తులకు తానే పరాయిగా మారిపోవడమే కాకుండా, ఉపాధి కోసం శ్రామికుల మధ్య పోటీ కారణంగా ఒకరినొకరు ద్వేషించుకునే పరిస్థితి ఏర్పడుతున్నది. మనిషి సహజ లక్షణమైన సహకారం కూడా మరచిపోతున్నాడు. ఈ క్రమంలో చారిత్రకంగా వచ్చే సృజనాత్మక శక్తిని కూడా కోల్పోతున్నాడు. మొత్తం మీద ఆత్మనే కోల్పోతున్నాడు (సెల్ఫ్ ఎలియనేషన్). కమ్యూనిస్టు, లేదా సోషలిస్టు విప్లవం ద్వారా ఆత్మను తిరిగి స్వీకరించగలగాలని ఆయన తెలిపారు.

ఈ పరాయీకరణ జనిత రుగ్మతల కారణంగా మానవుడు ఎటువంటి మానసిక పరిస్థితులలో చిక్కుకుంటున్నాడనేది మార్క్స్ సవివరంగా తెలియజేశాడు. మార్క్స్ మరణించిన తరువాత దాదాపు 30 సంవత్సరాలకు ఫ్రాయిడ్ మనో విశ్లేషణకు మార్గం ఏర్పరిచాడు. దీనితో చైతన్యం, కార్మిక వర్గ చైతన్యం వంటి మాటలను అర్థం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఫ్రాయిడ్‌ను మార్క్సిస్టులు తిరస్కరించినందువల్ల వివిధ సమాజాలను, ఉద్యమాలను మానసిక శాస్త్రపరంగా అర్థం చేసుకోవడానికి వీలు కాలేదు. అందువల్ల కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్ద ఎత్తున నష్టం జరిగింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మార్క్సిజం – లెనినిజం అధిపతి రైజానోవ్ పోర్చుగల్‌లోని పురా భాండాగారంలో ఈ రాతప్రతులను కనుగొన్నాడు. ఆనాడు ప్రచారంలో ఉన్న సోషలిజం, శాస్త్రీయ ఆలోచన విధానం అనేవి రాతప్రతులలోని భావనలకు విరుద్ధంగా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ రైజానోవ్‌ను సైబీరియాకు ప్రవాసం పంపారు. ఆయన అక్కడే మరణించాడు. 1932లో ఈ రాతప్రతులను ప్రచురించారు. కానీ 1929లోనే రష్యాలో 'ఒక దేశంలో సోషలిజం' నినాదం రూపొందించారు ఈ ఆలోచన విధానానికి, అదేవిధంగా సోషలిజం భావనకు రాతప్రతులలోని ఈ భావనలకు చాలా తేడా ఉంది.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో ముందుగా విప్లవాలు వస్తాయని మార్క్స్ భావించాడు. 1917లో రష్యన్ విప్లవం తరువాత అభివృద్ధి చెందిన దేశాలవంతు వస్తుందని లెనిన్ ఎంతగానో ఎదురుచూశాడు. పెద్ద ఎత్తున లెనిన్ దీని కోసం కృషి చేశాడు. ఫలితం లేనందువల్ల నూతన ఆర్థిక విధానంతో (ఎన్.ఇ.పి.) రాజ్యమే పెట్టుబడులను నిర్మించుకోవాలని, స్టేట్ క్యాపిటలిజం ఏర్పాటు తప్పదని లెనిన్ నిర్ణయించాడు. దీనికి సోషలిజం అని పేరు పెట్టి మార్క్స్ ప్రతిపాదించిన మౌలిక అంశాలన్నిటిని నమ్మకాలుగా మార్చి, కమ్యూనిస్టు పార్టీలను మతాల స్థాయికి దిగజార్చారు. ఈ క్రమంలో ఆ మౌలికాంశాలను అనేక రకాలుగా వక్రీకరించారు. వాటిలో ప్రధానమైనవి: 1. సమాజాన్ని అర్థం చేసుకోవటానికి ఆర్థిక పరిస్థితులు మాత్రమే నిర్ణయాత్మకం కాదని ఇతర అనేక పరిస్థితులు దోహదం చేస్తాయని మార్క్స్, ఏంగెల్స్ అనేకసార్లు హెచ్చరించినప్పటికీ ఆర్థిక నియతివాదం మార్క్సిజంగా చలామణిలోకి వచ్చింది; 2. పునాదులుగా పరిగణిస్తున్న ఆర్థిక పరిస్థితులు మారుతున్నప్పుడు ఉపరితలంలో కూడా మార్పులు వస్తాయని మార్క్సిస్టులు ప్రచారం చేశారు. అయితే పునాదులు మారకుండా రష్యాలో సోషలిజం స్థాపించినట్టు చెప్పడానికి ప్రయత్నించడం హేతువిరుద్ధం; 3. మార్క్సిస్టులు కమ్యూనిస్టు ప్రణాళిక మొదటి వాక్యాన్ని పూర్తిగా వక్రీకరించారు. ఇప్పటివరకు



తెలిసిన చరిత్ర అనే నోట్ గమనించకుండా ప్రపంచ చరిత్ర మొత్తం వర్గ పోరాటాల చరిత్రగా నిర్ధారించారు. పితృస్వామ్యానికి ముందున్న మాతృస్వామ్యం తదితర వ్యవస్థలలో వర్గాలు లేవనేది వారు గ్రహించలేదు; 4. చారిత్రక నియమాలను, చారిత్రక అనివార్యతను యాంత్రికంగా అర్థం చేసుకున్నందువల్ల దాదాపు చరిత్రకు ప్రత్యామ్నాయం ఉండదనే అభిప్రాయం ఏర్పడింది;


5. మార్క్స్ యథాలాపంగా చెప్పిన విషయాలకు కూడా సైద్ధాంతిక స్థాయి కల్పించడం. అదేవిధంగా మార్క్స్‌కు సంబంధం లేని విషయాలను కూడా మార్క్స్ సిద్ధాంతాలుగా మార్చి వేయడం; 6. వీటన్నిటికీ మించి మార్క్సిస్టులు 'ఆచరణ' అనే మాటను అన్వయించిన తీరు వక్ర భాష్యానికి పరాకాష్ఠ. నూతన సమాజ నిర్మాణం కోసం కొనసాగించే విప్లవాత్మక, విమర్శనాత్మక, రాజకీయపరమైన కృషిని ఆచరణగా మార్క్స్ వివరించాడు. భవిష్యత్తు సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఆలోచించి, చైతన్యవంతంగా ముందుకు సాగాలి. కానీ వాస్తవంలో బహు కొద్ది మంది నాయకులు రూపొందించిన కార్యక్రమాలను అమలు చేయడమే ఆచరణగా పరిగణనలోకి వచ్చింది.

పై వివరాలను బట్టి మార్క్స్ ఆలోచనలను మసిబూసి మారేడుకాయ చేసినట్లు తెలుస్తుంది. ఈ తీరులో మార్క్స్ మౌలిక ప్రతిపాదనలను వక్రీకరించినందువల్ల, వారు భారతదేశ పరిస్థితులను అర్థం చేసుకోవడం కూడా పూర్తిగా విఫలమయ్యారు. అంతే కాకుండా వ్యక్తి ఆలోచనలను, సామాజిక అంశాలను అర్థం చేసుకోవడంలో మార్క్సిస్టులమని చెప్పుకుంటున్న వారు పూర్తిగా విఫలమయ్యారు. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మనోవిశ్లేషణను విస్మరించినందువల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. మానసిక ఆవిర్భావం, పరిణామం గురించి ఫ్రాయిడ్ సవివరంగా చర్చించాడు. అయినప్పటికీ సామాజిక మానసిక పరిస్థితి అర్థం చేసుకోవటానికి కేవలం మనోవిశ్లేషణ మాత్రమే సరిపోదు.

విల్‌హెల్మ్ రైక్ ప్రతిపాదించిన వ్యక్తిత్వ విశ్లేషణ (క్యారెక్టర్ ఎనాలిసిస్), మూక మనస్తత్వం (మాస్ సైకాలజీ), భావావేశ మహమ్మారి (ఎమోషనల్ ప్లేగ్), పనిలో ప్రజాస్వామ్యం (వర్క్ డెమోక్రసీ) తదితర భావనలను అర్థం చేసుకోవడం అవసరం. రైక్ ఆవిష్కరణలలో ప్రధానమైనది, జీవశక్తి లేదా ప్రాణశక్తి. దీనిని ఐదోశక్తి లేదా ఫిఫ్త్ ఫోర్స్ అంటున్నారు. ఈ శక్తికి ఆర్గాన్ ఎనర్జీ అని రైక్ పేరు పెట్టాడు. ఈ ప్రాణశక్తి శరీరంలో తల నుంచి కటివైపు ఆరు విభాగాలుగా (సెగ్మెంట్స్) ప్రయాణిస్తుందని ఈ విభాగాలలో శక్తి పేరుకుపోయినప్పుడు రుగ్మతలు వస్తాయని ఆయన వెల్లడించాడు. ఈ రుగ్మతలలో ప్రధానమైనది భావప్రాప్తి సామర్థ్యం కోల్పోవడం. ఫలితంగా లైంగిక అసంతృప్తి తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నది. దీని కారణంగా నేరపూరిత ప్రవర్తన చోటుచేసుకుంటున్నది. భావప్రాప్తిని, లైంగిక సంతృప్తిని వ్యతిరేకించడం అంటే స్వీయ ద్వేషం పెంచుకోవడమే. తమను తాము ద్వేషించేవారు ఎన్నటికీ ఇతరులను ప్రేమించలేరు. ఈ ద్వేషం ప్రస్తుత సమాజంలో పెద్ద ఎత్తున పెరిగిపోయింది. ఈ పరిస్థితిని రైక్ భావావేశ మహమ్మారి (ఎమోషనల్ ప్లేగ్) అన్నాడు.

నిత్యజీవితంలో ఎదురయ్యే హింస, దేశాల మధ్య యుద్ధాలు భావావేశాలు ద్వేషంలో కూరుకుపోతున్నందువల్ల సంభవిస్తున్నాయి. వ్యక్తిత్వ నిర్మాణాలు, సామాజిక నియమాలతో పాటు వ్యక్తిలో జనిస్తున్న ద్వేషం కారణంగా అవి ఏర్పడుతున్నాయి. వందలు వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న వివక్షలతో కూడిన కుల వ్యవస్థలు వ్యక్తిత్వ నిర్మాణాలను అర్థం చేసుకొని కుల నిర్మూలనకు ప్రయత్నించాలి. ముందుగా పిల్లల పెంపకంలో ఇటువంటి ప్రయత్నాలు ప్రారంభం కావాలి.

• డాక్టర్ సుంకర రామచంద్రరావు
(రచయిత, విశ్రాంత పాత్రికేయుడు)



నష్టం నమోదుకు మరో అవకాశం

నేడు సచివాలయాల్లో జాబితాల ప్రదర్శన : కలెక్టర్

వన్‌టౌన్, సెప్టెంబరు 21 : విజయవాడ అర్బన్‌కు సంబంధించిన 179 సచివాలయాల పరిధిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టగణన ప్రక్రియ నిర్వహించటం జరిగిందని, నష్టం కలిగిన ఏ ఒక్కరూ మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో వివరాల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు కలెక్టర్ సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సచివాలయాల్లో ఎన్యూమరేషన్ జాబితాలను ప్రదర్శిస్తారని, ఇంకా ఎవరైనా మిగిలిపోతే ఆయా సచివాలయాలను, ప్రత్యేక అధికారులను సంప్రదించి ఎన్యూమరేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆది, సోమవారాల్లో సచివాలయాల పరిధిలోనే వార్డు ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక ఐఏఎస్ అధికారులు కూడా తొలిదశ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తారన్నారు. నష్టం, కష్టం కలిగిన ఏ ఒక్కరూ ఎన్యుమరేట్ కాకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం నాటికి తుది జాబితాలను రూపొందించి పంపించాలని ఇప్పటికే ఆయా వార్డుల ప్రత్యేక అధికారులను ఆదేశించినట్లు వివరించారు. ఈనెల 25న బాధితులకు పరిహారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని చెప్పారు. నష్టగణన వివరాల నమోదు ప్రక్రియను రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నగరంలో భారీ వర్షం

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరంపై శనివారం భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రహదారులు నీటమునిగాయి. ఇటీవల వచ్చిన వరదలకు పల్లపు ప్రాంతాల్లో ఇంకా నీరు నిలిచి ఉంది. తాజాగా కురిసిన వర్షపు నీరు ఈ ప్రాంతాల్లోకి చేరింది. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగిపొర్లాయి. ఫలితంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. భారీవర్షం కురవడంతో ఇటీవల ముంపు బారిన పడిన ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందారు. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న తరుణంలో మళ్లీ వర్షాలు కురిస్తే ఎలాంటి పరిస్థితులు వస్తాయోనని భయపడ్డారు. అయితే, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో అసలు వర్షమే కురవలేదు.

యార్లగడ్డ 8 చలసాని



ఆంజనేయులు తప్పుడు వార్తలు రాయిస్తున్నారు
గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

32ఏళ్లుగా పార్టీ కోసమే పనిచేస్తున్నా..
విజయ డెయిరీ చైర్మన్ ఆంజనేయులు

6లో

వరద సృష్టించిన విలయం.. ఆ తర్వాత బురద, మురుగు జీభత్సంతో ఇంకా కోలుకోని బాధితుల కన్నీరు తుడిచేందుకు ప్రభుత్వం మొదటి అడుగు వేసింది. బాధితులందరికీ ఈనెల 25న నష్టపరిహారం అందజేయాలని నిర్ణయించింది. ఫ్లడ్ ఎన్యూమరేషన్‌పై శనివారం సమీక్ష చేసిన సీఎం చంద్రబాబు.. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా అందరికీ పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు.


అజిత్‌సింగ్‌నగర్‌లో దిగులుగా వరద బాధితురాలు

వరద బాధితులకు ఊరట

25న నష్టపరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయం

- ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదని అధికారులకు సూచన
- గ్రౌండ్‌ఫ్లోర్ మునిగిన వారికి రూ.25 వేల పరిహారం
- మొదటి, ఆపై ఫ్లోర్ అయితే రూ.10 వేలు
- దెబ్బతిన్న వాహనాలు, మృతిచెందిన పశువులకు కూడా..
- పంటనష్టం కింద ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలని నిర్ణయం



విజయవాడ, ఆంధ్రజ్యోతి/చిట్టినగర్ : భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలకు ఈనెల 25న పరిహారం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్యూమరేషన్ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు. ఏ ఒక్క బాధితుడికి సహాయం అందలేదని చెప్పటానికి వీల్లేకుండా రీ వెరిఫికేషన్ సహా పూర్తి చేశామని అధికారులు తెలిపారు. దీంతో వరద బాధితులందరికీ ఈ నెల 25న పరిహారం అందజేయాలని సీఎం ఆదేశించారు. వరద సాయంపై చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్ వారికి రూ.25 వేలు, మొదటి, ఆపై అంతస్థు వారికి రూ.10 వేల చొప్పున పరిహారాన్ని ఇవ్వాలన్నారు. ఇళ్లు మునిగిన వారితో పాటు వాహనాలు దెబ్బతిన్న వారికి, పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. నష్టపరిహారం విషయంలో తమ పేరు ఎక్కడా నమోదు కాలేదనే ఫిర్యాదు రాకూడదని సీఎం ఆదేశించారు. ఇన్సూరెన్స్ సెటిల్‌మెంట్స్ గురించి చంద్రబాబు అధికారులను ప్రశ్నించగా, మొత్తం 10 వేల వాహనాలకు గానూ 6 వేల వాహనాలకు బీమా సెటిల్మెంట్ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. మిగిలిన వాహనాలకు కూడా బీమా పూర్తయ్యేలా చూడాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. అలాగే, చనిపోయిన పశువులకు, నష్టపోయిన వ్యాపారులకు కూడా ఆర్థిక సాయం అందించనున్నారు.

వరద బాధితుల జాబితా నేడు విడుదల

వరదలకు సర్వం కోల్పోయిన బాధితుల జాబితాను ఆది, సోమవారాల్లో సచివాలయాల వద్ద ప్రకటిస్తారని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఆదివారం సెలవు అయినప్పటికీ సచివాలయాలు తెరిచే ఉంటాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయ ఆఫీసర్, జిల్లా అధికారి ఈ జాబితాను ప్రకటిస్తారని తెలిపారు. ఈ జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చని సూచించారు.

కూటమివైపు క్యూ

జిల్లాలో వైసీపీకి వరుస షాక్‌లు

ఉదయభాను సహా నలుగురు కార్పొరేటర్లు జనసేనలోకి..

- ఈ నెల 26న చేరేందుకు రంగం సిద్ధం
- విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో తగ్గుతున్న వైసీపీ బలం
- టీడీపీ కూటమికి పెరుగుతున్న కార్పొరేటర్ల సంఖ్య
- త్వరలో మరో 10 నుంచి 15 మంది కూటమి పార్టీల్లోకి జంప్
- ఓ మాజీ ఎమ్మెల్యే కూడా బీజేపీలో చేరే యోచన


శనివారం మంగళగిరిలో జనసేనాని పవన్ కల్యాణ్‌తో సామినేని ఉదయభాను

విజయవాడ-ఆంధ్రజ్యోతి/జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేనలో చేరిక వాయిదా పడింది. తొలుత ఈనెల 22న ఆయన జనసేనలో చేరడానికి ముహూర్తం పెట్టుకున్నారు. అయితే, శనివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసిన తర్వాత మిగిలిన నాయకులతో పాటు 26న చేరాలని నిర్ణయించుకున్నారు. ఆయనతో పాటు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన నలుగురు వైసీపీ కార్పొరేటర్లు జనసేనలో చేరనున్నారు. మహదేవు అప్పాజీ, మరుపిళ్ల రాజేశ్, అత్తలూరి ఆదిలక్ష్మి, ఉమ్మడిశెట్టి రాధిక ఈ లిస్టులో ఉన్నారు.

> జిల్లాలో వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేనలో చేరేందుకు సిద్ధం కాగా, విజయవాడ కార్పొరేషన్‌కు చెందిన నలుగురు వైసీపీ కార్పొరేటర్లు కూడా ఆయన వెంట నడుస్తున్నారు. వీరంతా ఈనెల 26న జనసేన తీర్థం పుచ్చుకుంటుండగా, నగరానికి చెందిన మరో మాజీ ఎమ్మెల్యే కూడా బీజేపీవైపు చూస్తున్నట్టు తెలుస్తోంది.

కార్పొరేషన్ ఖాళీ

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వైసీపీకి 49 మంది కార్పొరేటర్ల బలం ఉంది. వీరిలో ఇప్పటికే బుల్లా విజయకుమార్, గుడివాడ నరేంద్ర రాఘవ బీజేపీలో చేరగా, షైలవరపు రత్నకుమారి, అబ్దుల్ అర్షద్ టీడీపీలో చేరారు. టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన షైలవరపు మాధురి తిరిగి సొంతగూటికి చేరారు. తాజా పరిణామాలతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 41కి పడిపోగా, కూటమి బలం 22కు చేరింది. అందులో టీడీపీకి 16, బీజేపీకి ఇద్దరు, జనసేనకు నలుగురు కార్పొరేటర్ల బలం చేకూరింది. కొద్దిరోజుల్లో మరో 10 నుంచి 15 మంది కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చేరే అవకాశాలున్నాయి. అదే జరిగితే కౌన్సిల్‌లో వైసీపీ బలం పడిపోనుంది. అయితే, నిబంధనల ప్రకారం 2025-మార్చి నాటికి వీఎంసీ పాలకమండలికి నాలుగేళ్లు నిండుతాయి. ఆ తర్వాతే అవిశ్వాసం పెట్టేందుకు అవకాశం ఉంటుంది. ఈలోపే మేయర్ కూడా వైసీపీని వీడితే, వీఎంసీపై కూటమి జెండా ఎగురుతుంది. లేకుంటే 2025-మార్చి తర్వాత కూటమి జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది.

నగరంపై ఉదయభాను పట్టు

కాపు సామాజికవర్గం నాయకుల్లో బలమైన నేతగా ఉన్న సామినేని ఉదయభాను మున్ముందు తన రాజకీయ వేదికగా విజయవాడను ఎంపిక చేసుకోనున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అందులో భాగంగానే వీఎంసీకి చెందిన నలుగురు వైసీపీ కార్పొరేటర్లను కూడా తనతో పాటు జనసేనలోకి తీసుకెళ్లేందుకు ఆయన పావులు కదిపారు. ఉదయభానుకు ఎన్టీఆర్ జిల్లా జనసేన బాధ్యతలు అప్పగించి, విజయవాడ కేంద్రంగా పనిచేయాలని జనసేన నాయకులు సూచిస్తున్నట్లు సమాచారం. జగ్గయ్యపేటలో టీడీపీకి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో పాటు బలమైన నాయకులు ఉన్నందున అక్కడ మరో అధికార కేంద్రం ఉండకూడదన్న ఉద్దేశంతో జనసేన అధిష్ఠానం ఈ సూచన చేసినట్లు సమాచారం. దీనికి ఆయన కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

త్వరలో మరో మాజీ ఎమ్మెల్యే కూడా..

విజయవాడకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే త్వరలో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నట్లు తెలుస్తోంది. ఆయన ఎన్నికలకు ముందే వైసీపీని వీడి బీజేపీలో చేరేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. అప్పట్లో సీట్ల సర్దుబాటులో ఒత్తిడి కారణంగా హామీ రాకపోవడంతో ఆయన చేరిక వెనక్కి వెళ్లింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన తిరిగి బీజేపీ పంచన చేరేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఆ పార్టీలో పనిచేసిన అనుభవం ఉండటంతో ఆ పార్టీ పెద్దలతో టచ్‌లో ఉంటూ వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

- నగరంలో ఓ నిర్మానుష్య ప్రదేశంలో కారు ఆగి ఉంది. అందులో ఎవరున్నారో బయటకు కనిపించడం లేదు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తలుపులు తెరవమని చెప్పారు. లోపల ఉన్నవారు తలుపులు తీయగా, కొంతమంది యువకులు కారులో మద్యం తాగుతున్నట్టు గుర్తించారు. కొద్దిరోజుల క్రితం పోలీసులు గుర్తించిన ఘటన ఇది.
- బెంజిసర్కిల్ వద్ద ఉన్న సర్వీసు రోడ్డులో కొద్దిరోజుల క్రితం ఒక కారు ఆగి ఉంది. లోపల ఎవరున్నారో బయటకు కనిపించలేదు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అద్దాలపై కొట్టడంతో ఒక యువకుడు తలుపు తీశాడు. అందులో ఆ యువతి పోలీసులకు అసభ్యంగా కనిపించింది.

ఈ తరహా అసాంఘిక కార్యకలాపాలకు పోలీసులు చెక్ పెట్టారు. నగరవ్యాప్తంగా 'ఆపరేషన్ టింట్' కార్యక్రమాన్ని మొదలు పెట్టారు.

తెర వెనుక

నగరంలో పోలీసులు 'ఆపరేషన్ టింట్'

- కారుకు బ్లాక్ ఫిల్మ్ వేసి అసాంఘిక కార్యకలాపాలు
- వరుస ఘటనలతో ఉలిక్కిపడిన పోలీసులు
- యుద్ధప్రాతిపదికన కార్లకు బ్లాక్‌ఫిల్మ్ తొలగింపు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నిర్మానుష్య ప్రదేశాలు, ఖాళీగా ఉన్న రహదారుల పక్కన కార్లను నిలుపుదల చేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇతర వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. బెంజిసర్కిల్ వద్ద ఉన్న నారా చంద్రబాబునాయుడు కాలనీలో ఇలాంటి వ్యవహారాలు సాగుతున్నాయి. అమ్మాయిలు, అబ్బాయిలు ఇక్కడికి వచ్చి వ్యవహరిస్తున్న తీరుతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది యువకులు కారుల్లోనే మందు పార్టీలు చేసుకుంటున్నారు. కార్ల అద్దాలకు ఉండే బ్లాక్ ఫిల్మ్‌లే ఈ వ్యవహారాలకు కారణమని పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు నగరంలో 'ఆపరేషన్ టింట్' ప్రారంభించారు. కార్లకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను తొలగిస్తున్నారు. కొద్దిరోజులుగా నగరంలో ఈ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. కార్లకు ఉండే బ్లాక్‌ఫిల్మ్‌లో విజిబులిటీ ఎంత శాతం ఉండాలన్న దానిపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ముందు అద్దాలకు ఉండే ఫిల్మ్‌లో 70 శాతం, మిగిలిన అద్దాలకు ఉండే విజిబులిటీ 50 శాతం ఉండాలని పేర్కొంది. నిబంధనల ప్రకారం లేని ఇలాంటి టింట్ ఫిల్మ్‌లను పోలీసులు తొలగిస్తున్నారు.



300 వాహనాలకు తొలగింపు

నగరంలోని అన్ని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో టింట్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈనెల 12 నుంచి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు కార్లను నిలుపుదల చేసి నిబంధనల ప్రకారం లేని టింట్ ఫిల్మ్‌లను తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం 300 కార్లకు ఇలా చేశారు.

లంక భూముల్లో ఇసుక మేటలు

6లో

బుడమేరు ప్రక్షాళనకు మూడు ఆప్షన్లు

'ప్రకృతి విపత్తులన్నీ విజయవాడపై పగబట్టి ఒక్కసారిగా దాడి చేశాయి. బుడమేరు వరద ఊహించరానిది. గండ్లు పడటం వల్లే ఇంత విలయం జరిగింది. బుడమేరు ప్రక్షాళనకు మూడు ఆప్షన్లు పరిశీలిస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అత్యుత్తమమైనది ఎంపిక చేస్తాం. వరదల్లో తొలి రెండు రోజులు ఏం చేయలేకపోయాం. సీఎం ప్రత్యక్ష పరిశీలన ద్వారా చురుగ్గా పనిచేసి, త్వరగా విలయం నుంచి బయటపడ్డాం. ఏ ఒక్క వరద బాధితుడు కూడా నష్టపోకూడదన్న ఉద్దేశంతో ఎన్యూమరేషన్‌ను పక్కాగా నిర్వహించాం. ఇన్సూరెన్స్ క్లెయిమ్స్, బ్యాంకు రుణాలకు సంబంధించి పురోగతి సాధించాం.' అని కలెక్టర్ గుమ్మళ్ల సృజన పేర్కొన్నారు. కృష్ణా, బుడమేరు వరద సృష్టించిన బీభత్సం తర్వాత మొదటిసారిగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు..

- విజయవాడ, ఆంధ్రజ్యోతి



ప్రకృతి ఒకేసారి బెజవాడపై పగబట్టింది

- 60ఏళ్లలో రికార్డుస్థాయిలో బుడమేరుకు వరద
- గండ్లు పడటం వల్లే ఇంతటి విలయం
- తొలి రెండు రోజులు ఏం చేయలేకపోయాం
- సీఎం ప్రత్యక్ష పరిశీలనతో త్వరగా బయటపడ్డాం
- పక్కాగా ఫ్లడ్ ఎన్యూమరేషన్, రీ వెరిఫికేషన్
- ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా క్లెయింల పరిష్కారం
- బాధితులకు బాసటగా కొత్త రుణాలు, రీ షెడ్యూల్

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో కలెక్టర్ సృజన

ఆంధ్రజ్యోతి : వరద ప్రమాదంపై ముందుగా ఎందుకు హెచ్చరించలేకపోయారు?

సృజన : నగరానికి అన్ని విపత్తులూ పగబట్టినట్టు ఒకేసారి వచ్చాయి. భారీ వర్షాలకు ముందుగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ తర్వాత కృష్ణానదికి రికార్డు స్థాయిలో 11.50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. బుడమేరుకు కూడా 60 ఏళ్ల చరిత్రలో రికార్డు స్థాయిలో వరద పోటెత్తింది. బుడమేరుకు ఎంత వరద వస్తుందన్నది అంచనా వేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని అధికారులు నా దృష్టికి తీసుకొచ్చారు. నేను కవులూరు, వెల్లటూరు, వెలగలేరు, శాంతినగర్ వంటి ప్రాంతాలకు ఏర్పడే ప్రమాదంపై దృష్టి సారించాను. కట్టలు బలహీనంగా ఉండటం వల్ల గండ్లు పడిన విషయం ముందుగా తెలియలేదు. గండ్లు పడటం వల్లే ఇంత విపత్తు జరిగింది. వేలాది క్యూసెక్కుల వరద దిశ మార్చుకుని విలయం సృష్టించింది. తొలి రెండు రోజులు మేము ఏం చేయలేకపోయామన్న బాధ ఉంది. ఎందుకంటే పనిచేయాల్సిన వారే వరదలో చిక్కుకున్నారు. ఏం చేయాలో పాలుపోలేదు. ఆ సమయంలో ఒక్కటే అనుకున్నాను. నేను నిలబడకపోతే వ్యవస్థ పనిచేయదు. విశ్రాంతి తీసుకుంటే దిద్దుబాటు చర్యలు ఎవరు తీసుకుంటారని భావించాను. కుటుంబానికి కూడా దూరంగా ఉంటూ అహోరాత్రాలు పనిచేశాం. అధికారులు కొందరు హాస్పిటల్‌లో వైద్యం చేయించుకుని, సెలైన్లు పెట్టించుకుని వచ్చి పనిచేశారు. సీఎం చంద్రబాబు వచ్చాక ఐఎండీ తదితర నాలుగు ఏజెన్సీలతో అంచనా వేయిస్తే కానీ, ఎంత భారీ వరద వచ్చిందో తెలియలేదు. తెలిసిన తర్వాత అతి తక్కువ వ్యవధిలో చర్యలు చేపట్టడం చాలా కష్టం. మొత్తం మీద చివరకు సమస్య నుంచి బయటపడ్డాం.

ఆంధ్రజ్యోతి : సీఎం చంద్రబాబు ప్రత్యక్ష పరిశీలన గురించి మీరేమంటారు?

సృజన : ముఖ్యమంత్రి చంద్రబాబు ఇక్కడ ఉండటం మా అదృష్టం. మొదట్లో ఆయన నాపై కోప్పడ్డారు. ఆయన రావటం వల్ల రాష్ట్ర యంత్రాంగమంతా కదిలింది. రాష్ట్రం నలుమూలల నుంచి ఆయన 300 బోట్లు తెప్పించారు. నేను ఒక్కదానినే అన్ని బోట్లు సమకూర్చలేను. రోజూ ఉదయం, రాత్రి సమీక్షలు చేసేవారు. వీటివల్ల వేగంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు అమలయ్యేవి. ఆయన రోజూ క్షేత్రస్థాయి పర్యటనలు చేయటం వల్ల ఏం చేయాలో ఓ అవగాహన వచ్చేది. తక్కువ సమయంలో గండ్లను పూడ్చగలగటం సీఎం ఘనతే. చివర్లో ఆయన వెళ్లేటపుడు.. 'గట్టిగా నిలబడ్డావమ్మా..' అనడం నాకెంతో ధైర్యన్నిచ్చింది.

ఆంధ్రజ్యోతి : బుడమేరు ఆక్రమణలకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సృజన : బుడమేరు ఆక్రమణలకు సంబంధించి సమగ్ర డేటా తీస్తున్నాం. 1956 నుంచి బుడమేరు వివిధ దశల్లో ఎలా ఉందన్న డేటా తెప్పించాం. అన్ని సందర్భాల్లోనూ 20 నుంచి 120 మీటర్ల మేర ఉంది. బుడమేరు పరివాహక ప్రాంతం మొత్తం 2,930 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. విజయవాడ నగరం వెలుపల 240 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయి. ఇవన్నీ పొలాలే కాబట్టి పెద్దగా సమస్య లేదు. విజయవాడలో 80 ఎకరాల విస్తీర్ణంలో 4వేలకు పైగా ఆక్రమణలు ఉన్నాయి. చాలావరకు కాలనీలుగా ఉన్నాయి. అపార్ట్‌మెంట్లు కూడా ఉన్నాయి. బుడమేరు శాశ్వత పరిష్కారానికి ఏం చేయాలన్న దానిపై మూడు ఆప్షన్లు మా ముందున్నాయి. ఆక్రమణల తొలగింపు ఒకటైతే, రిటైనింగ్ వాల్ నిర్మించటం, పాముల కాల్వ నుంచి బుడమేరుకు సమాంతరంగా మరో ప్రత్యామ్నాయ కాల్వను ఆధునికీకరించడం మా ముందున్న రెండు, మూడు ఆప్షన్లు. వీటిపై ముఖ్యమంత్రితో చర్చించాక ఆయన ఇచ్చే మార్గదర్శకాల

- మిగతా 6లో



పునాదిపాడులో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతు ఖాతాలో నగదు జమ

» పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

కంకిపాడు, సెప్టెంబరు 21: "రైతులు, కౌలురైతులకు న్యాయం చేసేం దుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే బిల్లులు వారి ఖాతాల్లో జమ చేస్తాం." అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలం లోని పునాదిపాడు రైతుసేవా కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులను అధిగమిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు నిబంధనలపై వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, ట్రాన్స్‌పోర్టు సౌకర్యాన్ని కల్పించాలని ఆయన సూచించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిప్యూటీ కలెక్టర్ టి.వి.సతీష్, తహసీల్దార్ భావన్నారాయణ, ఏవో పి.ఎం.కిరణ్, రైతులు మద్దాలి సాయిబాబు, కనగాల సుబ్బారావు, శ్రీనివాసరావు, సంజీవరావు పాల్గొన్నారు.

ఏడాదైనా ధాన్యం బిల్లులు జమచేయలేదు

» ఉప్పలూరు పీఏసీఎస్ నిర్వాకంపై మంత్రికి ఫిర్యాదు

ధాన్యం విక్రయ బిల్లులను రైతు ఖాతాల్లో జమ చేయకుండా ఉప్పలూరు పీఏసీఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు గ్రామానికి చెందిన రైతు కనగాల సుబ్బారావు ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన ధాన్యానికి బిల్లులు రూ.10 లక్షలు ఉప్పలూరు సొసైటీలో జమయ్యాయని, ఇప్పటికీ సొసైటీ అధికారులకు తమ ఖాతాల్లో నగదు జమ చేయడం లేదని, సొసైటీ అధికా రులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని మంత్రికి తెలిపారు. తక్ష ణం సమస్యను పరిష్కరించాలని జేసీ గీతాంజలిశర్మను మంత్రి ఆదేశించారు.



50వ డివిజన్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఏడాదిన్నరలో బందరు పోర్టు పూర్తిచేస్తాం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 21: "ఏడాదిన్నరలో బందరు పోర్టు పూర్తి చేస్తాం. బందరులో పెట్రోలియం రిఫైనరీ ఏర్పాటు చేస్తాం. దీపావళి నాడు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి శ్రీకారం చుడతాం. జిల్లాలో వరదల వంటి ఎన్ని ఇబ్బందులొచ్చినా ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం." అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మచిలీపట్నం 27 వడివిజన్ ఖొజ్జిల్లిపేట, 50వ డివిజన్ సుందరయ్యనగర్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మచిలీపట్నం రోడ్ల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. టిడ్కో ఇళ్లను పూర్తిచేసి పేదలకు ఇస్తామన్నారు. గత పాలకులు తిరుమల శ్రీవారి లడ్డూలో జంతు వుల కొవ్వు నుంచి తీసిన నూనెను కలిపి ప్రసాదాన్ని అపవిత్రం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల మంజూరులో పేదల వద్ద లంచాలు గుంజారన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రానికి ఆదాయం లేదని, పెట్టుబడులు లేవని, రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామికవేత్తలను తరిమికొట్టి పైశాచిక ఆనందం పొందారని ఆరోపించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు మోటమర్రి బాబాప్రసాద్, ఎండీ ఇలియాస్‌బాషా, పిప్పళ్ల కాం తారావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

నా కొడుకు ప్రాణాన్ని కాపాడండి

» కొల్లు రవీంద్రకు కిడ్నీ బాధితుడి తల్లి మొర

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చికిత్సకు నగదు ఇప్పించి తన కొడుకు ప్రాణాన్ని కాపాడమని మంత్రి కొల్లు రవీంద్రకు కిడ్నీ బాధితుడి తల్లి మొర పెట్టుకుంది. శనివారం బైపాస్‌రోడ్డులోని 50వ డివిజన్‌లో రెండు కిడ్నీలు పాడైపోయి పూర్తిగా నీరసించిన దొడ్డాకుల శ్యాం సంతోష్‌ను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. శ్యాం సంతోష్ బాలాజీ విద్యాలయంలో ఏడో తరగతి చదువుతున్నాడు. తండ్రి వరప్రసాద్, తల్లి నాగగాయిత్రి తమ కుమారుని దుస్థి తిని మంత్రికి వివరించారు. రూ.లక్షలు గుమ్మరిస్తే కాని ఆపరేషన్ చేయబోమంటున్నారని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.

వరద బాధితులకు రూ.157.85 కోట్ల బ్యాంకింగ్ సేవలు

» మూడు రోజుల్లో రూ.148.22 కోట్ల రుణాల రీషెడ్యూల్.. రూ.9.62 కోట్లు మంజూరు: కలెక్టర్ సృజన

వన్‌టౌన్, సెప్టెంబరు 21: "వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నాం. రుణాల కోసం వారు పెట్టుకున్న దరఖా స్తుల్లో 2,740 ఖాతాలవి పరిష్కరించి మూడు రోజుల్లో రూ.157.85 కోట్ల విలు వైన బ్యాంకింగ్ సేవలందించాం. 1,900 ఖాతాలకు రూ.148.22 కోట్ల రుణా లను రీషెడ్యూల్, 840 ఖాతాలకు కొత్తగా రూ.9.62 కోట్ల రుణాలను మంజూ రు చేయించాం." అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో 310 ఖాతాలకు రూ.77.50 లక్షల వినియోగ రుణాలు ఉన్నాయని, శనివారం ఒక్కరోజే 450 ఖాతాలకు రూ.28.96 కోట్ల మేరకు రుణాలను రీషెడ్యూల్ చేసినట్లు ఆమె తెలిపారు. కొత్తగా 315 ఖాతాలకు రూ.1.83 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో 190 ఖాతా లకు రూ.47 లక్షల మేర వినియోగ రుణాలు ఉన్నాయని తెలిపారు. బ్యాంక్‌ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, పెయింటర్, ఏసీ మెకానిక్ సేవల కోసం 5,149 రిక్వెస్టులు నమోదయ్యాయని, 4,922 పరిష్కరించామని తెలిపారు.



కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం సమర్పిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి..రాము తదితరులు

బదిలీలు పారదర్శకంగా చేయాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 21: ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీని ప్రభుత్వ ఉద్యో గుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాము కోరారు. శనివారం కలెక్టర్‌ను సంఘ నాయకులతో పాటు ఆయన కలిశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ రూపొందించిన రాష్ట్ర, జిల్లాస్థాయి కార్యవర్గ జాబితాల బుక్‌లెట్‌ను కలెక్టర్‌కు అందించారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, సాయిరాంనాయక్, పవన్‌కుమార్, ఎస్వీ రామారావు, వీరబాబు, బ్రహ్మానందబాబు, పరమేశ్వరరావు, భాస్కర్, సలీం, సముద్రేశ్వరరావు, లోకేష్, రవికుమార్, శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

కృష్ణానది, మునేరు సంగమ ప్రాంతంలో లంకభూముల్లో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు ఇటీవల వచ్చిన వరదల దెబ్బకు కుళ్లిపోయాయి. అది చాలదన్నట్టు వరద లంక భూముల్లోకి భారీగా ఇసుకను మోసుకొచ్చింది. వంద ఎకరాలకు పైగా విలువైన పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. ఇసుకను తొలగించడం రైతులకు పెనుభారంగా మారింది. ఇసుక తొలగింపునకు రూ.లక్షలు ఖర్చు కానుండటంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ప్రభుత్వసాయం కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.





ఇసుక దిబ్బలుగా మారిన మున్నలూరు లంక భూములు

లంక భూముల్లో ఇసుక మేటలు



రైతులకు పెనుభారంగా తొలగింపు ● ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

కంచికచర్ల: కంచికచర్ల మండలం మున్నలూరు, మోగులూరు, చందర్లపాడు మండలం ఏటూరు గ్రామాలకు చెందిన రైతులకు కృష్ణానది, మునేరు సంగమ ప్రాంతంలో మూడు వందల ఎకరాలకు పైగా లంక భూములున్నాయి. కంద, చామ, అరటి తోటలతో పాటుగా పత్తి, మిర్చి, మినుము పంటలు సాగు చేశారు. ఓవైపు కృష్ణానది, మరోవైపు మునేరు వరద దెబ్బకు తోటలు, పంటలు దెబ్బతిన్నాయి. నాలుగైదు రోజులు వరద ముంపు ఉండటం వల్ల తోటలు, పంటలు పూర్తిగా కుళ్లిపోయాయి. పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. వంద ఎకరాలు ఇసుక దిబ్బలుగా మారాయి. పంట భూముల్లో రెండు అడుగుల ఎత్తున ఇసుక మేటవేసింది. ఇసుక మేటలు తొల గించి, బాగు చేశాకే తోటలు, పంటల సాగు సాధ్యమవుతుంది. ఇసుక తొలగింపు చాలా ఖర్చుతో కూడుకుంది. ఇసుకను ఎవరైనా తీసుకెళ్లినా ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు అవుతుందని, ఎవరూ తీసుకెళ్లపోతే ఇసుకను బయటకు తరలించేందుకు లక్షల్లో ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. వరద పూర్తిగా తగ్గిపోయి పక్షం రోజులైనా ఒక్క రైతు కూడా ఇసుక మేట తొలగించలేదు. లక్షల్లో పెట్టుబడి నష్టపోయిన రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. లంక భూముల్లో 150 వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. స్టార్టర్లు పనికిరాకుండా పోయాయి. మోటారు ఆయిలింగ్ చేసి, కొత్త స్టార్టర్లు, ఇతరత్రా ఉపకరణాల కొనుగోలుకు రూ.ఐదువేల వరకు అవుతోందని అంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మునేటి వరదకు తోటలు, పంటలతో పాటుగా సారవంతమైన లంక భూములు దెబ్బతిన్నాయి. భారీగా వేసిన ఇసుక మేటలు తొలగింపు ఒకటి రెండు రోజుల్లో అయ్యే పనికాదు. రూ.లక్షల్లో ఖర్చవుతుంది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- చిరుమామిళ్ల రామారావు, రైతు



మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్

కొత్త చట్టాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

» ఐలు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్

గన్నవరం, సెప్టెంబరు 21: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆలిండియా లాయర్స్ యూనియన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్‌లో ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలు-ప్రజల హక్కులపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గత క్రిమినల్ చట్టాలను రద్దు చేసి నూతన చట్టాలను ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి తెచ్చిందన్నారు. కొత్త చట్టాల్లో కొత్తదనం ఏమీ లేదని, నాటి వలస పాలకుల బానిస మనస్తత్వానికి తోడు మరిన్ని దారుణ మైన, ప్రజలకు వ్యతిరేకమైన అంశాలు వీటిలో ఉన్నాయని తెలిపారు. 90శాతం వరకూ పాత చట్టాలను మక్కీకిమక్కీగా దించేశారన్నారు. 10 శాతం మార్పులు.. వలస పాలకుల చట్టాలు కంటే అధ్వానంగా, మన రాజ్యాంగం, సుప్రీం కోర్టు గుర్తించిన ప్రజాహక్కులను కాలరాసేలా ఉన్నాయని తెలిపారు. ఉద్యమంలో న్యాయవాదులు ప్రజలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సంపర శ్రీనివాసరావు, సుధాకర్, రాజారత్నం, అనుమోలు వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, వేము కోటేశ్వరరావు పాల్గొన్నారు. కొత్త భవనాలు నిర్మించాలని, న్యాయవాదుల సమస్యలు తీర్చాలని తీర్మానం చేశారు.

ఆంజనేయులు తప్పుడు వార్తలు రాయిస్తున్నారు

» ఆయన అక్రమాలు చంద్రబాబు దృష్టికి తీసుకెళతా

» ఐదేళ్లుగా వైసీపీ వారితో అంటకాగుతున్నారు: గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పటమట/చిట్టినగర్, సెప్టెంబరు 21: "విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు నాపై తప్పుడు వార్తలు రాయిస్తున్నారు. రాజకీయాల్లోకి రాకముందు ఆంజనేయులు పరిస్థితి ఏంటి?. ఎన్నికలకు ముందు వైసీపీతో చలసాని అంటకాగారు. ఆయన అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తే వాస్తవాలు బయటకు వస్తాయి." అని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఆంజనేయులుకు ఛైర్మన్ పదవి చంద్రబాబు పెట్టిన భిక్ష. చంద్రబాబు అపాయింట్‌మెంట్ అడుగుతా.. చలసాని అక్రమాలు, అవినీతిని వైసీపీతో అంటకాగుతున్న విధానాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళతా. వైసీపీతో అంటకాగకపోతే వైసీపీ ప్రభుత్వంలో చలసాని డెయిరీ ఛైర్మన్‌గా ఎలా కొనసాగారు. రాష్ట్రం కోసం చంద్రబాబు47 ఏళ్లు చాకిరీ చేశారు. ఆయనను అరెస్టు చేస్తే లక్షలాది మంది రోడ్డు మీదకు వచ్చి ర్యాలీలు చేశారు. ఆ రోజు చలసాని ఎక్కడకి వెళ్లిపోయారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయవాడలో అత్యధిక శాతం పాలబూత్‌లు వైసీపీ వారికి కేటాయించింది.. నిజం కాదా?" అని వెంకట్రావు ప్రశ్నించారు. తన విజయాన్ని కాంక్షిస్తూ పవన్ కల్యాణ్ కూడా నియోజకవర్గానికి వచ్చారని, కూతవేటు దూరంలో ఉన్న వ్యక్తి ఆంజనేయులు రాలేకపోయారని అన్నారు. తాను 13 మాసాలు కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేశానని, రూ.5వేల కోట్ల టర్నోవర్ ఉన్న బ్యాంక్ టర్నోవర్‌ను రూ.8500 కోట్లకుపైగా తీసుకెళ్లానని వెంకట్రావు తెలిపారు. అయినా అప్పటి వైసీపీ నీచ ప్రభుత్వం పదవి నుంచి తనను తొలగించిందన్నారు. తాను కేడీసీసీ బ్యాంకు అధికారిపై దాడి చేశానని అవాస్తవాలు రాశారన్నారు. రామవరప్పాడు సర్పంచ్ శ్రీదేవి గతంలో వైసీపీలో ఉండి తనను ఇబ్బంది పెట్టిందన్నారు. ఆమెను గద్దె అనురాధ కలవడం తనకు సమంజసమనిపించలేదని, ఈ విషయమై వారిని అడిగినమాట వాస్తవమేనన్నారు. గన్నవరం పరిధిలోని సీఐ, ఏసీపీలను తన ప్రమేయం లేకుండా గద్దె రామ్మోహన్ ఏకపక్షంగా పోస్టింగ్‌లు ఇప్పించారని, పార్టీలో ఆయన సీనియర్ నాయకుడని తానేమీ మాట్లాడలేదన్నారు. కృష్ణాజిల్లాలో జగన్ పాదయాత్ర సమయంలో తాను అందరికీ అన్నం పెడితే, జగన్ తనకు సున్నం పెట్టాడన్నారు. తనతో వందల కోట్లు ఖర్చు చేయించిన వైసీపీ, కొడాలి నాని, వల్లభనేని వంశీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని, ప్రశ్నించారు. తనను మోసం చేసింది జగన్ అని, వైసీపీలో పనిచేసినందుకు సిగ్గుగా ఉందని వెంకట్రావు పేర్కొన్నారు.

32 ఏళ్లుగా పార్టీ కోసమే పనిచేస్తున్నా

» ఇప్పటికీ టీడీపీనే ప్రాణం

» మిల్క్ యూనియన్‌లో రాజకీయాలు ఉండకూడదనేదే లక్ష్యం

» ఇందులో అన్ని పార్టీల వారున్నారు: విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు



మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు, పక్కన డైరెక్టర్లు

"కృష్ణా మిల్క్‌యూనియన్‌ను రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నాం. పాలు పోసేవాళ్లు, సేకరించేవాళ్లు ఏ పార్టీ అనేది చూడం. పాడిరైతుకు ఎంతమేలు జరిగిందన్నదే ఆలోచిస్తాం. నేను పార్టీ ఆవిర్భావం నుంచి 32 ఏళ్లుగా టీడీపీ కోసం ప్రాణం పెట్టి పనిచేస్తున్నా. చంద్రబాబు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకుని ఈ స్థాయికొచ్చా. నేను ఎవరిపైనా తప్పుడు వార్తలు రాయించలేదు. ఆ అవసరం నాకు లేదు. మిల్క్‌యూనియన్ ఛైర్మన్‌గా నిర్వహించాల్సిన బాధ్యతలు చాలా ఉన్నాయి." అని కృష్ణా మిల్క్‌యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేసిన వ్యాఖ్యలపై శనివారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాల రైతుల్లో అన్ని పార్టీల వారున్నారని, ఇది మిల్క్ యూనియన్ కుటుంబమని, ఇక్కడ రాజకీయాలు చేస్తే ఇన్నేళ్లు యూనియన్ బతికేది కాదని స్పష్టంచేశారు. "వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయంలోనే నేను యూనియన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించా. ఐదేళ్లుగా ఏ తప్పు చేయలేదు. మా దగ్గర లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయి. అందుకే వైసీపీ వాళ్లు ఏమీ చేయలేకపోయారు. వంద షాపులు వైసీపీ వాళ్లకు ఇచ్చారనడం హాస్యాస్పదం. బీఎస్ఎన్ఎల్ పాయింట్లను లీజుకు తీసుకుని టెండర్లు పిలిచాం. అందులో అన్ని పార్టీల వాళ్లు, పార్టీలకు సంబంధం లేనివారు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమూల్‌ను ప్రోత్సహించింది. మాకు సహకారం అందించలేదు. పాడిరైతుల సహకారంతో నిలబడ్డాం. రాజకీయాలకు అతీతంగా యూనియన్‌ను నిర్వహించడం వల్లే ఇది సాధ్యమైంది. నాపైనా బ్లూమీడియాలో అనేక కథనాలొచ్చాయి. కొన్నింటిపై కోర్టుకు వెళ్లాం. ఇప్పటికీ వ్యక్తిగతంగా పార్టీ కోసం పనిచేస్తున్నా. పార్టీ ఏ పని అప్పగిస్తే అది తూచా తప్పకుండా చేశా. ఎవ్వరిపైనా కుట్రలు చేయలేదు." అని చలసాని పేర్కొన్నారు. "ఇక్కడ రాజకీయపార్టీలు చూస్తే యూనియన్ బతకదు. ఉమ్మడి కృష్ణాలోని 16మంది ఎమ్మెల్యేల్లో ఒక్క ఎమ్మెల్యేకే యూనియన్ పనితీరుపై అభ్యంతరముంటే తప్పెక్కడుందో ఆలోచించాలి. మాది నామినేటెడ్ బాడీకాదు, పత్రికల్లో వచ్చే కథనాలు, రాజకీయాలను యూనియన్‌కు ఆపాదించొద్దు." అని యూనియన్ డైరెక్టర్ సాయివెంకటరమణ కోరారు.

మల్లవల్లి పారిశ్రామికవాడ భూమికి సరిహద్దులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 21: మల్లవల్లి పారిశ్రామికవాడకు చెందిన భూమికి అధికా రులు శనివారం హద్దులు నిర్ణయిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పర్యవేక్షణలో పారిశ్రామికవాడకు చెందిన 1,460 ఎకరాల భూమిని విడగొట్టి సరిహద్దులు నిర్ణయించి ఏపీఐఐసీకి అప్పగించేందుకు శనివారం పనులు మొదలు పెట్టినట్లు ఆర్డీవో పద్మావతి, జిల్లా ఏడీ (సర్వే) మనీషాత్రిపాఠి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతా రాం తెలిపారు. 20మంది వీఆర్వోలు, 38మంది సర్వే సిబ్బందితో 12 బృందాలుగా ప్రభుత్వం వద్ద గల అధారాల ప్రకారం సరిహద్దులు నిర్ణయించేందుకు పనులు మొదలయ్యాయి. 200 ఎకరాల భూమి సరి హద్దు వివాదాస్పదంగా మారటంతో రెవెన్యూ, ఏపీఐఐసీ సంయుక్తంగా హద్దులు నిర్ణయిస్తోందని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారాం తెలిపారు. మల్లవల్లి పారిశ్రామికవాడ భూమి 1460 ఎకరాల్లో 100 ఎకరాలు పేదలకు ఇచ్చేలా గత ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారని, ఆ భూమితో సహా ప్రభుత్వ భూవికి సరిహద్దులు నిర్ణయించి ఏపీఐఐసీకి అప్పగించేందుకు పనులు చేయిస్తున్నామని ఆర్డీవో పద్మావతి వివరించారు. బాపులపాడు తహసీల్దార్ నాగభూషణం, ఏపీఐఐసీ సిబ్బంది సర్వే పనుల్లో పాల్గొన్నారు. రైతులనుంచి ఇబ్బందులు రాకుండా 256మంది పోలీసులతో సీఐ సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాసు, జనార్దన్ పర్యవేక్షించారు.



సరిహద్దులు నిర్ణయిస్తున్న అధికారులు

ప్రభుత్వానికి సహకరిస్తాం: నిర్వాసిత రైతులు

మల్లవల్లి పారిశ్రామికవాడకు సాగుభూములిచ్చిన రైతులు ప్రభుత్వానికి సహకరించేందుకు ముందుకొచ్చారు. సరిహద్దులు తేలితేనే తమ భూములెక్కడ ఉన్నా యో తెలుస్తుందని అందుకే ప్రభుత్వానికి, ఏపీఐఐసీకి పూర్తిగా సహకారమందిస్తామని పంతం కామరాజు, అనిల్‌కుమార్ తదితరులు తెలిపారు. పారిశ్రామిక వాడలో తమ భూములున్నట్లు తేలితే తమకు నష్టపరి హారం వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంక ట్రావు హామీ ఇచ్చిన మేరకు అధికారులకు సహకరిస్తు న్నామని తెలిపారు.

బుడమేరు ప్రక్షాళనకు మూడు ఆప్షన్లు

(ఐదో పేజీ తరువాయి)

ప్రకారం ముందుకెళ్తాం.

ఆంధ్రజ్యోతి: ఫ్లడ్ ఎన్యూమరేషన్ ఎంతవరకు వచ్చింది?

సృజన: ఒక్క వరద బాధితుడు కూడా నష్టపోకూడదని ముఖ్యమంత్రి చెప్పిన ఆదేశాల మేరకు ఫ్లడ్ ఎన్యూమరేషన్ జరిగింది. మొత్తం 2,32,000 ఇళ్లకు సంబంధించి ఎన్యూమరేషన్ జరిగింది. దెబ్బతిన్న ఇళ్లు 50వేల వరకు ఉంటాయని భావించాం. ఎవరూ నష్టపోకూడదన్న ఉద్దేశంతో రీ వెరిఫికేషన్‌ను కూడా సమర్థవంతంగా నిర్వహించాం. 75వేల నుంచి 80వేల వరకు ఇళ్లు డ్యామేజీ అయ్యాయని గుర్తించాం. పలువురు బాధితులు సర్వే జరగలేదని ఫోన్లు చేస్తున్నారు. అటువంటి వాటిని కూడా తహసీల్దార్లతో వెరిఫికేషన్ చేయిస్తున్నాం. సర్వే పరిధిలోకి రాని వారి వివరాల గురించి ప్రజాప్రతినిధులు కూడా చెబుతున్నారు. కాబట్టి నిజమైన బాధితులు ఎవరు ఉన్నా పరిగణనలోకి తీసుకుంటాం. గ్రీవెన్స్ ద్వారా కూడా తెలుసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఇన్స్యూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా సేవలు ఎంతవరకు అందించారు?

సృజన: ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఇన్స్యూరెన్స్ ఫెసిలిటేషన్ ఏర్పాటు చేశాం. ఆయన ఆదేశాల మేరకు వాహనాలు, వ్యాపారాలు, దుకాణాలు, చిన్న పరిశ్రమలకు జరిగిన నష్టాన్ని ఇన్స్యూరెన్స్ క్లెయిమ్స్ ద్వారా కొంతవరకు భర్తీ చేసుకునే అవకాశాన్ని కల్పించాం. ఈ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా 6 వేలకు పైగా క్లెయింలను పరిష్కరించాం. చాలామంది రిపేర్లు చేయించుకున్న తర్వాత క్లెయిమ్స్ చేయించుకోవాలని ఆగారు. రిపేర్ల ఆలస్యం కారణంగా క్లెయిమ్స్ ఆలస్యమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: రుణాలకు సంబంధించిన ప్రక్రియ ఎలా ఉంది?

సృజన: మూడు రోజుల్లో 2,740 ఖాతాలకు సంబంధించి రూ.157.85 కోట్ల విలువైన సేవలందించాం. ఇప్పటి వరకు 1,900 రుణ ఖాతాలకు సంబంధించి రూ.148.22 కోట్లను రీషెడ్యూలింగ్ చేశాం. కొత్త రుణాల కోసం 840 ఖాతాలకు రూ.9.62 కోట్ల రుణాలను మంజూరు చేశాం. 310 ఖాతాలకు రూ.77.50 లక్షల వినియోగ రుణాలను మంజూరు చేశాం.

పరీక్ష రాయడానికి వెళ్తూ అనంత లోకాలకు..

» ఇద్దరు బీబీఏ విద్యార్థుల మృతి

» ఒకరిది విజయవాడ, మరొకరిది భీమవరం

» వెనుక నుంచి బుల్లెట్‌ను ఢీకొన్న కారు

» విజయవాడ నుంచి విశాఖ వెళ్తుండగా ప్రమాదం

» కాకినాడ జిల్లా తుని మండలం ఎర్రకోనేరు వద్ద ఘటన

తుని రూరల్, సెప్టెంబరు 21: పరీక్ష రాసేందుకు నగరం నుంచి విశాఖకు బుల్లెట్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను కారు రూపంలో మృత్యువు కబళించింది. తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడిన గంటకే ఇద్దరూ అనంత లోకాలకు వెళ్లిపోవడంతో వారికి కడుపుకోత మిగిలింది. కాకినాడ జిల్లా 16వ నెంబరు జాతీయ రహదారిపై తుని మండలం ఎర్రకోనేరు వద్ద శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు బీబీఏ విద్యార్థులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన నాదెండ్ల నిరంజన్ (19), పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పోలిశెట్టి రేవంత్ (19) ఇద్దరూ స్నేహితులు. వీళ్లు విజయవాడ కేఎల్ వర్సిటీలో బీబీఏ బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరికీ శనివారం మధ్యాహ్నం విశాఖపట్నంలో ఎంపీటీఎల్ పరీక్ష ఉండడంతో బుల్లెట్‌పై తెల్లవారుజామున విజయవాడ నుంచి బయల్దేరారు. ఓచోట ఆగి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. తర్వాత కాకినాడ జిల్లా తుని రూరల్ ఎర్రకోనేరు వచ్చేసరికి విశాఖపట్నం వెళ్తున్న కారు వీళ్ల బుల్లెట్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొట్టగా యువకులిద్దరూ ఎగిరిపడ్డారు. హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్రంగా గాయపడ్డారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఇద్దరినీ అటుగా వెళ్తున్న వాహనదారులు చూసి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. తుని రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారిని స్థానికంగా తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలపాలైన నాదెండ్ల నిరంజన్ ఆస్పత్రికి వెళ్లే సరికి మృతి చెందాడు. మరో యువకుడు పోలిశెట్టి రేవంత్ తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అతడు కూడా మృత్యువుతో పోరాడి వెంటిలేటర్‌పై తుదిశ్వాస విడిచాడు. తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద సమయంలో కారులో ముగ్గురున్నారని, వారిని తప్పించే ప్రయత్నం జరుగుతోందని మృతుల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.



స్నేహితులు నిరంజన్, రేవంత్ (ఫైల్)

శ్రీ చైతన్యలో ఉత్సాహంగా స్పోర్ట్సుమీట్

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 21: శ్రీ చైతన్య జూనియర్ కళాశాల డే స్కాలర్స్ జోనల్ స్థాయి పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి, గోశాల క్యాంపస్‌లో 100 మీటర్ల పరుగు పందెం, పటమటలో షాట్‌పుట్, గాయత్రినగర్ క్యాంపస్‌లో త్రోబాల్, ఏలూరు రోడ్ క్యాంపస్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. పోటీలను శ్రీ చైతన్య కళాశాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఏజీఎంలు, డీన్‌లు, ఎఏజీఎంలు, ప్రిన్సిపాల్ సహకారం అందించారు. విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది.

సస్పెక్ట్ షీటర్ అరెస్టు

వన్‌టౌన్, సెప్టెంబరు 21: నగర బహిష్కరణకు గురై హనుమాన్‌పేటలో తిరుగుతున్న పాయకాపురం, రాధానగర్‌కు చెందిన సస్పెక్ట్ షీటర్ పోతిరెడ్డి రంగారెడ్డి అలియాస్ కోటిరెడ్డి (40)ను శనివారం గవర్నర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. కోటిరెడ్డి నగరంలో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడిపై అనేక క్రైం కేసులు, అభియోగాలున్నాయి. నున్న పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు నమోదైంది. సీపీ ఇతడిని నగర బహిష్కరణ చేశారు. అయితే శనివారం హనుమాన్‌పేటలోని ఓ బార్ వద్దకువచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

వాంబేకాలనీలో చోరీ

పాయకాపురం, సెప్టెంబరు 21 : వాంబేకాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం గోవాడ కళావతి స్థానిక కాలనీలోని హెచ్ బ్లాక్‌లో నివాసం ఉంటుంది. ఈనెల 19వ తేదీ ఉదయం ఇంటికి తాళం వేసి బావాజీపేటలోని బంధువుల ఇంటికి వెళ్లింది. 20వ తేదీ ఉదయం ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గుర్తించిన చుట్టుప్రక్కల వారు కళావతికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఇంటి వద్దకు వచ్చి లోపలికి వెళ్లగా బీరువాలో ఉండాల్సిన 22 గ్రాముల బంగారపు ఆభరణాలు, రూ. 15 వేలు నగదు కనిపించలేదు. దీంతో బాధితురాలు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని వర్గాలను ఆదరించే మంచి ప్రభుత్వం

భవానీపురం, సెప్టెంబరు 21 : అన్ని వర్గాల ప్రజలను ఆదరించే టీడీపీ ప్రభుత్వమే మంచి ప్రభుత్వమని, ప్రజలు ఇది గ్రహించాలని, 100 రోజుల పరిపాలనలో ఇసుకను చేరువ చేయడం, పింఛన్ల పెంపు తదితర నిర్ణయాలతో చంద్రబాబుకు ఆదరణ పెరిగిందని టీడీపీ 43వ డివిజన్ అధ్యక్షుడు కొనికి కొండయ్య అన్నారు. 133, 134 సచివాలయాల పరిధి ఊర్మిళానగర్‌లో శనివారం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించి, ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయాలను కొండయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ తెలుగు యువత అధికార ప్రతినిధి పూజల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఊర్మిళానగర్‌లో...



23వ డివిజన్‌లో..



12వ డివిజన్‌లో..



40వ డివిజన్‌లో..

కరపత్రాలు పంపిణీ

గవర్నర్‌పేట: 23వ డివిజన్ టీడీపీ ఆధ్వర్యంలో మొదటి వందరోజుల్లో ప్రజలు మెచ్చిన కొన్ని ముఖ్య కార్యక్రమాలను కరపత్రాల ద్వారా తెలియజేస్తూ టీడీపీ శ్రేణులు ఇంటింటా కరపత్రాలు పంపిణీ నిర్వహించారు. 23వ డివిజన్ కార్పొరేటర్ ఎన్ బాలస్వామి ఆధ్వర్యంలో డివిజన్ టీడీపీ నేత చింతా దుర్గారావు, సమతా మెడికల్ షాప్ యజమాని సాయి, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భవానీపురం శివాలయం సెంటర్‌లో

100 రోజుల పాలనపై అవగాహన

పటమట : ఎన్డీయే కూటమి ఏర్పడి 100 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా 12వ డివిజన్ టీడీపీ నాయకులు శనివారం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. పింఛన్ రూ.4వేలకు పెంపు, అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేయడం, మెగా డీఎస్సీ ప్రకటించడం తదితర అంశాలపై అవగాహన పరిచారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శాయన బుజ్జిలు పాల్గొన్నారు.

13వ డివిజన్‌లోనూ....

100 రోజుల ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలపై టీడీపీ చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 13వ డివిజన్‌లోనూ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు పథకాలపై వివరించారు. డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు తోటవారి వీధి, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. వీరంకి డాంగే కుమారి, ఎన్ శ్రీను, కొరపాటి శ్రీను, ఎన్ సాయిలక్ష్మి, నిర్మల, మానస స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయం సెంటర్ వద్ద ...

విద్యాధరపురం: 42వ డివిజన్ ఎన్డీయే కూటవి ు నాయకుడు తిరుపతి సురేష్, శివాజీ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పీవీ చిన సుబ్బయ్య, కె. కొండయ్య, సుబ్రహ్మణ్యం, జశ్వంత్, హనుమంతరావు, మోహన్, అయాజ్, పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో ...

వన్‌టౌన్: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి ఆధ్వర్యంలో సచివాలయ అధికారులతో కలిసి శనివారం 40వ డివిజన్ టీడీపీ నాయకులు ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయకృష్ణ సూపర్‌బజార్ రోడ్డు, కోళ్లఫారం రోడ్డుల్లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు గురించి, ఇప్పటికే చేసినా, ఇకముందు చేయబోతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. 40వ డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి వెంకట సుబ్బయ్య, మన్నం నారాయణరావు, మలినేని ఆదినారాయణ, అడుసుమిల్లి వెంకటేశ్వర్లు, దేవినేని మహేష్, సంగా తిరుపతయ్య పాల్గొన్నారు.

గద్దె దంపతులకు సత్కారం



గద్దె దంపతులను సత్కరిస్తున్న పూనేలోని తెలుగు వాసులు

పటమట, సెప్టెంబరు 21 : తిరుమల ప్రసాదాల కల్తీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించడంతో పాటుగా తిరుమల పవిత్రత పెరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకుంటారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పూనేలో ఉన్న గద్దె రామ్మోహన్, అనురాధ దంపతులను అక్కడి తెలుగువారు హైదరాబాద్ హౌస్‌లో శనివారం ఘనంగా సత్కరించి, ఛత్రపతి శివాజీ బొమ్మను బహూకరించారు. లక్షలాది భక్తులు ఇష్టపడే లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడంపై పూనేలోని తెలుగువారు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ కల్తీకి కారణమైన వారిని ప్రభుత్వం గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఆంధ్రా అసోసియేషన్ ఛైర్మన్ అడుసుమిల్లి వంశీకృష్ణ, మోహన్‌నాయుడు ఎల్లంకి, ఆచంట శివప్రసాద్, పోతగుంట్ల విష్ణు, వెంకట్, వీవీ రాంబాబు, ఎస్ శ్రీహరిలు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ ఆగడాలకు చెక్

● సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్



గుణదల, సెప్టెంబరు 21: గుణదల పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ సంచరించే ప్రాంతాలను గుర్తించి వారిని పట్టుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గుణదల పోలీస్ స్టేషన్ శివారు ప్రాంతాలైన మధురానగర్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో డాగ్‌స్క్వాడ్, డ్రోన్ కెమెరాల సాయంతో శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి విక్రయించే వారి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు. గంజాయి మత్తులో పాదచారులపై దాడులకు తెగబడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నామని వారిని పట్టుకుని కోర్టులో హాజరుపరుస్తామని, వారి ప్రవర్తనలో మార్పు రాని పక్షంలో సీపీ దృష్టికి తీసుకెళ్ళి నగర బహిష్కరణ చేయిస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ధర్మరాజు, గుణదల స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ వైద్య శిబిరం



మొగల్రాజపురం, సెప్టెంబరు 21: ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఆధ్వర్యంలో శనివారం మొగల్రాజపురం అమ్మ హాలులో వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలలో భాగంగా ఎన్ఆర్ఐ మెడికల్ అకాడమీ సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ శీతాంసు ఆధ్వర్యంలో జనరల్ మెడిసన్, పీడియాట్రిక్, స్కిన్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, గైనిక్ విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఈసీజీ చేసి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో మూడు వందల మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గారపాటి సతీష్ బాబు, జీవీ సుబ్బారావు, జనరల్ సెక్రటరీ సుంకర చంద్రశేఖర్, కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు బొబ్బా నారాయణరావు, ఎంవీ ప్రసాద్, యార్లగడ్డ సుబ్బారావు, మిరియాల వెంకటేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు : బొండా ఉమా



మాట్లాడుతున్న బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 21 : సంక్షేమ ఫలాలు ప్రజల ముంగిట్లోకి అందించడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 59వ డివిజన్‌లోని గుజ్జల సరళాదేవి కళ్యాణ మండపంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనపై స్థానికులతో మాట్లాడి ఇంటింటికి స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో నేతలు నాగవంశ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు, నేతలు బంగారునాయుడు, ఎరుబోతు శ్రావణి, పిరియా జగదాంబ, తదితరులు పాల్గొన్నారు.

మాకు ఎటువంటి సహాయం అందలేదు

63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ప్రజలు ఎమ్మెల్యే బొండా ఉమాను మాకు ఎటువంటి సహాయం అందలేదని అడిగారు. వరదలతో నష్టపోయిన కుటుంబాలకు కనీసం నిత్యావసరాలు కూడా ఎందుకు అందించలేకపోయారని మహిళలు ఆయనను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులకు ప్రకటించిన ఆర్థిక సహాయం ఎప్పుడు అందిస్తారని, బాధితులను ఆదుకోవాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం వరద బాధిత కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ స్మృతివనం వద్ద స్వచ్ఛతా హి సేవా



ప్రభుత్వాసుపత్రి, సెప్టెంబరు 21 : ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా పాటించాలని కాలేజీ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ బి. పద్మ అన్నారు. గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ స్మృతివనం వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీ విద్యార్థినులు స్మృతివనంలోని పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కడియం శ్రీదేవి, కాలేజీ విద్యార్థినులు పాల్గొన్నారు.

నలందలో ముగిసిన టీవోటీ సర్టిఫికెట్ కోర్సు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 21: సీబీఎస్ఈ సహకారంతో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియల్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సంస్థ విజయవాడ నలంద విద్యానికేతన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ట్రైనింగ్ టు ది ట్రైనర్స్ (టీవోటీ) కార్యక్రమాలు శనివారం ముగిశాయి. విద్యాబోధనలో ఉన్న సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ సాధికారత సాధించడమే ముఖ్య లక్ష్యంగా ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, సీనియర్ పీజీటీ, టీజీటీలకు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌కు సర్టిఫికేషన్ కోర్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పునీత్ శర్మ, శరద్ నౌటియల్, పూనమ్ (ఢిల్లీ) రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరై ఎన్ఈపి-2020 సవాళ్లను అధిగమించడానికి అనుభవం ఉన్న లెర్నింగ్ మాడ్యూల్, ట్రైనీ, అన్‌ట్రైనీ ఎలా గుర్తించాలో వివరించారు. లెర్నింగ్, అన్‌లెర్నింగ్, రీలెర్నింగ్ అనే అంశాలపై ప్రసంగించారు. సిస్టమాటిక్ అప్రోచ్ అనేది భవిష్యత్‌లో ట్రైనీని ఏ విధంగా అభివృద్ధి పరుస్తుందో తెలియజేశారు.





విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న యోగా సాధకులు, వంట పాత్రలకు నగదు అందజేస్తున్న స్పందన సమితి సభ్యులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

భవానీపురం, సెప్టెంబరు 21 : మంగళగిరి ప్రధాన కేంద్రంగా సాగుతున్న వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని కేసీ హైస్కూల్‌లో చదువుతూ ఇటీవల వరదలో పుస్తకాలు తడిసిపోయిన పాయకాపురం, అంబాపురం, అజిత్‌సింగ్‌నగర్‌లోని 100 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి 10 పుస్తకాలు చొప్పున యోగా సాధకులు గుండు జనార్ధనరావు, ఎస్. వెంకటేశ్వరరావులు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కేసీ హైస్కూల్ ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ దంపతుల సహకారంతో చేపట్టారు. యోగా సాధకులు తేలుగుంట్ల రాజా, ఎస్.హరిబాబు, వీఎల్ఎన్ ప్రసాద్, ఎస్.ప్రసాద్, ఎస్.వరప్రసాద్, ఎస్.చంద్రశేఖర్, లయన్‌గెలాక్సీ మెంబర్ నారిండి కిషోర్‌కుమార్‌లు పాల్గొన్నారు.

పాయకాపురం: స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో ప్రశాంతినగర్‌లోని సమితి కార్యాలయంలో సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ వంట పాత్రలు కొనుగోలు నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున 50 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్మిక కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను 100 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇమ్మానేని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బాధితులకు సహాయం అందించడానికి విరాళాలు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కె. నరసింహామూర్తి, శ్రీనివాసరావు, నాగరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లావణ్య



చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు

భవానీపురం: 45వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య శనివారం బాలాజీ కాలనీలో డివిజన్‌కు సంబంధించిన 48మంది పారిశుధ్య కార్మికులకు రూ.50వేల విలువైన నిత్యావసరాలు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరావు, మేస్త్రీ రామిరెడ్డిలను లావణ్య, సీనియర్ నాయకులడు మైలవరపు కృష్ణలు శాలువాలతో సత్కరించారు.

భాగ్యనగర్ గ్యాస్ రూ.50 లక్షల విరాళం

ధర్నాచౌక్: వరద బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధికి భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ (బీజీఎల్) రూ. 50 లక్షల విరాళాన్ని అందజేసింది. శనివారం సీఎం చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు. ఈ సందరంగా విజయవాడ భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రామ్‌మోహన్ కర్నాటి మాట్లాడుతూ బాధితులకు తమ వంతుగా ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. విజయవాడ బీజీఎల్ డైరెక్టర్ వై.ధనుత తదితరులు పాల్గొన్నారు.

ఆటో మరమ్మతులకు ...

వన్‌టౌన్: భవానీపురం 39వ డివిజన్ గుప్తా సెంటర్‌కు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త అల్లంశెట్టి వరప్రసాద్ ఆటో వరద నీటిలో మునిగి నడపడానికి వీలు లేకుండా పోయింది. ఈ కారణంగా ఆటో మరమ్మతుల కోసం టీడీపీ ప్రధాన కార్యదర్శి బుద్దావెంకన్న ఆదేశాల మేరకు శనివారం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని కాండ్రేగుల రవీంద్ర అందచేశారు. రేగళ్ల లక్ష్మణ, సురభి బాలు, రావుల ప్రవీణ్, పాయల రాజు, కర్రి కిరణ్‌కుమార్, పిళ్లా లోకేష్, ముద్దా నారాయణ పాల్గొన్నారు.

పాతకక్షలతో దాడి

పాయకాపురం, సెప్టెంబరు 21 : పాతకక్షలతో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరచిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం దేవినగర్ ప్రాంతానికి చెందిన ఇప్పిలి సోంబాబు శుక్రవారం చెన్నై నుంచి బొమ్మల లోడ్ రావడంతో నున్న మ్యాంగ్ మార్కెట్‌కు వచ్చాడు. అదే సమయంలో అటుగా వచ్చిన తునుగు రామారావు అనే వ్యక్తి సోంబాబుతో గొడవపడ్డాడు. వీరికి పాతగొడవలు ఉండటంతో రామారావు కత్తితో సోంబాబుపై దాడి చేశాడు. దాడిలో మెడ, చేతులపై గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందనలు

లబ్బీపేట, సెప్టెంబరు 21: ఏలూరులో జరిగిన రిపబ్లిక్ డే గ్రూప్ సెలక్షన్ క్యాంపులో తమ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ వై.సమీర్‌బాబు క్యాంపు సీనియర్ రెండవ బహుమతి, ఎల్.రోహిత్ సంస్కృతికలో రెండో బహుమతి పొందినట్లు నలంద కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం. అనురాధ తెలిపారు. ఆ విద్యార్థులను అసోసియేట్ ఎన్‌సీసీ ఏఎన్‌వో కె.సుధాకర్, ఇతర అధ్యాపకులు అభినందించారు.



ఏపీలో దేవర టికెట్ ధరలు పెంపు



జూనియర్ ఎన్టీఆర్ నటించిన పాన్ ఇండియా సినిమా 'దేవర' టిక్కెట్ల ధరలు పెంపు, స్పెషల్ షో లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 27న విడుదల అవుతోన్న ఈ సినిమా మొదటి రోజు ఆరు షో లు.. అక్టోబరు 9వరకూ ఐదు షో ల చొప్పున రాష్ట్రంలో రిలీజైన అన్ని థియేటర్లలో ఆడించుకోవచ్చు. టిక్కెట్ ధరలు పెంచుకోవడానికి నిర్మాతల వినతిని పరిశీలించిన ప్రభుత్వం 60రూపాయల నుంచి 135రూపాయల వరకూ పెంచుకొనేందుకు అనుమతిచ్చింది. మొదటి రోజు అర్ధరాత్రి 12గంటలకు బెనిఫిట్ షో, ఉదయం ఆరింటికే మార్నింగ్ షో నుంచే సినిమా ప్రదర్శనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మాతలకు అనుమతి ఇచ్చింది. విడుదలైన రెండో రోజు(28) నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఐదు షో లు ప్రదర్శించుకోవచ్చు. అక్టోబరు 6తర్వాత సాధారణ ప్రదర్శనలు ఉంటాయి.

వేధించడం మా విధానం కాదు : పవన్ కల్యాణ్



'రాజకీయాలకు అతీతంగా చిత్ర పరిశ్రమకు మేలు చేయాలనేదే చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానం. వైకాపా ప్రభుత్వం తరహాలో నిర్మాతలను, సినీ నటులను వేధించడం మా ప్రభుత్వ విధానం కాదు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'దేవర' చిత్రం ప్రత్యేక ప్రదర్శనలు, టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్టీఆర్, నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనర్ ట్వీట్ చేసింది. దీనిపై పవన్‌కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. వైసీపీ పాలనలో సినీ ప్రముఖులు ఎన్ని కష్టాలు పడ్డారో నాకు తెలుసు. వ్యక్తులు, రాజకీయాలతో మాకు సంబంధం లేదు, పరిశ్రమను మేం గౌరవిస్తాం. మీ సినిమాకు మంచి జరగాలి' అని 'దేవర' యూనిట్‌కు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)



వెంకీ షూటింగ్‌లో బాలయ్య

అగ్ర హీరోల షూటింగ్స్ ఒకేచోట జరుగుతున్నప్పుడు ఒక హీరో సెట్‌కు మరో హీరో వెళ్లడం, సరదాగా కాసేపు గడపడం, సినిమాల గురించి మాట్లాడుకోవడం గతంలో ఓ అలవాటుగా, సంప్రదాయంగా ఉండేది. హీరోల మధ్య ఐకమత్యానికీ, స్నేహబంధానికీ అటువంటి సంఘటనలు అద్దం పట్టేవి. చాలా రోజుల తర్వాత నందమూరి బాలకృష్ణ మళ్లీ ఆ సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న తాజా చిత్రం షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న బాలకృష్ణ ఈ విషయం తెలుసుకుని వెంకటేశ్ షూటింగ్ స్పాట్‌కు వెళ్లి సందడి చేశారు. బాలయ్య, వెంకీ మంచి స్నేహితులు. అలాగే అనిల్ రావిపూడి బాలయ్యతో 'భగవంత్ కేసరి' చిత్రం రూపొందించారు. బాలయ్య రాకతో టీమ్ చాలా థ్రిల్ అయింది.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎన్టీఆర్ తనయుడు, ఛాయాగ్రాహకుడు నందమూరి మోహనకృష్ణ, ఆయన కుమార్తె మోహన రూప శనివారం కలసి రూ. 25 లక్షల విరాళం చెక్కు అందజేశారు.

రజనీ.. ఓ సుప్రీమ్ స్టార్



రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ 33 ఏళ్ల తర్వాత కలసి నటించిన సినిమా 'వేట్టయాన్'. తాజాగా ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమాన్ని చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ గురించి రజనీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ "ఒకానొక సమయంలో అమితాబ్ బచ్చన్ సినీ నిర్మాతగా భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయారు. తన దగ్గర పనిచేసే వాచ్‌మెన్‌కు కూడా జీతం ఇవ్వలేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కాక తనకు ఎంతో ఇష్టమైన జూహూ ఇంటిని వేలానికి పెట్టారు. అప్పుడు బాలీవుడ్ మొత్తం ఆయన్ను చూసి నవ్వింది. కానీ ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి కోలుకుని.. మరో మూడేళ్లలో.. వరుస సినిమాలు..'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోతో మళ్లీ నిలదొక్కుకున్నారు. జూహూలోని తన ఇంటితో పాటు మరో మూడు ఇళ్లను అమితాబ్ తిరిగి కొనుగోలు చేశారు" అని రజనీ చెప్పారు. ఈ వేడుకకు హాజరు కాలేకపోయినా.. అమితాబ్ ఓ వీడియో పంపి అభిమానులను ఖుషీ చేశారు. ఆ వీడియోలో అమితాబ్ మాట్లాడుతూ "ఇది నా తొలి తమిళ చిత్రం. రజనీకాంత్.. అందరిలో ఓ సుప్రీమ్ స్టార్. 1991లో రజనీ, నేను కలసి నటించిన చిత్రం 'హమ్'. ఇందులో రజనీ నా సోదరుడిగా నటించారు. షూటింగ్ విరామంలో నేను ఏ.సీ కార్‌లో విశ్రాంతి తీసుకునే సమయంలో.. రజనీ ఫిల్మ్ సెట్స్‌లో కింద పడుకునేవారు. ఈ చిన్న ఉదాహరణ చాలు ఆయన ఎంత సింపుల్‌గా ఉంటారో చెప్పడానికి" అని అన్నారు.

అమితాబ్ కోసం ప్రకాశ్‌రాజ్...

ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ పాత్ర తమిళ్ వెర్షన్‌కు నటుడు ప్రకాశ్‌రాజ్ డబ్బింగ్ చెప్పడం విశేషం. సినిమాలో రజనీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా కనిపించనున్నారు. అమితాబ్, రజనీకి సీనియర్‌గా సత్యదేవ్ అనే పాత్రలో నటిస్తున్నారు. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదలవుతోంది.

మా మధ్య అలాంటి సంబంధం లేదు



తన భార్య ఆర్తి రవికి విడాకులు ఇవ్వాలని తాను తీసుకున్న నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు అంగీకరించారని, తన సంతోషమే వారికి ముఖ్యమని హీరో 'జయం' రవి స్పష్టం చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'బ్రదర్' సినిమా ఆడియో విడుదల వేడుక శనివారం చెన్నైలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "ఇంతకాలం ఇండస్ట్రీలో ఎలాంటి గాసిప్స్ లేకుండా జీవితాన్ని గడిపాను. ఇపుడు నాకు, పరాయి స్త్రీకి సంబంధం ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఇది చాలా తప్పు. గాయని కెనీషాకు నాకు మధ్య ఎలాంటి సంబంధం లేదు. ఎంతోమందికి ఆమె ప్రాణం పోశారు. ఆర్తికి తెలియకుండా విడాకుల నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటన చేశారు. విడాకుల విషయంపై రెండు సార్లు నోటీసులు పంపించాను. ఇదే విషయంపై ఆర్తి తండ్రి వచ్చి నా తల్లిదండ్రులతో చర్చించారు. ఇంత జరిగినా తనకు తెలియకుండా తీసుకున్నట్టు చెప్పడం షాకింగ్‌కు గురిచేసింది. విడాకుల గురించి నా పెద్ద కుమారుడికి కూడా వివరించాను. అందరు పిల్లల్లాగే అతను కూడా మేమిద్దరం కలిసివుండాలని కోరాడు. నా ఇద్దరు కుమారులు నా వద్దనే ఉంటున్నారు. ఇపుడు నేను కోరేది ఒక్కటే.. ప్రైవేట్ లైఫ్ ప్రైవేట్ లైఫ్‌గానే ఉండనివ్వండి. గాయని కెనీషా 600కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. మేమిద్దరం ఒక హీలింగ్ సెంటర్‌ను నెలకొల్పి అనేక మందికి సాయం చేయాలని ప్లాన్ చేస్తున్నాం. దాన్ని పాడు చేయవద్దు. అనవసరంగా నా గురించి, కెనీషా గురించి చెడుగా మాట్లాడవద్దు' అని కోరారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

రవికుమార్ చౌదరి ఫ్లాష్‌బ్యాక్ ఏమిటి?



'యజ్ఞం', 'పిల్లా నువ్వు లేని జీవితం' వంటి హిట్ చిత్రాలు అందించి, ఇటీవల రాజ్‌తరుణ్ నటించిన 'తిరగబడరా సామీ' తో మరో విజయం అందుకొన్న దర్శకుడు రవికుమార్ చౌదరి తన కొత్త చిత్రం వివరాలు వెల్లడించారు. 'ఫ్లాష్‌బ్యాక్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఈ సినిమా ఉంటుందని, న్యూ ఏజ్ లవ్‌స్టోరీగా రూపొందుతుందని ఆయన తెలిపారు. 'లేనిది ఎవరికి?' అనేది ట్యాగ్ లైన్. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌కు రచన: డైమండ్ రత్నబాబు, పాటలు: సుద్దాల అశోక్ తేజ, వరంగల్ శ్రీను, సంగీతం: జేబీ, ఛాయాగ్రహణం: ప్రభాకరరెడ్డి, సమర్పణ: రిగ్వేద చౌదరి. నటీనటులు, ఇతర వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత కార్తీక్ రెడ్డి రాకాసి చెప్పారు.

రొమాంటిక్ కామెడీ డ్రామా



'హీరో' ఫేమ్ అశోక్ గల్లా, గౌరి ప్రియ జంటగా ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఉద్భవ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే మొదలెట్టనున్నాం. అందరినీ కడుపుబ్బా నవ్వించే ఈ చిత్రంలో గుండెలకు హత్తుకునే డ్రామా కూడా ఉంటుంది" అని చెప్పారు.

ఆదివారం


ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
పెనెలోప్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 24
రెజ్ బాల్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 27
విల్ అండ్ హార్పర్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 27
అమెజాన్ ప్రైమ్		
స్కూల్ ఫ్రెండ్స్	హిందీ సిరీస్	సెప్టెంబర్ 25
నోబడీ వాంట్స్ దిస్	వెబ్ సిరీస్	సెప్టెంబర్ 26
స్త్రీ 2	హిందీ చిత్రం	సెప్టెంబర్ 27
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
వాళ	మలయాళ చిత్రం	సెప్టెంబర్ 23
9-1-1	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 24
గ్రోటీ స్కేరీ	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 26
తాజా ఖబర్ 2	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 27
జీ 5		
డిమోంటి కాలనీ2	తమిళ చిత్రం	సెప్టెంబర్ 27
లవ్ సితార	హిందీ చిత్రం	సెప్టెంబర్ 27

సితార ప్రేమకథ



శోభితా దూళిపాళ్ల ప్రధాన పాత్ర పోషించిన ఫ్యామిలీ డ్రామా 'లవ్ సితార'. నేరుగా ఓటీటీలో విడుదలవుతోంది. కేరళలోని ప్రకృతి సొబగుల మధ్య ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆధునిక భావాలున్న తార అనే ఇంటీరియర్ డిజైనర్ పాత్రలో శోభిత నటించారు. అర్జున్ అనే వ్యక్తిని ఆమె ప్రేమించడం, వారిద్దరి మధ్య దాగిన కొన్ని రహస్యాలు పెళ్లికి ముందు బయటపడడంతో ఎలాంటి పరిణామాలు జరిగాయి అనే అంశం చుట్టూ అల్లుకున్న కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. రాజీవ్ సిద్ధార్థ, సోనాలి కులకర్ణి కీలకపాత్రల్లో నటించారు. వందన్ కటారియా దర్శకత్వంలో ఆర్ఎస్‌వీపీ ప్రొడక్షన్స్ నిర్మించింది. సెప్టెంబర్ 27న జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది.

పేరెంటింగ్

పిల్లలు గొడవపడుతుంటే..

ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే ఫైటింగ్స్‌కి కొదువుండదు. వాళ్లను సముదాయించడం తల్లిదండ్రులకు రోజూ సవాలుగానే ఉంటుంది. ఈ విషయంలో పేరెంటింగ్ ఎక్స్‌పర్ట్స్ చేస్తున్న సూచనలు ఇవి...

- పిల్లలు గొడవపడినప్పుడు "వాళ్లు చూడు ఎంత బాగా కలిసుంటారో, ఎంత బాగా చదువుకుంటారో" అంటూ ఇతర పిల్లలతో ఎప్పుడూ పోల్చవద్దు. ఇంట్లో పిల్లలతో కూడా పోల్చకూడదు.
- పిల్లలు ఏ విషయంలో దెబ్బలాడుకుంటున్నారో గమనించాలి. గొడవకు కారణం ఎవరో తెలుసుకోవాలి. ఒక సందర్భంలోనే కాకుండా ఇండివిడ్యువల్ అటెన్షన్ పెట్టి పరిశీలించాలి.
- ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే వాళ్లను వేర్వేరుగా కూర్చోబెట్టాలి. ఒకేరూమ్‌లో కూర్చోబెట్టినప్పుడు గొడవ పడటానికి అవకాశం ఉంటుంది.
- పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల విషయంలో తరచుగా గొడవపడుతుంటారు. ఒకరివి మరొకరు తీసుకోకుండా పేరెంట్స్ గమనించాలి.
- పిల్లలకు ఒకరినొకరు గౌరవించడం నేర్పించాలి. కోపంలో కూడా అగౌరవపరిచేలా తిట్టుకోకూడదని గట్టిగా చెప్పాలి. పిల్లలు కొట్లాడుకునే సమయంలో ఒకరినొకరు తిట్టుకోవడం చూస్తూనే ఉంటాం. అలాంటి మాటలకు ఈ ఇంట్లో చోటు ఉండదు అని చెప్పాలి.
- పిల్లలు కలిసి ఆడుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఆడేటప్పుడు వాళ్లను గమనిస్తుండాలి.
- కొడితే పిల్లలు మారతారనుకోవడం సరైనది కాదు. కొడితే మరింత కోపానికి గురవుతారు. వారి మధ్య గొడవ పెరగడానికి దారి తీస్తుంది.
- పిల్లలకు సెల్ఫ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ గురించి నేర్పించాలి. కోపాన్ని ఎలా హ్యాండిల్ చేయాలో చెప్పాలి. డ్రమ్స్ వాయించడం, పది నుంచి ఒకటి వరకు అంకెలు వెనక్కి కౌంట్ చేయమనడం, సౌండ్ ఎక్కువగా పెట్టి డ్యాన్స్ చేయడం... ఇలాంటి పనుల ద్వారా కోపాన్ని డైవర్ట్ చేసుకొమ్మని చెప్పాలి. ఎంత కోపంగా ఉన్నారో ఒక పేపర్ తీసుకుని షార్ట్ స్టోరీ రాయమనాలి. అంతే



కానీ కొట్టడం, గిల్లడం, కొరకడం చేయకూడదని వివరించాలి.
- ఇతర పిల్లల ఫీలింగ్స్‌పై కామెంట్స్ చేయడం ద్వారా పిల్లల్లో సానభూతి పెంపొందేలా చేయాలి. "బన్నీని చూడు. ఎలా ఏడుస్తున్నాడో.. పాపం కదా!" అని కామెంట్స్ చేయడం ద్వారా పిల్లల్లో సానుభూతి పెరిగేలా చేయాలి.
- రాత్రి డిన్నర్‌ను కుటుంబసభ్యులందరూ కలిసి చేయాలి. ఆ సమయంలో ఆ రోజు ఎవరు ఏం చేశారో తెలుసుకుని అభినందించుకునేలా ప్రోత్సహించాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో మార్పును తీసుకురావచ్చు.
- పిల్లలిద్దరూ గొడవ పడుతున్నా వాళ్లు కిడ్స్ అని తల్లిదండ్రులు గుర్తుపెట్టుకోవాలి. ఏదో ఒక టైంలో ఏ పిల్లవాడైనా తమ సిబ్లింగ్స్ పట్ల కోపంగా వ్యవహరిస్తారు, కొట్లాడతారు. పెద్దవాళ్లు అవుతున్న కొద్దీ వాళ్లలో మార్పు కనిపిస్తుంది.

సండే సెలబ్రిటీ



'గ్యాంగ్స్ ఆఫ్ వాసీపూర్', 'లంచ్ బాక్స్', 'ఎలిఫెంట్ విష్పరర్స్', 'కిల్'... ఇలా భిన్నమైన కథనాలతో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకున్న నిర్మాత **గునీత్ మోంగా కపూర్**. వాటిలో 'ఎలిఫెంట్ విష్పరర్స్'... గత ఏడాది ఆస్కార్ అవార్డును సొంతం చేసుకుంది. తాజాగా ఆమె తీసిన 'గెహరా... గెహరా' వెబ్ సిరీస్ జీ5లో ప్రసారమవుతోంది. ఆస్కార్ తర్వాత మారిన తన జీవితం గురించి, మారుతున్న ప్రేక్షకుల అభిరుచుల గురించి ఆమె 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

ఎంత లోకల్ అయితే అంత గ్లోబల్ అవుతాం

'ఎలిఫెంట్ విష్పరర్స్'కు ఆస్కార్ లభించిన తర్వాత మీ జీవితంలో వచ్చిన మార్పులేమిటి?

జాతీయంగా, అంతర్జాతీయంగా చాలా మంచి పేరు వచ్చింది. ఆస్కార్ లభించిన తొలి నిర్మాణ సంస్థ మాదే కావటం, ఆస్కార్ లభించిన తొలి భారతీయ చిత్రం కావటం- ఇలా అనేక రికార్డులు కూడా నమోదయ్యాయి. ఇవన్నీ ఒక ఎత్తైతే- అనేక అంతర్జాతీయ నిర్మాణ సంస్థలు మాతో భాగస్వాములు కావటానికి ముందుకు వస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థలకు మనం మంచి సినిమాలు తీయగలమనే నమ్మకం కుదిరింది.

ఓటీటీ మన జీవితంలో భాగమయిన తర్వాత సినిమాను చూసే విధానం ఏదైనా మారిందా?

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు కొవిడ్ చాలా మేలు చేసింది. ఆ సమయంలో ఎక్కువ మంది ఇళ్లల్లోనే ఉన్నారు. వారిలో ఎక్కువ శాతం మంది ఏం చేయాలో తెలియక ఓటీటీల్లో చిత్రాలు చూడటం మొదలుపెట్టారు. భారతీయ భాషల్లో వచ్చే సినిమాలు, సిరీస్‌లు, షోలు మాత్రమే కాకుండా... ఇంగ్లీషు, కొరియన్, జపనీస్‌లాంటి భాషల్లో వచ్చిన కంటెంట్‌ను కూడా చూసేశారు. ఓటీటీకి ప్రేక్షకులను ఆకర్షించే శక్తి ఉంది. దీనివల్ల ప్రేక్షకుల్లో మార్పు తప్పనిసరిగా వస్తుంది. కొవిడ్‌వల్ల ఆ మార్పు వేగంగా వచ్చేసింది. అంటే మామూలుగా ఐదేళ్లలో రావాల్సిన మార్పు ఏడాదిలో వచ్చేసింది. దీనివల్ల ప్రేక్షకుల అభిరుచి మారింది.

మంచి కంటెంట్ ఇవ్వాలనే ఒత్తిడి ఫిల్మ్ మేకర్స్‌పై పెరిగిందా?

ఒత్తిడి పెరిగింది. కానీ ఆ ఒత్తిడి ప్రేక్షకుల నుంచి రావటం లేదు. ఫిల్మ్‌మేకర్స్ తమకు తాముగానే అంతర్జాతీయ కంటెంట్‌తో పోటీ పడుతున్నారు. ఏ ఓటీటీ ప్లాట్‌ఫాంనైనా తీసుకోండి. దానిలో మన వాళ్లు తీసిన కంటెంట్ ఉంటుంది. ఇతరులు తీసిన కంటెంట్ కూడా ఉంటుంది. ప్రేక్షకులు ఏ కంటెంట్ బావుంటే దాన్నే చూస్తున్నారు. దీని వల్ల ఫిల్మ్ మేకర్స్ మీద మంచి కంటెంట్ ఇవ్వాలనే ఒత్తిడి పెరిగింది. ఇక్కడొక విషయం చెప్పాలి. చిత్ర నిర్మాణంలో మనం ప్రపంచంలో ఎవరి కన్నా తక్కువ కాదు. మన దగ్గర అద్భుతమైన టాలెంట్ ఉంది. ఈ టాలెంట్ బయటకు రావాల్సిన సమయం ఆసన్నమయింది. ఇక ఛాలెంజ్‌ల విషయానికి వస్తే- సినిమాను కావాలంటే మూడు నెలల్లో తీయవచ్చు. కానీ ఎనిమిది గంటలు ఉండే వెబ్ సిరీస్ తీయాలంటే ఏడాది నుంచి రెండేళ్లు పడుతుంది. ఇదీ మన ముందున్న సవాల్.

సినీ రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మధ్య దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. మీరు ఎప్పుడైనా వివక్ష ఎదుర్కొన్నారా?



ఒక మహిళగా నాకు ఎటువంటి సమస్యలు రాలేదు. కానీ వయస్సు విషయంలో వచ్చింది. నన్ను చాలా మంది చిన్న పిల్లలా చూసేవారు. నేను చిన్న వయస్సులోనే సినీ రంగంలోకి వచ్చాను. 26 ఏళ్ల వయస్సులో 'గ్యాంగ్స్ ఆఫ్ వాసీపూర్' తీశా. 28 ఏళ్లకు 'లంచ్‌బాక్స్' సినిమా తీశాను. అవి తీసింది నేనేనంటే ఎవరూ నమ్మేవారు కాదు. 'మీ టూ' ఉద్యమం వచ్చిన తర్వాత నాకు ఎదురవుతున్న సమస్య ఏమిటో అర్థమయింది. అప్పటిదాకా 'నా వయస్సు చిన్నది కాబట్టి.. నన్ను సీరియస్‌గా తీసుకోవటం లేదు' అని ఎప్పుడూ అనుకోలేదు. నా పని బాగా చేయాలనుకున్నానంతే! 'మీ టూ' ఉద్యమం సమయంలో మహిళ వివక్షతో పాటుగా వయస్సుకు సంబంధించిన వివక్ష కూడా ఉంటుందనే విషయం అర్థమయింది.

> **దక్షిణాది సినిమాలపై మీ అభిప్రాయమేమిటి?**
>
> స్టోరీ టెల్లింగ్‌లో దక్షిణాది ఫిల్మ్ మేకర్స్ తమదైన ముద్ర వేసుకుంటున్నారు. చాలామంది పాన్ ఇండియా కథలకు ఎక్కువ ప్రాధాన్యత ఉందనుకుంటూ ఉంటారు. మనం ఎంత లోకల్ అయితే అంత గ్లోబల్ అవుతాం. దీనికి 'ఎలిఫెంట్ విష్పరర్స్' ప్రత్యక్ష నిదర్శనం. ఇక నా విషయానికి వస్తే... దక్షిణాది నిర్మాతలతో కలిసి పనిచేయటానికి నేను సిద్ధంగా ఉన్నాను. మంచి ప్రపోజల్స్ వస్తే తప్పనిసరిగా కలిసి పనిచేస్తాను.

మీ దృష్టిలో సినీ రంగంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలేమిటి?

అనేక సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వీటిలో టాలెంట్‌ను దెబ్బతీసే ఒక సమస్య కూడా ఉంది. సాధారణంగా సినీ రంగంలో పనిచేసే మహిళలకు... వారు పెళ్లి చేసుకున్న తర్వాత బ్రేక్ వస్తుంది. కొద్ది కాలం తర్వాత మళ్లీ తిరిగి వస్తే- వారికి పని దొరకదు. ఒకప్పుడు అద్భుతమని పొగిడిన వాళ్లు కూడా పని ఇవ్వటానికి ముందుకు రారు. ఈ వివక్ష పురుషులకు ఉండదు. ఎడిటర్స్, రైటర్స్, సినిమాటోగ్రాఫర్స్, డ్యాన్సర్స్- ఇలా నేను ఎంతోమందితో మాట్లాడాను. మిడ్ కెరీర్ ఎంట్రీ అనేది దాదాపు అసాధ్యమనే చెప్పాలి. సోషల్ మీడియాలో చూస్తే వాళ్లకు అన్నీ ఉన్నాయనిపిస్తాయి. కానీ మాట్లాడితే అసలు విషయం తెలుస్తుంది.

మీరు సోషల్ మీడియాను ఫాలో అవుతారా?

అవుతాను. సోషల్ మీడియా కూడా పాప్‌కల్చర్ లాంటిదే! మనకు వెంటనే రెస్పాన్స్ తెలిసిపోతుంది. ఇంతకుముందు మనకు ప్రజల నుంచి స్పందన తెలియాలంటే వెంటనే తెలిసేది కాదు. కానీ ఇప్పుడలా కాదు. నేరుగా ప్రేక్షకుల నుంచే మనకు స్పందన తెలిసిపోతుంది. ఇదొక మంచి కోణం. అంతే కాదు. సోషల్ మీడియా వల్ల ప్రజలకు సాధికారత వచ్చింది. యూట్యూబ్‌లో పెట్టే కొన్ని షార్ట్ ఫిల్మ్స్ చూస్తుంటే ముచ్చటేస్తుంది. 'ఇంత టాలెంట్ మన దగ్గర ఉందా?' అనిపిస్తుంది. అయితే సోషల్ మీడియాలో అపరిమితమైన సమాచారం ఉంటుంది. మనకు అవసరమైనదాన్ని తెలుసుకోవాలంటే ఫిల్టర్స్ తప్పనిసరి. బహుశా ప్రస్తుత తరం వారికి సోషల్ మీడియా అవసరమేమో! ఒకప్పుడు ఫోన్ నెంబర్లు గుర్తు పెట్టుకొనేవారు. ఇప్పుడా అవసరం లేదు. మొబైల్స్ వచ్చేసాయి. సోషల్ మీడియా కూడా అంతే! ఇక నా విషయానికి వస్తే- ఒక ఫిల్మ్ మేకర్‌గా మార్పునకు సిద్ధంగా ఉండాలి. కొత్త కొత్త ఆవిష్కరణలను గౌరవించాలి. వాటిని వాడుకోవటానికి సిద్ధంగా ఉండాలి.

• సివిఎల్ఎన్ ప్రసాద్

చైతన్యం



కాలుష్యం లేని ప్రపంచం... ఇదే ఆ బాలిక నినాదం. పర్యావరణంలో సంభవిస్తున్న మార్పులతో... పొంచివున్న ప్రమాదంపై అవగాహన కల్పిస్తూ... ప్రపంచమంతా పర్యటిస్తోంది. 'మన భూమిని మనమే కాపాడుకొందాం' అంటూ పిలుపునిస్తోంది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన పదో తరగతి విద్యార్థిని గీతిక... తన చైతన్య యాత్ర గురించి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చింది.

పర్యావరణ గీతిక

"ఇప్పుడు ఎక్కడ చూసినా కాలుష్యం. జలం, వాయువు, భూమి... తెలిసీ తెలియక మనం చేస్తున్న పనులవల్ల ప్రకృతి కళ తప్పింది. పర్యావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకొంటున్నాయి. ఇవి మనకు ప్రమాద సంకేతాలు. పొంచివున్న ఈ పెను ముప్పును గ్రహించకపోతే సమస్త జీవజాతి అంతరించిపోతుంది. మనిషి స్వార్థం, అవగాహనా రాహిత్యమే ఇందుకు కారణం. ఇప్పటికైనా మేల్కొనకపోతే భవిష్యత్తు అంధకారం అవుతుంది. ముఖ్యంగా ఇబ్బడిముబ్బడిగా వ్యర్థాలు భూమికి భారమవుతున్నాయి. మన ముందున్న తక్షణ కర్తవ్యం... భూమాతను కాపాడుకోవడం. అదే నా నినాదం... 'మన భూమిని మనమే కాపాడుకొందాం'. ఈ నినాదం ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు దేశదేశాలూ తిరుగుతున్నాను. నేపాల్, మలేషియా, శ్రీలంక తదితర దేశాల్లో పర్యటించాను. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు భారత్ అంతా చుట్టివచ్చాను.

> **ఇదీ పరిస్థితి...**
>
> పర్యావరణ కాలుష్యంవల్ల భవిష్యత్తులో సంభవించే పరిణామాల గురించి తెలుసుకొంటుంటే ఎంతో ఆందోళన కలుగుతుంది. 'నాసా' అంచనా ప్రకారం ఇప్పుడున్న పరిస్థితులు ఇలాగే కొనసాగితే... 2100 నాటికి అడవులన్నవే అంతరించిపోతాయి. 2050 నాటికి సముద్ర జలాల్లో చేపల కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువగా కనిపిస్తాయి. 2070 నాటికి వరల్డ్ కోరల్ రీఫ్‌లు సైతం మాయమైపోతాయి. అభయారణ్యాల్లో ఏటా 50 వేల రకాల జీవులు అంతరించిపోతున్నాయి. ఇలాంటి వాస్తవాలు తెలుసుకున్నప్పుడు కంటి మీద కునుకు ఉండదు. ఈ పరిస్థితి మారితేనే జీవజాతికి మనుగడ.

రీల్స్‌తో మొదలై...

ప్రస్తుతం నేను తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పదో తరగతి చదువుతున్నా. మాది సాధారణ మధ్యతరగతి కుటుంబం. పర్యావరణం వైపు నన్ను నడిపించింది, నాకు ప్రేరణ కల్పించింది యూట్యూబ్ రీల్స్. అప్పుడు నేను ఆరో తరగతి చదువుతున్నా. యూట్యూబ్‌లో ఒక షార్ట్ వీడియో చూశాను. అందులో భూమికి పొంచివున్న ముప్పు గురించి వివరించారు. అది చూసి భయం వేసింది. మరింత సమాచారం కోసం అలాంటి వీడియోలు రోజూ చూడడం మొదలుపెట్టాను. వాటివల్ల నాకు చాలా విషయాలు తెలిశాయి. మనం ఎంత ప్రమాదంలో ఉన్నామో అర్థమైంది. నిజానికి సామాజిక మాధ్యమాలు, స్మార్ట్‌ఫోన్లను సరైన రీతిలో ఉపయోగించుకొంటే అరచేతిలోనే ఎంతో సమాచారం లభిస్తుంది. అలా సామాజిక మాధ్యమాలనే వేదికగా చేసుకొని, జాతీయ, అంతర్జాతీయ పర్యావరణ బృందాలను పరిచయం చేసుకున్నాను. వారితో చర్చల్లో పాల్గొని అవగాహన పెంచుకున్నాను.

ఊరూరా ప్రచారం...

క్రమంగా చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లి, అక్కడి పరిస్థితులు తెలుసుకున్నాను. కొన్నాళ్లకు నేను ఒక వాలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసుకున్నాను. వారితో కలిసి ఇతర పట్టణాలు, పల్లెల్లో పర్యటించడం మొదలుపెట్టాను. అక్కడి పరిసరాలను పరిశీలించి, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వారికి వివరిస్తున్నాను. వెంటనే మేల్కొనకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తూ, చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తున్నాను. గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు సాగు భూములు తగ్గిపోవడం గమనించాను. అది ఎంతో బాధ కలిగించింది. 'ఈ పరిణామం వల్ల భూమికి నష్టం వాటిల్లుతుంది. బీడు పెట్టవద్దు. వ్యవసాయం చేయండి. నేలతల్లి పచ్చగా ఉంటేనే ఊరికీ, ఇంటికీ మంచిది. అలాగే రసాయన ఎరువులు, పురుగు మందులూ వాడడమంటే నేల తల్లి కడుపులో విషయం పోయడమే. ఆ తల్లి ఆరోగ్యంగా ఉండాలంటే సహజ ఎరువులతో సేద్యం చేయాలి' అని చెబుతున్నాను. వాళ్లు కూడా... 'ఇంత చిన్నపిల్ల చెప్పేదేంట'ని అనుకోకుండా... శ్రద్ధగా వింటున్నారు.

> **పెళ్లికి దాచిన సొమ్ముతో...**
>
> 
>
> నాకు ఇద్దరు ఆడ బిడ్డలు. వాళ్ల పెళ్లిళ్ల కోసం దాచిన డబ్బులు... నా పెద్దకూతురు గీతిక పర్యావరణ ప్రచారాలకూ, ప్రయాణాలకూ ఖర్చు పెడుతున్నాను. బంధుమిత్రులు హెచ్చరిస్తూనే ఉంటారు. అయినా ఇంత చిన్న వయసులో అంత పెద్ద ఆలోచనతో గీతిక అడుగు వేస్తూ ఉంటే... కాదనలేకపోతున్నాను. మన తీరులో మార్పు రాకుంటే... ఈ భూమి, మానవాళి ఏమవుతుందో గీతిక వివరిస్తూ ఉంటే ఒళ్లు జలదరిస్తుంది. మన కోసం కాకపోతే మన భవిష్యత్తు తరాల కోసమే కదా ఖర్చుపెట్టేదంతా అనుకుంటాను.
>
> \- వెంకటేశన్, గీతిక తండ్రి

నాలుగు వందలకు పైగా...

పర్యావరణంపై ఇప్పటి వరకు నేను నాలుగు వందలకు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాను. జూమ్‌లో అనేక అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నాను. శ్రీలంకలో భారత డిప్యూటీ హైకమిషనర్‌ను కలిశాను. అలాగే ఐక్యరాజ్య సమితి డిప్యూటీ సెక్రటరీ జనరల్ నా కృషికి ప్రశంసలు అందుకున్నాను. గ్లోబల్ ప్లాంటేషన్ ప్రచారానికి పెరూలో నిర్వహించిన 'ది బ్రీయింగ్ ఆఫ్ ది ప్లానెట్-2021'కి ఆహ్వానం అందింది. కానీ కొవిడ్ కారణంగా వెళ్లలేకపోయాను. నా కార్యక్రమాలన్నిటికీ ఒక వేదిక ఉండాలన్న ఆలోచనతో తొమ్మిదేళ్ల వయసులో 'యాధుమది ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ నెలకొల్పాను. దాని ద్వారా లక్ష మొక్కలు నాటాను.

ప్రశంసలు... పురస్కారాలు...

పర్యావరణ పరిరక్షణ కోసం నేను చేస్తున్న ప్రయత్నానికి గుర్తింపుగా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులు అందుకున్నాను. అచీవర్స్ ఐకాన్ అవార్డు, బెస్ట్ చైల్డ్ ఎన్విరాన్మెంటలిస్ట్-2020 , యంగ్ క్లైమేట్ యాక్టివిస్ట్, గ్లోబల్ కిడ్స్ అచీవర్స్ అవార్డు-2021, ఇండియన్ ఐకాన్ అవార్డు, ఫేమ్ ఐకాన్ అవార్డు, గ్లోబల్ కిడ్స్ అచీవర్స్ అవార్డు, ఇంటర్నేషన్ సోషల్ సర్వీస్ అవార్డు, ఇంటర్నేషనల్ యంగ్ ఎకో-అవార్డులు వాటిలో ఉన్నాయి. 'యూత్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్డీజీ)' ఆన్‌లైన్ సమ్మిట్‌లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించింది. నేను ఇన్ని నగరాలు, దేశాలు తిరగగలుగుతున్నానంటే అందుకు మా నాన్న వెంకటేశన్ ప్రోత్సాహంవల్లే. ఏదిఏమైనా పర్యావరణ పరిరక్షణ అనేది ఒక ఉద్యమంలా నడిపించాలనేది నా లక్ష్యం."

• పి.నరేంద్ర, తిరుపతి

అలనాటి కథ



నాకు తెలిసిన కొత్త నిజాం

రాజులు.. రాజ్యాలు లేకపోయినా- రాజ కుటుంబ వారసత్వం కొనసాగుతూనే ఉంటుంది. లాస్ట్ నిజాంగా పేరుగాంచిన ముఖర్రం ఝా కుమారుడు అజ్మత్ ఝా కూడా ఈ తరహా వారసత్వమే. తండ్రి మరణం తర్వాత తొమ్మిదో నిజాంగా వారసత్వ పదవిని పొందిన- అజ్మత్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సినిమాటోగ్రాఫర్ అని.. గాంధీ సినిమా తీసిన డేవిడ్ అటెన్‌బరోతోను.. ఒకప్పటి జేమ్స్ బాండ్ సీన్ కానరీతోను.. అనేక గొప్ప చిత్రాలు తీసిన స్టీవెన్ స్పీల్‌బర్గ్‌తోను కలిసి పనిచేశాడని అతి కొద్ది మందికి మాత్రమే తెలుసు!

అజ్మత్ నాకు చిన్ననాటి నుంచి తెలుసు. ప్రిన్సెస్ ఎస్రాతో నాకున్న స్నేహం వల్ల చిన్నప్పటి నుంచి నాకు తనంటే ప్రత్యేకమైన అభిమానమనే చెప్పాలి. ఒక రాజ కుటుంబం నుంచి వచ్చినా- ఆ వాసనలేమి కనబడని వ్యక్తి అజ్మత్. తన గురించి తలుచుకున్నప్పుడు అనేక జ్ఞాపకాలు నాకు గుర్తుకొస్తాయి. చౌమల్లా ప్యాలెస్‌కు పునర్వైభవాన్ని తీసుకురావటం కోసం మరమ్మత్తులు చేయిస్తున్న సమయంలో ప్రిన్సెస్ ఎస్రా ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఉండేవారు. ఒక రోజు ప్రిన్సెస్



ఎస్రాను కలవటానికి హోటల్‌కు వెళ్లాను. అక్కడ అజ్మత్ కనిపించాడు. తన పుట్టిన రోజు వచ్చేస్తోందని గుర్తుకొచ్చింది. "పుట్టిన రోజు బహుమతిగా ఏం కావాలి?" అని అడిగాను. వెంటనే తడుముకోకుండా "బాల్ పెన్" అన్నాడు. నాకు ఆశ్చర్యమేసింది. "బాల్‌పెన్ చాలా?" అడిగా. "నాకు బాల్‌పెన్ చాలు" అన్నాడు. ఆ తర్వాత బ్రేక్‌ఫాస్ట్ చేశాం. నేను లైబ్రరీకి వెళ్లాలని లేచాడు. "నువ్వు ఎలాంటి పుస్తకాలు చదువుతావు?" అని అడిగాను. "చరిత్ర గురించి.." అన్నాడు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే- సాధారణంగా ఈ తరం పిల్లలకు చరిత్ర పట్ల పెద్ద ఆసక్తి ఉండదు. ఫోటోగ్రఫిలాంటి కళల పట్ల అభిరుచి ఉన్నవారు కూడా అరుదుగా కనిపిస్తారు. అలాంటి వ్యక్తుల్లో అజ్మత్ ఒకడు. అమెరికాలోని లాంగ్ ఐలాండ్‌లో సినిమాటోగ్రఫి కోర్స్ చేశాడు. ఆ సమయంలోనే తనకు టర్కీకి చెందిన ప్రిన్సెస్ నాజ్ పరిచయమయింది. వారిద్దరు పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లి వార్త తెలిసిన తర్వాత - ప్రిన్సెస్ ఎస్రాను - "పెళ్లికి ఏం బహుమతి ఇచ్చావు?" అని అడిగాను. "ఎమరాల్డ్ సెట్.. రూబీలు.. ముత్యాలు.. వజ్రాలు" అని సమాధానమిచ్చింది. బహుశా అవన్నీ చాలా అరుదైనవే అయిఉండాలి.

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. సాధారణంగా రాజకుటుంబాల వారసులు వ్యాపారాలలోకి ప్రవేశిస్తారు. కొందరు రాజకీయ నాయకులు అవుతారు. ఈ రెండింటి ద్వారా తమ వారసత్వాన్ని కొనసాగించటానికి ప్రయత్నిస్తారు. సామాన్య మధ్యతరగతి ప్రొఫెషనల్స్ మాదిరిగా ఒకో మెట్టు ఎక్కి.. పైకి ఎదిగేవారు అతి తక్కువ మంది. అలాంటి వాళ్లలో అజ్మత్ ఒకడని కచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే అజ్మత్ తాను చదువుకున్న సమయంలో ఒక వీక్లీ న్యూస్‌పేపర్‌లో ఫోటోగ్రాఫర్‌గా పనిచేసేవాడు. ఫోటో గ్యాలరీలలో షోలు పెట్టేవాడు. ఆ సమయంలోనే తనకు ఫోటోగ్రఫి అంటే చాలా ఇష్టముందనే విషయాన్ని గ్రహించాడు. దానినే ఒక వృత్తిగా ఎంచుకున్నాడు. వృత్తిగా ఎంచుకోవటమే కాదు దానిలో అత్యున్నత స్థానానికి చేరుకోవటానికి ప్రయతిస్తున్నాడు.



ప్రిన్సెస్ ఎస్రా, ఆవిడ కుటుంబ సభ్యులు హైదరాబాద్ వచ్చినప్పుడు జ్ఞాన్‌బాగ్‌కు వస్తూ ఉంటారు. నేను కూడా వాళ్లు ఉండే ఫలక్‌నామా ప్యాలెస్‌కు వెళ్తూ ఉంటా. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఫలక్‌నామా ప్యాలెస్‌ను తాజ్ గ్రూపుకు లీజ్‌కు ఇచ్చిన తర్వాత- ప్రిన్సెస్ ఎస్రా ఆ ఆవరణలోనే ఒక చిన్న అందమైన భవంతిని కట్టుకుంది. నిజాం వారసత్వ వైభవమంతా ఆ భవంతిలో మనం చూడవచ్చు. ప్రిన్సెస్ ఎస్రా కుటుంబ సభ్యులు ఎప్పుడూ హైదరాబాద్‌కు వచ్చినా అక్కడే నివసిస్తూ ఉంటారు. అజ్మత్ కూడా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు అక్కడే నివసిస్తాడు. నిజాం కుటుంబం సంప్రదాయాలను, ఆచారాలను కొనసాగిస్తూ ఉంటాడు. ఈ ఆధునిక కాలంలో గత కాలపు నిజాం వారసత్వాన్ని కొనసాగించటం అంత సులభం కాదు. అజ్మత్ ఆ విషయంలో విజయం సాధించాడనే చెప్పాలి.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్


పంత్, గిల్ శతక మోత

విజయం లాంఛనమేనా?

భారత్ రెండో ఇన్నింగ్స్ 287/4 డిక్లేర్డ్ ● బంగ్లా లక్ష్యం 515
ప్రస్తుతం 158/4 ● అశ్విన్‌కు 3 వికెట్లు ● తొలి టెస్ట్



రిషభ్ పంత్ (128 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సర్లతో 109)



శుభ్‌మన్ గిల్ (176 బంతుల్లో 119 నాటౌట్)

చెన్నై: యువ ఆటగాళ్లు రిషభ్ పంత్ (128 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 109), శుభ్‌మన్ గిల్ (176 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 119 నాటౌట్) శతకాలతోపాటు అశ్విన్ (3/63) స్పిన్ మాయాజాలంతో.. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో టీమిండియా పట్టు బిగించింది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 81/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 287/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 227 రన్స్‌తో కలిపి ప్రత్యర్థి బంగ్లా ముందు 515 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. స్పిన్నర్ మెహిదీహసన్ మిరాజ్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా శనివారం ఆట ముగిసేసరికి 158/4 స్కోరు చేసింది. కెప్టెన్ నజ్ముల్ షంటో (51 బ్యాటింగ్), షకీబల్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అశ్విన్ 3 వికెట్లు తీశాడు. మరో రెండు రోజుల ఆట మిగిలుండగా.. లక్ష్యానికి బంగ్లా 357 పరుగుల దూరంలో ఉంది. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 376 పరుగులు చేయగా.. బంగ్లా 149 రన్స్‌కే ఆలౌటైంది.

రిషభ్ బాదుడు..: మూడో రోజు ఆటలో పంత్ సెంచరీనే హైలైట్‌గా చెప్పుకోవాలి. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చావు అంచుల వరకు వెళ్లొచ్చిన రిషభ్.. రీఎంట్రీ తర్వాత ఆడిన తొలి టెస్టులోనే వంద బాదడం విశేషం. మరోవైపు పేలవ షాట్లతో విమర్శలు ఎదుర్కొంటున్న గిల్ కెరీర్‌లో ఐదో శతకంతో ఊపిరిపీల్చుకొన్నాడు. తొలి సెషన్‌లో ఓవర్‌నైట్ బ్యాటర్లు గిల్, పంత్ ఆచితూచి ఆడినా.. వీలు చిక్కినప్పుడల్లా భారీ షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. పంత్ రెండు ఫోర్లతో జోరు చూపగా.. 30వ ఓవర్‌లో మిరాజ్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో గిల్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. ఆ తర్వాత బంగ్లా బౌలర్లు కొంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత బ్యాటర్లు సింగిల్స్ తీస్తూ స్ట్రయిక్ రొటేట్ చేశారు. అయితే, మిరాజ్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన రిషభ్.. సింగిల్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. ఇక్కడి నుంచి అతడి ఆట టాప్‌గేర్‌లో సాగింది. 72 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద షంటో క్యాచ్‌ను చేజార్చడంతో బతికి పోయిన పంత్.. షకీబల్ బౌలింగ్‌లో మరో రెండో బౌండ్రీలతో చెలరేగాడు. దీంతో లంచ్ సమయానికి భారత్ 205/3తో నిలిచింది. తిరిగి వచ్చిన తర్వాత రిషభ్ తన ట్రేడ్‌మార్క్ ఫ్లిక్ షాట్లతో వేగంగా ఆడుతూ 100 పరుగులు పూర్తి చేసుకొన్నాడు. కానీ, మెహిదీహసన్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టిన పంత్.. అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. దీంతో నాలుగో వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రాహుల్ (22 నాటౌట్) సహకారంతో గిల్ బ్యాట్‌ను ఝుళిపించాడు. షకీబల్ బౌలింగ్‌లో రెండు బౌండ్రీలు బాదిన గిల్.. మరో సింగిల్‌తో సెంచరీ మార్క్ చేరుకొన్నాడు. దీంతో టీ సెషన్‌కు ముందు భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

దెబ్బకొట్టిన అశ్విన్..: భారీ లక్ష్యం కోసం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా ఆరంభంలో ధాటిగా ఆడినా.. అశ్విన్ దెబ్బకు కీలక టాపార్డర్ వికెట్లు చేజార్చుకొంది. టీమిండియా ఫీల్డర్లు కూడా చక్కని క్యాచ్‌లు అందుకోవడంతో బంగ్లా డీలాపడింది. ఓపెనర్లు జకీర్ హసన్ (33), షాద్‌మన్ ఇస్లాం (35) ఛేదనను దూకుడుగానే ఆరంభించారు. ముఖ్యంగా జకీర్ వన్డే తరహా షాట్లతో భారత బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. బుమ్రా వేసిన తొలి ఓవర్‌లో రెండు బౌండ్రీలు బాదిన జకీర్.. తర్వాత సిరాజ్ బౌలింగ్‌లో 6,4,4తో చెలరేగాడు. దీంతో రెండో సెషన్ ముగిసే సమయానికి బంగ్లా వికెట్ కోల్పోకుండా 56 పరుగులు చేసింది. తిరిగి వచ్చిన తర్వాత జకీర్‌ను అవుట్ చేసిన బుమ్రా జట్టుకు కావాల్సిన బ్రేక్ అందించాడు. గల్లీలో జైస్వాల్ అద్భుత క్యాచ్‌తో జకీర్ పెవిలియన్ చేరడంతో.. తొలి వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన షంటో దూకుడైన బ్యాటింగ్‌తో ఫిఫ్టీ పూర్తి చేసినా.. మరో ఎండ్‌లోని బ్యాటర్లు ఇస్లాం, మోమినుల్ హక్ (13), ముష్ఫికర్ రహీమ్ (13)లను అశ్విన్ వెనక్కి పంపాడు. అయితే, వెలుతురు లేమి కారణంగా చివరి సెషన్‌లో 9.4 ఓవర్లు మిగిలుండగానే మ్యాచ్‌ను నిలిపేయాల్సి వచ్చింది.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 376;
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 149;

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) లిట్టన్ (బి) నహీద్ 10, రోహిత్ (సి) జకీర్ (బి) టస్కిన్ 5, గిల్ (నాటౌట్) 119, విరాట్ (ఎల్బీ) మెహిదీ హసన్ 17, పంత్ (సి అండ్ బి) మెహిదీహసన్ 109, రాహుల్ (నాటౌట్) 22, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 64 ఓవర్లలో 287/4 డిక్లేర్డ్. వికెట్ల పతనం:** 1-15, 2-28, 3-67, 4-234; **బౌలింగ్:** టస్కిన్ 7-1-22-1; హసన్ 11-1-43-0; నహీద్ 6-0-21-1; షకీబ్ 13-0-79-0; మెహిదీహసన్ 25-3-103-2, మోమినుల్ హక్ 2-0-15-0.

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: జకీర్ హసన్ (సి) జైస్వాల్ (బి) బుమ్రా 33, షాద్‌మన్ ఇస్లాం (సి) గిల్ (బి) అశ్విన్ 35, నజ్ముల్ షంటో (బ్యాటింగ్) 51, మోమినుల్ (బి) అశ్విన్ 13, ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 13, షకీబల్ (బ్యాటింగ్) 5; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 37.2 ఓవర్లలో 158/4; వికెట్ల పతనం:** 1-62, 2-86, 3-124, 4-146; **బౌలింగ్:** బుమ్రా 7-2-18-1, సిరాజ్ 3.2-1-20-0, ఆకాశ్ దీప్ 6-0-20-0, అశ్విన్ 15-0-63-3, జడేజా 6-0-29-0.

6 టెస్టుల్లో అత్యధికంగా ఆరు శతకాలు బాదిన భారత వికెట్ కీపర్‌గా ధోనీ రికార్డును పంత్ సమం చేశాడు. ధోనీ 90 టెస్టుల్లో ఈ మైలురాయిని అందుకుంటే.. పంత్ 34 మ్యాచుల్లోనే ఈ ఘనత సాధించడం విశేషం.

అక్కడ ఫీల్డర్‌ను పెట్టు...



తను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు మధ్య ఓవర్లలో పంత్ సరదాగా ఫీల్డింగ్ సెట్ చేశాడు. మిడ్ వికెట్‌లో ఫీల్డర్‌ను పెట్టమని పంత్ చెప్పడం స్టంప్ మైక్‌లో వినిపించింది. ఆ సలహాను పాటించిన బంగ్లా కెప్టెన్ షంటో.. పంత్ చెప్పిన చోట ఫీల్డర్‌ను మోహరించాడు.

షకీబల్.. 'పెద్దోడి' రికార్డు

టెస్ట్ క్రికెట్ ఆడిన పెద్ద వయసు బంగ్లా ప్లేయర్‌గా షకీబల్ హసన్ (37 ఏళ్ల 181 రోజులు) రికార్డు లకెక్కాడు. ఈ క్రమంలో స్పిన్నర్ మొహమ్మద్ రఫీక్ (37 ఏళ్ల 180 రోజుల)ను షకీబల్ అధిగమించాడు. కాగా, ఓవరాల్ టెస్ట్ చరిత్రలో పెద్ద వయసు ప్లేయర్ రికార్డు ఇంగ్లండ్‌కు చెందిన విల్‌ఫ్రెడ్ రోడ్స్ (52 ఏళ్ల 165 రోజులు) పేరిట ఉంది.

దుస్తులు ఆరబెట్టిన అశ్విన్..



రెండో రోజు శతకంతో అదరగొట్టిన అశ్విన్.. స్టంప్స్ తర్వాత తన దుస్తులను గ్రౌండ్‌లో ఆరబెట్టుకోనేందుకు వచ్చాడు. తడిచిన వాటిని అతడు మైదానంలో ఆరవేసిన వీడియో నెట్‌లో చక్కర్లు కొడుతోంది. మ్యాచ్ ముగిసినా ఇంకా అక్కడే ఉన్న కొందరు ఫ్యాన్స్.. ఆ సమయంలో అశ్విన్‌ను చూసి బిగ్గరగా కేకలేశారు. ఓ అభిమాని మాత్రం అశ్విన్‌ను ఓపెనర్‌గా రావాలని కోరాడు.



శనివారం ఆట ప్రారంభానికి ముందు పంత్ ఇలా..

స్వర్ణం లాంఛనమే

పదో రౌండ్లోనూ భారత పురుషుల జట్టు జయభేరి
అమ్మాయిలదీ అదే జోరు

- నేడు ఆఖరి రౌండ్
- చెస్ ఒలింపియాడ్



బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్టుకు స్వర్ణం దాదాపు ఖాయమైంది. శనివారం జరిగిన 10వ రౌండ్‌లో బలమైన అమెరికాను మన పురుషుల జట్టు 2.5-1.5తో చిత్తు చేసింది. అలాగే ఈ రౌండ్‌లో మహిళల జట్టు కూడా గట్టి ప్రత్యర్థి చైనాను 2.5-1.5తో మట్టి కరిపించింది. పురుషుల జట్టు 19 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. చైనా 17 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగే ఆఖరి రౌండ్‌ను మనోళ్లు కనీసం డ్రా చేసుకున్నా పసిడి పతకం ఖాయమవుతుంది. ఒకవేళ ఆఖరి రౌండ్‌లో మనం ఓడి, చైనా గెలిస్తే..స్కోరు 19-19తో సమమవుతుంది. దాంతో టై బ్రేకర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఇక..మహిళల విభాగంలో భారత్ 17 పాయింట్లతో టాప్‌లో ఉంది. కజకిస్థాన్ కూడా 17 పాయింట్లతో రెండో స్థానంలో (టైబ్రేకర్ స్కోరు) కొనసాగుతోంది. ఈనేపథ్యంలో మహిళల విభాగం ఆఖరి గేమ్ రసవత్తరంగా మారింది. అమెరికాతో పోరులో..ప్రజ్ఞానంద-వెస్లీ సో చేతిలో ఓడడంతో జట్టు 0-1తో వెనుకంజలో నిలిచింది. కానీ కరువానాపై వెనుకంజలో నిలిచిన గుకేష్ అద్భుత ఆటతో అనూహ్య విజయం సాధించాడు. ఫలితంగా స్కోరు 1-1తో సమమైంది. విదిత్-అరోనియన్ మధ్య గేమ్ డ్రా కావడంతో రెండు జట్లు 1.5-1.5తో నిలిచాయి. కానీ డొమింగెజ్‌తో ఆఖరి గేమ్‌లో మొదటి నుంచీ ఆధిక్యంలో నిలిచిన అర్జున్ అలవోకగా గెలుపొంది భారత్‌కు విజయాన్నందించాడు. మహిళల విభాగంలో..హారిక-ఝు జినెర్, వంతిక-లు మియో యి గేమ్‌లు డ్రాగా ముగిశాయి. స్కోరు 1-1తో సమంకాగా..దివ్య దేశ్‌ముఖ్- నీ షిక్వన్‌ను ఓడించడంతో మనకు 2-1 ఆధిక్యం లభించింది. అయితే కీలకమైన ఆఖరి గేమ్‌లో వైశాలీ-గో క్వీని నిలువరించడంతో జట్టు విజయ తీరాలకు చేరింది.

పట్టుబిగించిన ఇండియా 'ఏ'

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): రియాన్ పరాగ్ (73), శాశ్వత్ రావత్ (53) అర్ధ శతకాలతో మెరవడంతో ఇండియా 'సి'తో ఇక్కడ జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'ఎ' పట్టు బిగించింది. ఆ జట్టు శనివారం ఆట ఆఖరికి రెండో ఇన్నింగ్స్‌లో 270/6 స్కోరు చేసింది. దాంతో ఓవరాల్‌గా 333 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంతకుముందు ఇండియా 'సి' 234 పరుగులకు ఆలౌటైంది. ఆకిబ్ ఖాన్ (3/43), అవేశ్ ఖాన్ (3/64) చెరో మూడు వికెట్లు తీశారు. ఇండియా 'ఎ' మొదటి ఇన్నింగ్స్‌లో 297 పరుగులు చేసింది.

సెంచరీ దిశగా భుయ్: రికీ భుయ్ (90) రెండో సెంచరీ ముంగిట నిలవగా..ఇండియా 'బి'తో జరుగుతున్న మరో మ్యాచ్‌లో ఇండియా 'డి' తన ఆధిక్యాన్ని 311 పరుగులకు పెంచుకుంది. శ్రేయాస్ (50), సంజూ శాంసన్ (45) సత్తా చాటడంతో మూడోరోజు ఆఖరికి ఇండియా 'డి' రెండో ఇన్నింగ్స్‌లో 244/5 స్కోరు చేసింది. ఓవర్‌నైట్ 210/6 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'బి' 282 పరుగులకు ఆలౌటైంది. ఇండియా 'డి' తొలి ఇన్నింగ్స్‌లో 349 పరుగులు చేసింది.

అఫ్ఘానిస్థాన్ తొలిసారి

సౌతాఫ్రికాపై వన్డే సిరీస్ గెలుపు

చెలరేగిన రషీద్, గుర్బాజ్

షార్జా: మొదటి వన్డేతో సౌతాఫ్రికాపై అంతర్జాతీయ స్థాయిలో తొలి విజయం అందుకున్న అఫ్ఘానిస్థాన్..అదే ఊపులో సఫారీలకు మరో షాకిచ్చింది. శుక్రవారం రాత్రి జరిగిన రెండో వన్డేలో ఏకంగా 177 పరుగులతో ప్రత్యర్థిని చిత్తు చేసిన అఫ్ఘానిస్థాన్ ఆ జట్టుపై మొదటిసారి వన్డే సిరీస్ అందుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో వన్డే మిగులుండగానే కైవసం చేసుకుంది. తొలుత అఫ్ఘానిస్థాన్ 50 ఓవర్లలో 311/4 భారీ స్కోరుతో సవాలు విసిరింది. రహ్మనుల్లా (105) సెంచరీతో చెలరేగగా.. అజ్మతుల్లా (86 నాటౌట్), రహమత్ షా (50) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. అనంతరం రషీద్‌ఖాన్ (5/19) ధాటికి సఫారీలు 34.2 ఓవర్లలో 134 పరుగులకే చేతులెత్తేశారు. మరో స్పిన్నర్ ఖరోటే (4/26) నాలుగు వికెట్లతో తిప్పేశాడు.

బిజినెస్

నాలుగేళ్లలో 2.95 లక్షల నియామకాలు

కొవిడ్ తర్వాత టాప్ 10 ప్రైవేట్ బ్యాంకుల్లో భారీగా హైరింగ్

బెంగళూరు: గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో (2021-24)లో దేశంలోని టాప్-10 ప్రైవేట్ బ్యాంక్‌లు నికరంగా 2.95 లక్షల నియామకాలు జరిపాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో నికరంగా 1,06,753 మందిని ఉద్యోగంలో చేర్చుకున్నాయి. 2022-23లో జరిపిన 94,046 మంది హైరింగ్‌తో పోలిస్తే 13 శాతం అధికమిది. కొవిడ్ సంక్షోభం తర్వాత బ్యాంకింగ్ సేవలకు డిమాండ్ మరింత పెరిగింది. దాంతో ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల వలసలూ పెరిగాయి. తత్ఫలితంగా బ్యాంక్‌లు పెద్ద సంఖ్యలో నియామకాలను జరిపాయని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. వలసపోయిన ఉద్యోగుల స్థానాల భర్తీతో కలిపితే మొత్తం హైరింగ్ సంఖ్య మరింత అధికంగా ఉంటుందన్నారు.

గత నాలుగేళ్లలో ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు సగటు 12 శాతంగా ఉండవచ్చని అంచనా. వలసపోయిన వారి స్థానాలను భర్తీ చేసేందుకు బ్యాంక్‌లు 2.80 లక్షల రీప్లేస్‌మెంట్ హైరింగ్ జరిపి ఉండవచ్చని, వీటితో కలిపి మొత్తం నియామకాలు 5.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి టాప్ టెన్ ప్రైవేట్ బ్యాంక్‌ల్లో 7,95,414 మంది పనిచేస్తున్నారు. 20219-20 చివరి నాటికి నమోదైన 5,00,149 మందితో పోలిస్తే ఉద్యోగుల సంఖ్య నాలుగేళ్లలో 59 శాతం పెరిగింది.

యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఏఏఏ ఎన్‌బీఎఫ్‌సీ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఏఏఏ ఎన్‌బీఎఫ్‌సీ ఇండెక్స్ - జూన్ 2027 ఫండ్ తీసుకు వచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్. ఈ ఫండ్ మెచ్యూరిటీ తేదీ 2027 జూన్ 30. ఫిక్స్‌డ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఈ ఫండ్ 95 శాతం నుంచి 100 శాతం పెట్టుబడులు పెట్టనుంది. లిక్విడిటీ కోసం డెట్, మనీ మార్కెట్లలో కూడా ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 23.

గోల్డ్ లోన్.. జిగేల్!

- ఏడాది కాలంలో రెండంకెల వృద్ధి
- తనఖా రహిత వ్యక్తిగత రుణాలపై ఆర్‌బీఐ ఆంక్షల నేపథ్యమే కారణం..



తనఖా రహిత వ్యక్తిగత రుణ నిబంధనలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కఠినతరం చేసిన నేపథ్యంలో బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లు తాకట్టుపై ఇచ్చే బంగారం రుణాలపై దృష్టి సారించాయి. ఇందుకు తోడు, గడిచిన ఏడాది కాలంలో పసిడి ధర దాదాపు 25% పెరగడం, రుణదాతలు డిజిటల్ రుణ సౌకర్యాలను అందుబాటులోకి తేవడంతో గోల్డ్ లోన్ వ్యాపారం జోరందుకుంది. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం.. ఎన్‌బీఎఫ్‌సీల బంగారం రుణ వ్యాపారం గడిచిన ఏడాది కాలంలో 20-30% పుంజుకుంది. ప్రస్తుతం ఈ వ్యాపారంలో ఎన్‌బీఎఫ్‌సీలదే పైచేయి అయినప్పటికీ, బ్యాంక్‌ల పసిడి రుణాలు గణనీయంగా పెరిగాయి. ఈ ఏడాది జూన్ నాటికి బ్యాంక్‌లిచ్చిన పసిడి రుణాల విలువ వార్షిక ప్రాతిపదికన 30% పెరిగి రూ.1,23,776 కోట్లకు చేరుకుంది. కాగా, తనఖా రహిత వ్యక్తిగత రుణాల వృద్ధి మందగించింది. ఈ జూన్‌లో ఈ విభాగ రుణాల వృద్ధి 15 శాతానికి పరిమితమైంది. 2023 జూన్‌లో నమోదైన 30% వృద్ధితో పోలిస్తే సగానికి తగ్గింది.

జూన్ నాటికి బ్యాంక్‌ల్లో పసిడి రుణాల మొత్తం

ఏడాది	రుణాలు (రూ.కోట్లు)	వృద్ధి(%)
2019	27,102	--
2020	34,267	26.4
2021	62,221	81.6
2022	79,517	27.8
2023	94,872	19.3
2024	1,23,776	30.5


- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో పసిడి రుణ బకాయిలు వృద్ధి వేగంగా పెరిగింది. ఈ మే నెలలో 15 శాతం వృద్ధి నమోదైంది.
- ఎన్‌బీఎఫ్‌సీల విషయానికొస్తే, ఈ జూన్‌లో అతిపెద్ద గోల్డ్ లోన్ కంపెనీ ముత్తూట్ ఫైనాన్స్ నిర్వహణలోని పసిడి రుణ ఆస్తులు (ఏయూఎం) వార్షిక ప్రాతిపదికన 23 శాతం వృద్ధితో రూ.80,992 కోట్లకు చేరుకుంది. ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో అత్యధిక పసిడి రుణాల వితరణ జరిపినట్లు కంపెనీ వెల్లడించింది.
- ఈ జూన్‌లో మణప్పురం ఫైనాన్స్ గోల్డ్ లోన్ ఏయూఎం వార్షిక ప్రాతిపదికన 15 శాతం వృద్ధితో రూ.23,647 కోట్లుగా, శ్రీరామ్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ఏయూఎం 23 శాతం వృద్ధితో రూ.6,123 కోట్లుగా నమోదైంది.
- కరోనా సంక్షోభ సమయంలో పసిడి రుణాలకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. 2021 జూన్ నాటికి బ్యాంక్‌ల పసిడి రుణ బకాయిలు వార్షిక ప్రాతిపదికన 82 శాతం పెరిగాయి. ఆ తర్వాత రెండు సంవత్సరాల్లో క్రమంగా తగ్గుతూ వచ్చిన వృద్ధి మళ్లీ ఏడాదిలో పుంజుకుంది.
- ఈ ఏడాది జూన్ నాటికి మొత్తం వ్యక్తిగత రుణాల్లో బంగారం రుణాల వాటా 20 నెలల గరిష్ఠ స్థాయి 2.3 శాతానికి పెరిగిందని ఆర్‌బీఐ వెల్లడించింది.
- పసిడి రుణాల విభాగంలో ఆస్తుల నాణ్యత మాత్రం క్షీణిస్తోందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా పేర్కొంది. గడువు దాటి 90 రోజులకు పైబడినా చెల్లించని బకాయిల వాటా ఈ మార్చిలో 2.9 శాతంగా నమోదుకాగా.. జూన్‌లో 3.1 శాతానికి పెరిగింది.
- వ్యక్తిగత, వ్యాపార అత్యయిక, స్వల్పకాలిక అవసరాల్లో తక్షణమే పొందగలిగేది పసిడి రుణం. తనఖారహిత రుణాల మంజూరు కఠినతరం కావడంతో రుణగ్రహీతలు కూడా పసిడి రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఏఎం కార్తీక్ అన్నారు.

జోయాలుక్కాస్ చెయిన్ ఫెస్ట్ ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. తమ ప్రత్యేకమైన 'చెయిన్ ఫెస్ట్' ఆఫర్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా వినియోగదారులకు విస్తృత శ్రేణి చెయిన్స్‌పై 4.99 శాతం మజూరీ చార్జీల (వీ.ఏ)ను ఆఫర్ చేస్తోంది. సెప్టెంబరు 20న ప్రారంభమైన ఈ ఆఫర్ అక్టోబరు 6 వరకు అందుబాటులో ఉంటుందని జోయాలుక్కాస్ తెలిపింది. కస్టమర్లకు విలక్షణమైన చెయిన్స్ కలెక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జోయాలుక్కాస్ చెయిన్ ఫెస్ట్ ఆఫర్‌ను రూపొందించినట్లు జాయ్ అలుక్కాస్ చైర్మన్, ఎండీ జోయాలుక్కాస్ వెల్లడించారు. నాణ్యతలో రాజీ లేకుండా ఎల్లప్పుడు అత్యుత్తమైన విలువను వినియోగదారులకు అందించే విధంగా మజూరీ చార్జీలను ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు.

ఎల్ఐసీ ఎంఎఫ్.. మాన్యుఫ్యాక్చరింగ్ ఫండ్

ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ సంస్థ మాన్యుఫాక్చరింగ్ ఫండ్ పేరిట ఒక కొత్త ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) అక్టోబరు 4వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. అక్టోబరు 11వ తేదీన ఇన్వెస్టర్లకు యూనిట్లను కేటాయిస్తారు. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్ (టోటల్ రిటర్న్ ఇండెక్స్) బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. మాన్యుఫాక్చరింగ్ థీమ్‌కు అనుగుణంగా ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, రసాయనాలు, హెవీ ఇంజనీరింగ్ వస్తువులు, మెటల్స్, నౌకా నిర్మాణం, పెట్రోలియం ఉత్పత్తులు వంటి విభిన్న రంగాల కంపెనీల షేర్లతో కూడిన వైవిధ్యభరితమైన పోర్ట్‌ఫోలియోను అందించడం ఈ ఫండ్ లక్ష్యం. సిప్ విధానంలో కనీస పెట్టుబడి రూ.300. నెలవారీ ప్రాతిపదికన కనీస పెట్టుబడి రూ.1,000. ఏకమొత్తంగా ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు రూ.5,000 కనీస పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,930 ▲	69,600 ▲	98,000 ▲
ముంబై	74,093 ▲	67,869 ▲	88,917 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22న తేదీ



హైదరాబాద్	520
వరంగల్	522
చిత్తూరు	553
విజయవాడ	555
గోదావరి	550
విశాఖపట్నం	555

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115
వరంగల్	115
కరీంనగర్	115
మహబూబ్‌నగర్	115
కర్నూలు	115
విశాఖపట్నం	103
గోదావరి	113
విజయవాడ	113
గుంటూరు	116
ఒంగోలు	116
చిత్తూరు	110
నెల్లూరు	110
అనంతపురం	110

వ్యాపార అవసరాల కోసం కార్లు కొనుగోలు చేస్తుంటే..

ఇదీ GST



రాంబాబు గొండాల

చాలా మంది వ్యక్తిగత అవసరాల కోసం లేదా వ్యాపార అవసరాల నిమిత్తం కార్లను కొనుగోలు చేయటం సాధారణ విషయం. కార్లకు సంబంధించి జీఎస్‌టీ 28 శాతం కాగా దీనికి సెస్ అదనం. ఈ సెస్ అనేది కారు టైప్‌ను బట్టి 0 నుంచి 22 శాతంగా ఉంది. అంటే, కారు కొనుగోలు సమయంలో చెల్లించే పన్ను, సెస్‌తో కలిపి 28 శాతం నుంచి 50 శాతంగా ఉంటుంది. అయితే చాలా మంది ఆలోచన ఏమిటంటే వ్యాపార అవసరాల కోసం కొనుగోలు చేసే వస్తు,సేవల మీద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకోవచ్చు. కాబట్టి వ్యాపార నిమిత్తం కారును కొనుగోలు చేసినట్లయితే, కొనుగోలు చేసే సమయంలో చెల్లించిన పన్ను మొత్తాన్ని ఐటీసీ కింద పొందవచ్చని కొంత మంది భావిస్తుంటారు. అయితే ఈ విధంగా కార్లకు సంబంధించిన ఐటీసీ తీసుకోవచ్చా? ఈ వివరాలు మీకోసం..

సాధారణంగా వ్యాపార అవసరాల కోసం కొనుగోలు చేసే వస్తు,సేవల మీద ఐటీసీ సదుపాయం ఉన్నప్పటికీ ఇది అన్ని కొనుగోళ్లకు వర్తించదు. కార్లు, జీప్‌లు ఇలాంటి ప్యాసింజర్ వాహనాలు కూడా ఈ కోవలోకి వస్తాయి. అంటే, ఈ వాహనాల కొనుగోలు సమయంలో చెల్లించిన ట్యాక్స్‌ను ఐటీసీ రూపంలో పొందలేరు. క్లుప్తంగా చెప్పాలంటే ఆయా వాహనాలను వ్యాపార నిమిత్తం వాడినప్పటికీ, ఐటీసీకి అర్హత లేదు. ఇది ముఖ్య నిబంధన అయినప్పటికీ మూడు రకాల సందర్భాల్లో మాత్రం ఇలా వాహనాలకు సంబంధించి కూడా ఐటీసీ పొందే సదుపాయం కల్పించారు.

మొదటిది ఆయా వాహనాలను తిరిగి అమ్మకం కోసం కొనుగోలు చేస్తుంటే.. కార్ డీలర్స్ ఈ కోవలోకి వస్తారు. అంటే కార్లు లేదా జీప్‌లను అమ్మే డీలర్లు లేదా సబ్ డీలర్లు ఆయా వాహనాల మీద ఐటీసీ పొందవచ్చు. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే అమ్మకానికి ఉద్దేశించి కొనుగోలు చేసిన వాహనాల మీద మాత్రమే ఐటీసీ తీసుకోవచ్చు. అలాకాకుండా, ఇతర వ్యాపార పనుల నిమిత్తం సదరు డీలర్ ఏదేనీ వాహనం కొనుగోలు చేస్తుంటే మాత్రం అట్టి వాహనం మీద ఐటీసీ పొందలేరు.

ఇక రెండో సందర్భం.. వాహనాలను ప్యాసింజర్ రవాణా కోసం ఉపయోగించటం. అంటే క్యాబ్ సర్వీస్ లేదా కిరాయిల (రెంట్స్) కోసం వాహనాలను కొనుగోలు చేస్తుంటే, ఆ వాహనాల మీద కూడా ఐటీసీ పొందవచ్చు.

మూడో సందర్భంలో.. డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్ నేర్పటానికి కొనుగోలు చేసే వాహనాల మీద కూడా ఐటీసీ పొందవచ్చు. ఈ నియమ నిబంధనలన్నీ కూడా డ్రైవర్‌తో కలిపి 13 లేదా అంతకంటే తక్కువ సీటింగ్ సామర్థ్యం గల ప్యాసింజర్ వాహనాలకు మాత్రమే. ఇతర వాహనాలకు అంటే 13 కంటే ఎక్కువ సీటింగ్ ఉన్న ప్యాసింజర్ వాహనాలు అంటే బస్సు లేదా మినీ బస్సులు, రవాణాకు ఉపయోగించే లారీలు, ట్రాక్టర్లు, ట్రాలీలు, కాంట్రాక్ట్ పనుల కోసం వాడే ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్, రోడ్ రోలర్, బుల్డోజర్ లాంటి వాహనాల మీద ఐటీసీ తీసుకోవటానికి ఎలాంటి అడ్డంకి లేదు.

ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన మరొక ముఖ్య విషయం ఏమిటంటే.. ఐటీసీ తీసుకోవటానికి ఉద్దేశించిన సాధారణ నియమ నిబంధనలు అన్నీ కూడా పైన తెలిపిన అన్ని సందర్భాల్లో వర్తిస్తాయి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

కల్తీ చేసి మాల వేసుకొన్నా ఏం ఉపయోగం?

▸▸ భక్తి ఉంటే చైర్మన్ సీట్లో కూర్చుని వ్యాపారం చేస్తారా: హోంమంత్రి

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వామివారి ప్రసాదానికి విని యోగించే నెయ్యిని కల్తీచేసి ఎన్నిసార్లు మాల వేసుకొంటే ఏం ఉపయోగమని హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు నివాసం వద్ద శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టీటీడీ ఛైర్మన్‌గా చేసిన వైవీ సుబ్బారెడ్డి 50సార్లు అయ్యప్ప మాల వేసుకొన్నారని, ఆయన సూపర్ స్వామి అంటూ జగన్ చేసిన వ్యాఖ్యపై ఆమె పైవిధంగా స్పందించారు. 'చిత్తశుద్ధి లేని వ్యక్తి ఛైర్మన్ సీట్లో కూర్చుంటే ఏమీ ఉపయోగం ఉండదు. ఆయన సూపర్ స్వామి అయినా మరో స్వామి అయినా అదే పరిస్థితి. నిజంగా భక్తి ఉంటే ఛైర్మన్ సీట్లో కూర్చుని వ్యాపారం చేస్తారా? ప్రమాణాల గురించి సుబ్బారెడ్డి మాట్లాడుతున్నారు. బాబాయిని చంపిన వ్యవహారంపై ముందు ప్రమాణం చేయండి. తర్వాత తిరుమల సంగతి చూద్దాం' అని అనిత అన్నారు.

లడ్డూ నాణ్యతపై విచారణ జరపాలి: బొత్స

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడుతున్నారంటూ సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. కల్తీ వాస్తవమని తేలితే బాధ్యులైన వారిని శిక్షించాలని, అలా నిరూపణ కాని పక్షంలో ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని అన్నారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్‌డీఏ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయని, లడ్డూ వ్యవహారంపై అత్యున్నత దర్యాప్తుఏజెన్సీతో విచారణ జరిపి, కల్తీ జరిగినట్టు నిరూపణ అయిన తర్వాత దీనిపై మాట్లాడితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. అలాకాకుండా తన రాజకీయ ఉపన్యాసంలో లడ్డూ ప్రసాదంపై ఆరోపణలు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఆరోపించారు.

టీటీడీలో అక్రమాలపై విచారణ చేయాలి: సీపీఎం

విజయవాడ(గవర్నర్‌పేట), సెప్టెంబరు 21: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూల నాణ్యతపై వస్తున్న వార్తలు, అవినీతి, అక్రమాలపై వస్తున్న కథనాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రజల్లో, భక్తుల్లో ఆందోళనలను తొలగించి వారిలో విశ్వాసాన్ని కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపింది. రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలని కోరింది.

తిరుమలలో పూర్తిస్థాయి ప్రక్షాళన జరగాలి: శివస్వామి

విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 21: తిరుమలలో పూర్తిస్థాయి ప్రక్షాళన జరగాలని, లడ్డూ కల్తీ వ్యవహారంలో పాత్రధారులను ఉరితీయాలని తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి అన్నారు. తిరుమలలో లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనపై ఆయన హిందూ సంఘ సభ్యులు, భక్తులతో ప్లకార్డులు పట్టుకొని శనివారం విజయవాడ వన్‌టౌన్‌లోని శనైశ్వర ఆలయం వద్ద నిరసన తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడటానికి అవసరమైతే ఉద్యమం చేస్తామని తెలిపారు. అవసరమైతే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని, సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. స్వామిజీలు స్వరూపానందేంద్ర తరహాలో అమ్ముడుపోతే పరిస్థితులు ఇలాగే ఉంటాయని శివస్వామి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

తప్పు చేసినవారికి శిక్ష పడాల్సిందే: కేంద్ర మంత్రి జోషి

హుబ్బళ్లి (కర్ణాటక), సెప్టెంబరు 21: తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన అంశాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుందని, ఈ వ్యవహారానికి ఒక తార్కిక ముగింపును ఇస్తామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. శనివారం ఆయన కర్ణాటకలోని హుబ్బళ్లిలో మీడియాతో మాట్లాడారు. ఇది దేశ సంస్కృతి, విశ్వాసాలకు సంబంధించిన అంశమని, తప్పు ఎవరు చేసినా శిక్ష పడాల్సిందేనని జోషి వ్యాఖ్యానించారు. కాగా, తిరుమల లడ్డూను అపవిత్రం చేయడం హిందువులకు వ్యతిరేకంగా జరిగిన కుట్ర అని కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప ఆరోపించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఇలా ఎందుకు జరిగిందని ప్రశ్నించారు.

లడ్డూ అపవిత్రం.. క్షమించరాని నేరం

▸▸ కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం క్షమించరాని నేరమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న సమాచారం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు. ప్రసాదాన్ని కల్తీ చేసి కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీసిన వారికి తగిన శిక్ష పడాల్సిందే అని స్పష్టం చేశారు. సనాతన ధర్మాన్ని, హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్ర చేసిన వారిని శిక్షించి, భక్తుల మనోభావాలను పరిరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అమూల్ నెయ్యిపై దుష్ప్రచారం.. ఏడుగురిపై కేసు

అహ్మదాబాద్, సెప్టెంబరు 21: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన కల్తీ నెయ్యి అమూల్ బ్రాండ్‌కు చెందినదని తప్పుడు ప్రచారం చేసినందుకు ఏడుగురు 'ఎక్స్' ఖాతాదారులపై అహ్మదాబాద్ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్రీవారి ఆలయంలో లడ్డూల తయారీకి వాడిన జంతువుల కొవ్వుతో కూడిన నెయ్యి అమూల్‌కు చెందినదని వీరు పోస్టులు పెట్టారని పోలీసులు తెలిపారు. అమూల్ బ్రాండ్ పేరుతో పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) ప్రతిష్ఠకు భంగం కలిగించే ఉద్దేశంతోనే వారు ఈ చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

దోషులను ఉరి తీయాలి: మధ్యప్రదేశ్ నేతలు

భోపాల్, సెప్టెంబరు 21: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీపై సమగ్ర విచారణ జరిపించాలని మధ్యప్రదేశ్‌లోని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేతలు, పలువురు మతపెద్దలు డిమాండ్ చేశారు. ఇది చాలా బాధాకరమైన ఘటన అని, దీనిపై విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కాంగ్రెస్ నేత, మాజీ సీఎం కమల్‌నాథ్ డిమాండ్ చేశారు. ఇది సనాతన ధర్మంపై చేసిన పెద్ద కుట్ర అని భాగేశ్వర్ ధామ్ చీఫ్ ధీరేంద్ర శాస్త్రి మండిపడ్డారు. దోషులకు ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

లెంపలేసుకోకుండా బీజేపీపై విమర్శలా!

▸▸ జగన్‌పై వల్లూరు జేపీ, యామినీ శర్మ, లంకా దినకర్ ధ్వజం

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆచార వ్యవహారాలు, పూజా విధానాలు, స్వామివారి సేవలు ఇలా ఏ విషయంలో అయినా బీజేపీ కార్యకర్తతో జగన్ చర్చకు సిద్ధమా? అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు వల్లూరు జయప్రకాశ్ నారాయణ, యామినీ శర్మ సవాలు విసిరారు. ప్రతి వ్యక్తి కళ్లకు అద్దుకుని తీసుకునే ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వ్యక్తి లెంపలేసుకోకుండా బీజేపీ నేతలకు తిరుమల గురించి జ్ఞానం లేదని మాట్లాడుతారా? అంటూ మండిపడ్డారు. తిరుమల వెంకన్నతో పరాచకాలు ఆడిన వ్యక్తులు బతికి బట్టకట్టినట్లు చరిత్రలో లేదనే విషయాన్ని జగన్ గుర్తు పెట్టుకోవాలని లంకా దినకర్ పేర్కొన్నారు. బీజేపీ నేతలకు తిరుమల ఆచార వ్యవహారాలపై సగం జ్ఞానం అని జగన్ అనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంలో మరో పిటిషన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూప్రసాదం కలుషితం కావడంపై దర్యాప్తు జరిపించాలని హిందూ సేవా సమితి సంస్థ అధ్యక్షుడు సుర్జీత్ యాదవ్ శనివారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తిరుపతి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో కూడిన నెయ్యిని ఉపయోగించడంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయాలని కోరారు.

శ్రీవారి ఆలయ శుద్ధిపై ఏం చేద్దాం?

(మొదటి పేజీ తరువాయి)

శుద్ధి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే ఆగమ సలహా మండలి సభ్యులతో పాటు ఇతర ప్రధాన అర్చకులు, అర్చకులు, సీనియర్ పండితులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకునేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఆదివారం మధ్యాహ్నంలోగా శుద్ధి నిర్వహణపై పూర్తిస్థాయి ప్రణాళిక ఇవ్వాలని ఈవో కోరారు. ఈ నేపథ్యంలో ఆగమ సలహా మండలిలోని ఐదుగురు సభ్యులతో పాటు వైఖానస ఆగమశాస్త్ర పండితులు, అర్చకులందరూ ఆదివారం సమావేశం కానున్నారు. ఇందులో సంప్రోక్షణ చేయాలా, మహాశాంతి యాగం చేయాలా, చేస్తే ఏయే ప్రాంతాల్లో ఎన్ని రోజులు చేయాలి, ఎలా చేపట్టాలనే అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. 3రోజులు, వారంరోజులు, 27 రోజుల శాంతి విధానాల్లో ఏది చేస్తే పరిహారం జరుగుతుందనే విషయాలను ఆగమశాస్త్రం ప్రకారం నిర్ణయించనున్నారు. సాధారణంగా ప్రతి బ్రహ్మోత్సవానికి ముందు వచ్చే మంగళవారం రోజున కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి)నిర్వహిస్తారు. దీని కంటే ముందుగానే శాంతి హోమాన్ని నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. స్వామివారికి కైంకర్యాలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికను సిద్ధం చేయనున్నారు. ఆ నివేదికను ప్రభుత్వానికి పంపి శుద్ధికార్యక్రమాలు చేపట్టాలని యోచిస్తున్నారు. కాగా, శ్రీవారి ఆలయాన్ని సంప్రోక్షణతో శుద్ధి చేయడంపై మరింత లోతుగా విస్తృతంగా సంప్రదింపులు జరిపి తుది నిర్ణయానికి రావాలని టీటీడీ అధికారులకు సీఎం సూచించారు. శనివారం ఇక్కడి తన నివాసంలో కొందరు మంత్రులు, అధికారులతో తిరుమల అంశంపై ఆయన సమీక్షించారు. లడ్డూ తయారీలో కల్తీ పదార్థాల వాడకంపై టీటీడీ ఈవో పంపిన ప్రాథమిక నివేదికపై చర్చించారు. ఆలయ సంప్రోక్షణ విషయంలో తమకు వచ్చిన సూచనలను ఈవో వివరించారు. ఏ మతానికి చెందిన ప్రార్థనా మందిరాల్లో కచ్చితంగా అదే సామాజిక వర్గం వారు ఉండేలా చూడాలని చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆలయాలు, ఇతర ప్రార్థనా మందిరాల్లో సంప్రదాయాలను కాపాడేందుకు ఇటువంటి చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.



పవిత్రతకు పాతర!

(మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం మరొక సర్క్యూలర్ జారీచేసింది. ప్రముఖ ఆలయాల్లో ఉపయోగించే నెయ్యిని కూడా స్థానిక సహకార డెయిరీల నుంచి కొనుగోలు చేయాలని అందులో స్పష్టం చేసింది. ఆ తర్వాత కొద్ది మాసాలకే టీడీపీ ప్రభుత్వం దిగిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2020లో నెయ్యి ప్రొక్యూర్‌మెంట్ విధానంలో మార్పులు తీసుకువచ్చింది. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ అప్పటివరకు తిరుమల ఆలయం అవసరాల కోసం సరఫరా చేస్తున్న నందినీ బ్రాండ్ నెయ్యిని నిలిపివేసింది. దీంతో తిరుమల పవిత్రత అనేది పూర్తిగా సంక్షోభంలో పడిపోయింది. రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా గత జగన్ ప్రభుత్వం నాడు ఎంపిక చేసిన ఐదు కంపెనీల్లో ఒకటి సరఫరా చేసిన నెయ్యిలోనే పంది, ఎద్దు కొవ్వు, చేప నూనెలు, వెజిటబుల్ ఆయిల్ ఉన్నట్టు బయటపడటం, దానిపై దేశమంతా భగ్గుమనడం తెలిసిందే.

సహకార డెయిరీలే ఎందుకు?

కొన్ని దశాబ్దాలపాటు టీటీడీ సహా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయ పాలకవర్గాలు సహకార పాల ఉత్పత్తులదారు యూనియన్ నుంచి నెయ్యి కొనుగోలు చేశాయి. అప్పుడు ఇలాంటి నాణ్యతాపరమైన సమస్యలు, కొవ్వు కలిసిన సందర్భాలు ఎప్పుడూ రాలేదు. తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారి నైవేద్యం కోసం నెయ్యిని చిత్తూరు డెయిరీ నుంచి కొనుగోలు చేసేవారు. చిత్తూరు డెయిరీ పాలతో పాటు అన్ని వస్తువులూ అత్యంత నాణ్యత కలిగి ఉండేవి. స్వామి సేవలకు లక్షల టన్నుల్లో నెయ్యి అవసరం అయ్యేది. ఆ మేరకు పాడి రైతులకు మేలు జరిగింది. చిత్తూరు డెయిరీ నుంచి వచ్చిన నెయ్యిని పరీక్షించాల్సిన అవసరం కూడా ఉండేది కాదు. అనేక కారణాలతో చిత్తూరు డెయిరీ దెబ్బతినిపోయింది. అప్పటినుంచి టీటీడీ...కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు చెందిన నందినీ బ్రాండ్ నెయ్యిని సేకరించడం ప్రారంభించింది. అప్పట్లో దేశం మొత్తంలో ఆవు నెయ్యి ఉత్పత్తి, నాణ్యతలో చిత్తూరు, కర్ణాటక డెయిరీ అగ్రస్థానంలో ఉన్నాయి. కాబట్టి చిత్తూరు డెయిరీ మూతపడిన తర్వాత టీడీపీ అధికారులు నందినీ నెయ్యిని కొనుగోలు చేసి స్వామివారి సేవలకు ఉపయోగించుకున్నారు. నందినీ నెయ్యి కొనుగోలు చేసినప్పుడు కూడా దాన్ని పరీక్షించాల్సిన అవసరం రాలేదు. కానీ జగన్ ప్రభుత్వంలో మాత్రం నెయ్యి కొనుగోలు టెండర్ ప్రక్రియలో దారుణాలు జరిగాయి.

> తిరుమల లడ్డూలో వాడిన నెయ్యిని జంతువుల కొవ్వు కలిపి భారీగా కల్తీ చేసిన వైనం... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో భక్తులకు ఇస్తున్న ప్రసాదం పవిత్రత, నాణ్యతపైనా అనుమానాలను పెంచుతోంది. అసలు.. టీటీడీ సహా ప్రముఖ దేవాలయాలు ఉపయోగించే నెయ్యి నాణ్యత దెబ్బతినడానికి కారణం ఎవరు? ఆలయాల అవసరాల కోసం సహకార సంఘాల నుంచి నెయ్యిని కొనే సంప్రదాయానికి బ్రేకులు వేసిందెవరు? దాని స్థానంలో ప్రైవేటు సంస్థలు, రిటైల్ షాపులు లేదా వ్యక్తుల నుంచి కొనుగోలు చేయాలని రూల్స్‌ను మార్చివేసింది ఎవరు?.. రాష్ట్రంలోని హిందూ భక్తులను, ఆధ్యాత్మిక ప్రముఖులను, ధార్మిక సంస్థలను, ప్రజలను వేధిస్తున్న ప్రశ్నలివి. లడ్డూ కల్తీ వ్యవహారాన్ని లోతుగా తవ్వేకొద్దీ అన్ని వేళ్లూ గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైపే చూపిస్తున్నాయి.



2019 సర్క్యూలర్ బుట్టదాఖలు..

2019కి ముందు టీటీడీ సహా ప్రముఖ దేవాలయాల్లో ఉపయోగించే నిత్యవసర వస్తువులు, ప్రసాదం తయారీకి ఉపయోగించే సరుకుల పరీశీలనకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ప్రముఖులు, వేద పండితులు, ఆగమ పండితులు ఉండేవారు. సుదీర్ఘ సమయం పాటు సమావేశాలు ఏర్పాటు చేసుకున్న కమిటీ, ప్రభుత్వానికి కీలకమైన సూచనలు చేసింది. తన నివేదిక కూడా అందించింది. ఈ నివేదిక ఆధారంగా అప్పటి దేవదాయ శాఖ కమిషనర్ సర్క్యూలర్ జారీచేశారు. అందులో ముఖ్యంగా నెయ్యి, పాలు కొనుగోలును నేరుగా కో-ఆపరేటివ్ డెయిరీల నుంచి కొనుగోలు చేయాలని స్పష్టంగా పొందుపరిచారు. దీనికి ప్రత్యేకంగా టెండర్లు పిలవాల్సిన అవసరం కూడా లేదని, నాణ్యతను పాటించే మంచి సంస్థ నుంచి కొనుగోలు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత , ఆ సర్క్యూలర్‌ను బుట్టదాఖలు చేసింది. సహకార డెయిరీలను ముంచుతూ నెయ్యిని ఎవరి నుంచైనా కొనుగోలు చేయవచ్చునంటూ 2022లో ఆదేశాలు జారీచేసింది. 2019లో కమిటీ నివేదిక ఆధారంగా ఇచ్చిన సర్క్యూలర్‌లో కేవలం తయారీ కంపెనీల దగ్గర నుంచే వస్తువులు కొనుగోలు చేయాలని స్పష్టంగా ఉంది. జగన్ సర్కార్ ఈ నిబంధనలు మార్చేసి చివరికి చిన్న చిన్న షాపులు, ప్రైవేటు వ్యక్తుల దగ్గర నుంచి కూడా కొనుగోలు చేయవచ్చునని పేర్కొంది. తాను అనుకున్న కంపెనీలకు నెయ్యి టెండర్లు దక్కేలా నిబంధనలను ఇలా అడ్డగోలుగా మార్చివేసింది. శ్రీవారికీ, తిరుమల పవిత్రతకూ, భక్తుల మనోభావాలకు ఏ మాత్రం విలువ ఇవ్వకుండా నాటి జగన్ ప్రభుత్వం ఇచ్చిన అప్పటి ఆదేశాలే తిరుమల పవిత్రతను ప్రశ్నార్థకంగా మార్చివేశాయి.

ఏడుకొండలవాడా.. క్షమించు

గత పాలకుల వికృత పోకడలతో తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రం

▸▸ జంతు అవశేషాలతో మలినమైంది

▸▸ ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మేవారంతా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి

▸▸ నేటినుంచి ప్రాయశ్చిత్త దీక్ష చేపడతా

▸▸ 11 రోజుల పాటు దీక్షలోనే ఉంటా

▸▸ తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించుకుంటా

▸▸ కల్తీ నెయ్యిపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్



అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడటంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. కలియుగ ప్రత్యక్షదైవం బాలాజీకి జరిగిన ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందేనని అన్నారు. 'అమృతతుల్యంగా.. పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదం గత పాలకుల వికృత పోకడల ఫలితంగా అపవిత్రమైంది. జంతు అవశేషాలతో మలినమైంది. విశృంఖల మనస్కులే ఇలాంటి పాపానికి ఒడికట్టగలరు. లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలు ఉన్నాయని తెలిసిన క్షణం నుంచి నా మనసు కలత చెందింది. అపరాధ భావానికి గురైంది. ప్రజా క్షేమాన్ని కాంక్షించి పోరాటంలో ఉన్న నా దృష్టికి ఈ అంశం రాకపోవడం బాధించింది. బాలాజీకి జరిగిన ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతిఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందే. అందులో భాగంగా నేను 'ప్రాయశ్చిత్త దీక్ష' చేయాలని సంకల్పించాను. ఈ నెల 22వ తేదీ ఉదయం గుంటూరు జిల్లా నంబూరులోని శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీక్ష చేపడతా. 11 రోజుల పాటు దీక్ష కొనసాగించిన అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటా. దేవదేవా... నీ పట్ల గత పాలకులు చేసిన పాపాలను ప్రక్షాళన చేసే శక్తిని ఇవ్వమని వేడుకుంటా భగవంతుడిపై విశ్వాసం, పాప భీతి లేనివారే ఇలాంటి అకృత్యాలకు ఒడిగడతారు. నా బాధేమిటంటే టీటీడీ బోర్డు సభ్యులు, ఉద్యోగులు సైతం అక్కడి తప్పిదాలను కనిపెట్టలేకపోడం. కనిపెట్టినా నోరు మెదపకపోవడం. నాటి రాక్షస పాలకులకు భయపడి మిన్నకుండిపోయారా అనిపిస్తోంది. ధర్మాన్ని పునరుద్ధరించే దిశగా అడుగులు వేసే తరుణం ఆసన్నమైంది. ధర్మో రక్షతి రక్షితః' అంటూ పవన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

'కల్తీ' దోషులను కఠినంగా శిక్షించాలి

సినీ నటుడు మోహన్‌బాబు



హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా పూజించే దైవం శ్రీ వేంకటేశ్వర స్వామికి నిత్యం సమర్పించే లడ్డూలలో కలిపే ఆవు నెయ్యిలో దాదాపు 3నెలల క్రితం వరకూ ఇతర జంతువుల కొవ్వును కలుపుతున్నారని తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని సినీనటుడు మంచు మోహన్‌బాబు అన్నారు. స్వామి సన్నిధిలో ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమని అన్నారు. ఈ ఆరోపణ నిజమైతే దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో సీఎం నూరేళ్లు చల్లగా ఉండాలని మోహన్‌బాబు ఆకాంక్షించారు.



చేతిలో లడ్డూతో జనసేన నేత కిరణ్‌రాయల్ నిరసన

జగన్ అండ్ కో దిష్టిబొమ్మల దహనం

తిరుపతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో తిరుపతిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బా రెడ్డి, భూమన కరుణాకర రెడ్డిల దిష్టిబొమ్మలను టీడీపీ, జనసేన శ్రేణులు దహనం చేశాయి. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై కేంద్రం జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అలాగే, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు(తిరుపతి), పులివర్తి నాని(చంద్రగిరి), మురళీ మోహన్(పూతలపట్టు), గురజాల జగన్మోహన్(చిత్తూరు) తిరుపతిలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీ నేతలపై దుమ్మెత్తి పోశారు. కాగా, తిరుమలను అపవిత్రం చేసిన మాజీ సీఎం జగన్‌రెడ్డిపై చీటింగ్ కేసు పెట్టి అరెస్టు చేయాలని తిరుపతి ఎస్పీకి జనసేన నేత కిరణ్ రాయల్, బీజేపీ నేతలు భానుప్రకాశ్ రెడ్డి, సామంచి శ్రీనివాస్ తదితరులు ఫిర్యాదు చేశారు.

ఆ ముగ్గురి వైపే అందరి వేళ్లు!

సుబ్బారెడ్డి, భూమన, ధర్మారెడ్డి హయాంలో నిత్య వివాదాలమయంగా తిరుమల పాలన

దైవాన్నీ, భక్తులనూ లూటీచేసేలా పలు జీవోలు

ఐదేళ్లూ అడ్డగోలు వ్యవహారాలు

వారి నిర్వాకమే 'లడ్డూ కల్తీ' అంటున్న భక్తులు

తిరుమల పవిత్రతపై హిందూ భక్తుల్లో కలవరం రేగుతున్న నేపథ్యంలో వారి వేళ్లు ఆ ముగ్గురి వైపే మళ్లుతున్నాయి. మాజీ టీటీడీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి, మాజీ ఇంఛార్జి ఈవో ధర్మారెడ్డి గత ఐదేళ్లుగా వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్నారు. లడ్డూను అపవిత్రం చేసిన వ్యవహారంలో ఇప్పుడు..ఈ ముగ్గురిపైనే భక్తుల్లో ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

■ సుబ్బారెడ్డి: మాటే ఆదేశం..



2019 మే 30న సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేసిన 21 రోజులకు ఆయన బంధువు వైవీ సుబ్బారెడ్డి టీటీడీ పాలకమండలి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. 2021 ఆగస్టు 8న రెండవ దఫా కూడా ఆయనే ఛైర్మన్‌గా నియమితులై 2023 ఆగస్టు దాకా కొనసాగారు. జగన్ ఐదేళ్ల పాలనలో నాలుగేళ్లు ఆయనే ఛైర్మన్‌గా ఉన్నారు. ఇంత కాలం కొనసాగినవారెవరూ అప్పటివరకు టీటీడీ చరిత్రలోనే లేరు. సీఎం బంధువు కావడంతో దేవస్థానంలో ఆయన అధికారానికి అడ్డు లేకుండా పోయింది. నోటి మాట ఆదేశంగా చెలామణీ అయ్యింది. అనుకున్నదే తడవుగా ఉత్తర్వులు జారీ అయ్యేవి. ఈ క్రమంలో పలు అడ్డగోలు నియామకాలు జరిగాయని, బంధువులు, సొంత సామాజిక వర్గానికి చెందిన వారిని కీ పోస్టుల్లో నియమించారని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉదాహరణకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ఐటీ విభాగానికి ఏమాత్రం అర్హత, అనుభవం లేని వ్యక్తిని హెడ్‌గా నియమించడం కలకలం సృష్టించింది. ఈయన హయాంలో చేపట్టిన ఎస్వీబీసీ సలహాదారుల నియామకాలు కూడా వివాదాస్పదమయ్యాయి. ఛైర్మన్ కార్యాలయం కేంద్రంగా దర్శన టికెట్ల కేటాయింపు ఇష్టారాజ్యంగా జరిగిందన్న ఆరోపణలున్నాయి.

భూమన: కుమారుడి కోసం నిధుల మళ్లింపు

టీటీడీ ఛైర్మన్‌గా భూమన కరుణాకర రెడ్డి పనిచేసింది చాలా స్వల్ప కాలమే. 2023 సెప్టెంబరులో నియమితులైన ఆయన ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే వరకూ తొమ్మిది నెలలు ఆ పదవిలో ఉన్నారు. ఆ స్వల్ప వ్యవధిలోనే అవినీతి ఆరోపణలతో పాటు సొంత రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీని వాడుకున్నారన్న ఆరోపణలను ఆయన ఎదుర్కొన్నారు. కరుణాకర రెడ్డి కూడా అప్పటి సీఎం జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. బంధుత్వం కూడా ఉంది. దీంతో దేవస్థానంలో ఆయన మాటకు ఎదురు లేకుండాపోయింది. ఇంజనీరింగ్ పనులకు భారీగా నిధుల కేటాయింపులు జరపడం వివాదాన్ని సృష్టించింది. టీటీడీ నిధులను తిరుపతి అభివృద్ధికి మళ్లించడం, టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు వంటి నిర్ణయాలు విమర్శలు మూటకట్టుకున్నాయి. తిరుపతి నుంచి అప్పట్లో ఎమ్మెల్యేగా పోటీఉన్న తన కుమారుడి రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి.





ధర్మారెడ్డి : వివాదాలపుట్ట

తొలినుంచీ వైఎస్ కుటుంబానికి సన్నిహితుడనే ముద్ర ఉన్న కేంద్ర ప్రభుత్వ మాజీ అధికారి ఏవీ ధర్మారెడ్డి గతంలోనూ టీటీడీలో రెండు పర్యాయాలు డిప్యుటేషన్‌పై పనిచేసి వివాదస్పద పరిస్థితుల్లో తిరుగు ముఖం పట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడోసారి మళ్లీ టీటీడీలోకి డిప్యుటేషన్‌పై వచ్చారు. 2019 జూలై 12న తిరుమల స్పెషల్ ఆఫీసర్‌గా జేఈవో పోస్టులో నియమితులైన కొద్ది రోజులకే ఆయన కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అదనపు ఈవో పోస్టును సృష్టించింది. 2022 నవంబరులో ఈవో జవహర్‌రెడ్డి బదిలీ కావడంతో ఇంచార్జి ఈవోగా ధర్మారెడ్డి కొనసాగారు. మూడున్నరేళ్ల పాటు తిరుమలలోనూ, ఎన్నికల ఫలితాల వరకూ టీటీడీపైనా పట్టు తెచ్చుకున్నారు. జగన్‌పై కేసులు ఉండడంతో న్యాయవ్యవస్థ ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు శ్రీవారి దర్శనాలను ఆయుధంగా మలచుకున్నారనేది ఆయనపై ప్రధాన ఆరోపణ. శ్రీవాణి ట్రస్టు సృష్టించి శ్రీవారి దర్శనానికి రేటు కట్టారని, ధనికులకే మంచిదర్శనం కల్పించి పేదల పట్ల వివక్ష, తారతమ్యం చూపారన్న విమర్శలు వచ్చాయి.

లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ జరిపించండి

▸▸ గవర్నర్‌కు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల వినతి

▸▸ వైసీపీ హయాంలోనే కల్తీ జరిగింది

▸▸ విచారణ కోరే హక్కు ఆ పార్టీకి లేదు: షర్మిల



తిరుమల లడ్డూ వివాదంపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, నాయకులు

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల కోరారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్‌డీడీబీ రిపోర్టు ప్రకారం లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందని, చేప, పంది, గొడ్డు కొవ్వుల నుంచి తీసిన నూనె ఉందని తేలిందని తెలిపారు. స్వామివారి నైవేద్యాలకు వాడే నెయ్యిని కిలో రూ.1,600కు కొంటూ భక్తులకు పంపిణీ చేసే ప్రసాదాలకు ఉపయోగించే నెయ్యిని మాత్రం కిలో రూ.320కే కొనుగోలు చేస్తారా అని మండిపడ్డారు. అంత తక్కువ రేటుకు కొనేది నెయ్యా, నూనా, లేకపోతే ఇంకేమైనా ఉందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడే అసలు మతలబు ఏమిటో తేలిపోయిందని అన్నారు. ఎన్‌డీడీబీ రిపోర్టు జూన్ 23న వస్తే సీఎం చంద్రబాబు దాన్ని ఎందుకు దాచారని షర్మిల ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేసినా కేంద్ర సంస్థలతోనూ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేవస్థానంలో లడ్డూ ప్రసాదాన్ని ఎందుకు కల్తీ చేయాల్సి వచ్చిందని నిలదీశారు. ఈ అంశంపై దర్యాప్తు చేయాలని కోరే హక్కు వైసీపీకి లేదని, వైసీపీ పాలనలోనే కల్తీ జరిగిందని స్పష్టం చేశారు. రూ.320కి నెయ్యి వస్తుందో, నూనె వస్తుందో కూడా తెలియదా అని వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను ఆమె ప్రశ్నించారు. కల్తీకి ఎవరు పాల్పడ్డారో తేల్చి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని షర్మిల డిమాండ్ చేశారు.



గుంటూరులో నిరసన తెలుపుతున్న ఆధ్యాత్మిక, ధార్మిక సంఘాలు

ఆలయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగించాలి


▸▸ ధార్మిక సంఘాల నాయకుల డిమాండ్

గుంటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు, చేపనూనె వినియోగించడంపై సీబీఐ విచారణ జరిపించాలని ధార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. శనివారం సాయంత్రం గుంటూరు శంకర్‌విలాస్ సెంటర్‌లో హిందూ ధార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వేంకటేశ్వర స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. దేవాలయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగించి వేరే ప్రభుత్వ సంస్థల్లోకి తరలించాలని ఈ ప్రదర్శనకు నేతృత్వం వహించిన సిరిపురపు శ్రీధర్ శర్మ తదితరులు డిమాండ్ చేశారు.

వరద బాధితులకు

25న పరిహారం

» నష్టపోయిన అందరికీ ఒకేసారి.. ఫిర్యాదులు రాకూడదు: సీఎం


వరద బాధితుల సహాయార్థం సీఎం చంద్రబాబుకు రూ. కోటి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేస్తున్న భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్లా, సంస్థ ఈడీ సాయి ప్రసాద్

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరదలతో నష్టపోయిన బాధితులందరికీ ఈనెల 25న ఒకేసారి పరిహారం అందజేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. శనివారం సంబంధిత శాఖల అధికారులతో ఎన్యుమరేషన్ ప్రక్రియ, పరిహారం చెల్లింపులపై సమీక్ష చేశారు. వరద బాధితులకు ఉత్తమమైన పరిహారాన్ని ప్రకటించిన సీఎం.. నష్టపరిహారంలో తమ పేరు నమోదు కాలేదన్న ఫిర్యాదు ఎక్కడా రాకూడదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విజయవాడలో వరదలకు మునిగిన ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్‌కు రూ.25 వేలు, మొదటి, ఆపై అంతస్తు వాళ్లకు రూ.10 వేలు పరిహారం అందించాలని స్పష్టం చేశారు. వరదలతో నష్టపోయిన వ్యాపారులకు, చనిపోయిన పశువులకు సంబంధించి పశుపోషకులకు కూడా ఆర్థిక సాయాన్ని అందించాలన్నారు. 10 వేల వాహనాల్లో ఇప్పటికే 6 వేల వాహనాల బీమా సెటిల్‌మెంట్ పూర్తైందని అధికారులు చెప్పగా, మిగతా వారికీ త్వరగా బీమా అందేలా చూడాలన్నారు.

భారత్ బయోటెక్ రూ.కోటి విరాళం

వరద బాధితులకు సహాయం కోసం భారత్ బయోటెక్ ఎండీ ఎల్లా సుచిత్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిప్రసాద్ రూ.కోటి విరాళం ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో శనివారం సీఎం చంద్రబాబును కలిసి వారు రూ.కోటి చెక్కును అందజేశారు. అలాగే ఎన్టీఆర్ తనయుడు నందమూరి మోహన్‌కృష్ణ, ఆయన కుమార్తె మోహన రూప రూ.25 లక్షల చెక్కును సీఎంకు అందించారు. ఈ సందర్భంగా దాతలను సీఎం చంద్రబాబు అభినందించారు.


జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను సత్కరిస్తున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య

26న జనసేనలోకి భారీ చేరికలు

» డిప్యూటీ సీఎం పవన్‌తో మాజీ ఎమ్మెల్యేలు సామినేని, కిలారి భేటీ

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో చేరేందుకు వైసీపీ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సన్నద్ధమయ్యారు. ప్రకాశం జిల్లా సీనియర్ వైసీపీ నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేనలో చేరుతున్నారు. ఈ నెల 26న మంగళగిరిలో వీరు పార్టీలో చేరుతున్నారు. ఇప్పటికే ఆ ముగ్గురు నేతలు జనసేనానితో భేటీ అయ్యారు. అదే రోజు విజయనగరం జిల్లా వైసీపీ నేతలు అవనపు విక్రమ్, అవనపు భావన జనసేన కండువా కప్పుకోనున్నారు. విజయవాడ, గుంటూరు, తిరుపతి నుంచి పలువురు కార్పొరేటర్లు కూడా అదే రోజు జనసేనలో చేరబోతున్నారు. శనివారం మధ్యాహ్నం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, కంది రవి శంకర్ భేటీ అయ్యారు. వీరి తర్వాత జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కలిశారు.

నేడు విజయవాడకు విద్యాసాగర్

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి జెత్వానీ కేసులో అరెస్టయిన వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ను రాష్ట్ర పోలీసులు ఆదివారం రాత్రికి విజయవాడ తీసుకొచ్చి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచే అవకాశాలు ఉన్నాయి! విద్యాసాగర్‌ను డెహ్రాడూన్‌లో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అతడ్ని అక్కడ మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో జడ్జి ముందు శనివారం హాజరుపరిచారు. ఆ తర్వాత అక్కడి నుంచి ట్రాన్సిట్ వారెంట్(టీడబ్ల్యూ)పై విద్యాసాగర్‌ను విజయవాడకు రైలులో తీసుకొస్తున్నట్టు సమాచారం. ఆదివారం రాత్రికి వీలు కానిపక్షంలో సోమవారం ఉదయమే విజయవాడలోని చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో విద్యాసాగర్‌ను హాజరుపరిచే అవకాశాలు ఉన్నాయి. పోలీసులు విద్యాసాగర్‌ను 15 రోజుల కస్టడీ కోరే సూచనలు ఉన్నాయి.

మల్లవల్లిలో అశోక్ లే ల్యాండ్.. రెడీ!

ఆంధ్రజ్యోతి, విజయవాడ/హనుమాన్ జంక్షన్ రూరల్, సెప్టెంబరు 21: కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ కంపెనీ తన యూనిట్‌ను ప్రారంభించటానికి రంగం సిద్ధం చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉత్పాదకత లేకుండా పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైన ప్లాంట్.. ఇప్పుడు కార్యకలాపాలకు సిద్ధమైంది. బస్ బాడీబిల్డింగ్ యూనిట్ కార్యకలాపాలను ప్రారంభించటానికి సిద్ధం చేశారు. గతంలో మాదిరిగా ఎలక్ట్రికల్ బస్సుల బాడీ బిల్డింగ్ కాకుండా సాధారణ డీజిల్ బస్సుల బాడీ బిల్డింగ్ పనులు చేపట్టాలని యాజమాన్యం నిర్ణయించింది. చైనా నుంచి కొంత మెషినరీ రావాల్సి ఉంది. నెలలో ఈ పనులు ప్రారంభమవుతాయని అశోక్ లేల్యాండ్ కంపెనీ ప్రతినిధులు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బస్ బాడీబిల్డింగ్ యూనిట్ కార్యకలాపాలు నిర్వహించటం ద్వారా వందల మందికి ఉపాధి లభిస్తుంది.


తీరంలో పునాదులు తవ్వుతున్న దృశ్యం

ఎట్టకేలకు కదిలిన జీవీఎంసీ

» భీమిలిలో సాయిరెడ్డి కుమార్తె అక్రమ నిర్మాణాల తొలగింపునకు శ్రీకారం

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భీమిలి సాగర తీరాన అనుమతులు లేకుండా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి చేపట్టిన నిర్మాణాలను తొలగించడానికి జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు శనివారం శ్రీకారం చుట్టారు. గతంలో ప్రహరీ గోడ తీసేయాలని హైకోర్టు ఆదేశించగా పైపైన తొలగించి చేతులు దులుపుకొన్నారు. దీనిపై జనసేన నాయకుడు మరో పిటిషన్ వేశారు. దీంతో.. ఎలాంటి స్టే ఆర్డర్ లేనందున అనధికార నిర్మాణాలన్నీ తొలగించి ఈ నెల 25న నివేదిక సమర్పించాలని జీవీఎంసీ అధికారులను రెండు రోజుల క్రితం హైకోర్టు ఆదేశించింది. ఆ కూల్చివేతకు అయ్యే ఖర్చు అంతా నిర్మాణదారుల నుంచే వసూలు చేయాలని సూచించింది. హైకోర్టు ఆదేశాలు అందిన తరువాత కూడా మీనమేషాలు లెక్కించిన అధికారులు.. ఎట్టకేలకు కదిలి శనివారం తీరంలో 12 అడుగుల లోతున వేసిన పునాదులను పెకలించే పనులు చేపట్టారు. రెండు మూడు రోజుల్లో మిగిలిన నిర్మాణాలు మొత్తం కూల్చివేస్తామని అధికారులు తెలిపారు.

భూముల రీ సర్వేలో నష్టపోయాం

» గత ప్రభుత్వంలో మాకున్న భూమిలో 60 సెంట్లు తగ్గించి రాళ్లు పాతారు

» భూమిని నా పేరుపైకి మార్చకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారు

» సీఎం చంద్రబాబుకు బాధితుల ఫిర్యాదు


టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూముల రీ సర్వేలో తమకు వాస్తవంగా ఉండే భూమి తగ్గిపోయి నష్టపోయామని బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేశారు. సీఎం శనివారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన సందర్శకులను కలిసి వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన ఎం.శ్రీధర్ సీఎం చంద్రబాబుకు ఇచ్చిన వినతిపత్రంలో భూముల రీ సర్వేలో తనకు ఎదురైన సమస్యను వివరించారు. తన భార్య పేరుతో 3.69 ఎకరాల భూమి ఉందని, అయితే రీసర్వేలో 60 సెంట్లు తగ్గించి 3 ఎకరాల 9 సెంట్లకు మాత్రమే పాసు పుస్తకం ఇచ్చి సర్వే రాళ్లు పాతారని బాధితుడు వాపోయాడు. రీసర్వేలో తాము కోల్పోయిన భూమిని తిరిగి తమకు దక్కేలా చూడాలని సీఎంను కోరారు. తల్లిదండ్రుల నుంచి తనకు సంక్రమించిన భూమిని తన పేరుపైకి మార్చకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని గుంటూరు జిల్లా కాకాని మండలం తక్కెళ్లపాడుకు చెందిన ఇరుకులపాటి అరుణ చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు.

విరాళాలు ఇచ్చిన ప్రజలు

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం కావూరుకు చెందిన ఆవుల విజయమ్మ అనే వృద్ధురాలు వరద బాధితులకు రూ.లక్ష, అన్న క్యాంటీన్‌కు రూ.10 వేలు విరాళం ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన ముంతా రామకృష్ణ రూ.25 వేలు, నరసింహరాజు రూ.50 వేలు వరద బాధితుల కోసం విరాళం అందించారు. ఈ సందర్భంగా దాతలను సీఎం చంద్రబాబు అభినందించారు.

చరిత్రహీనుల్లా మిగిలిపోయేలా శిక్షిస్తాం

> "తిరుమల లడ్డూను కాపీ కొట్టి తయారు చేయాలని అనేకమంది ప్రయత్నం చేశారు. కానీ ఎవరికీ అది సాధ్యపడలేదు. ఆ లడ్డూ తయారీ ఫార్ములా... అందులో వాడే పదార్థాలను కలపడంపై ఆ ఆలయంలో అత్యంత నైపుణ్యం సంపాదించారు. నేను అయోధ్యకు వెళ్లినప్పుడు అక్కడ బిహార్‌కు చెందిన ఒక ధర్మకర్త కలిశారు. తాను అయోధ్యలో నిర్మించిన ఓ ఆలయంలో తిరుమల తరహా లడ్డూ ప్రసాదాన్ని పెట్టాలని తిరుపతి నుంచి అనుభవం ఉన్నవారిని తీసుకువెళ్లి ప్రయత్నం చేశానని, కానీ ఆ రుచి రాలేదని ఆయన చెప్పారు. గతంలో ఇంట్లో తిరుమల ప్రసాదం ఉంచితే ఇల్లంతా ఘుమఘుమలాడేది. అంత ప్రాశస్త్యం వీళ్ల వల్ల నాశనం అయింది. అసలు నెయ్యికి రివర్స్ టెండరింగ్ ఏమిటి? కిలో నెయ్యి రూ.320కి ఎలా వస్తుంది? కనీస ఆలోచన ఉండనక్కర్లేదా? మన ప్రజలు....బాబాయిని కిరాతకంగా చంపినా భరించారు. ఆ రోజే తిరుగుబాటు జరిగి ఉంటే ఇంత దూరం వచ్చేది కాదు"
>
> \- సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కొద్దిసేపు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. లడ్డూ తయారీని అపవిత్రం చేశారన్న విషయం బయటకు వచ్చిన తర్వాత దీనిపై ఏం చేయాలన్నదానిపై అందరితో మాట్లాడుతున్నామని ఆయన చెప్పారు. "ప్రజల మనోభావాలు గౌరవించాలి. అదే సమయంలో శ్రీవారి ఆలయ గౌరవం పెంచాలి. మళ్లీ ఇటువంటి పాపాలు ఎవరూ చేయకుండా చూడాలి. ఇందుకు ఏం చేయాలనేది లోతుగా ఆలోచిస్తున్నాం" అని ఆయన వివరించారు. తిరుమల లడ్డూకు వందల ఏళ్ల ప్రాశస్త్యం ఉందని, దానిని గత పాలకులు నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రసాదం లడ్డూను కాపీ కొట్టి తయారు చేయాలని అనేకమంది ప్రయత్నం చేశారు. కానీ ఎవరికీ అది సాధ్యపడలేదు. ఆ లడ్డూ తయారీ ఫార్ములా... అందులో వాడే పదార్థాలను కలపడంపై ఆ ఆలయంలో అత్యంత నైపుణ్యం సంపాదించారు. నేను అయోధ్యకు వెళ్లినప్పుడు అక్కడ బిహార్‌కు చెందిన ఒక ధర్మకర్త కలిశారు. అయోధ్యలో తిరుమల తరహా లడ్డూ ప్రసాదాన్ని పెట్టాలని తిరుపతి నుంచి అనుభవం ఉన్నవారిని తీసుకువెళ్లి ప్రయత్నం చేశానని, కానీ ఆ రుచి రాలేదని ఆయన చెప్పారు. గతంలో ఇంట్లో తిరుమల ప్రసాదం ఉంచితే ఇల్లంతా ఘుమఘుమలాడేది. అంత ప్రాశస్త్యం వీళ్ల వల్ల నాశనం అయింది. ఏమిటీ దుర్మార్గం అని మనసు చివుక్కుమంటోంది. ఆవేశం, బాధ కలుగుతున్నాయి. మన ప్రజలు...బాబాయిని కిరాతకంగా చంపినా భరించారు. ఆ రోజే తిరుగుబాటు జరిగి ఉంటే ఇంత దూరం వచ్చేది కాదు. నెయ్యికి రివర్స్ టెండరింగ్ ఏమిటి? కిలో నెయ్యి రూ.320కి ఎలా వస్తుంది? కనీస ఆలోచన అక్కర్లేదా? ఇవి చేయాలని దేముడు చెప్పాడా' అని ప్రశ్నించారు.

దేముడే నా నోట చెప్పించాడేమో!

పాలనా వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించడానికే లడ్డూ వివాదాన్ని చంద్రబాబు లేవనెత్తారని జగన్ చేసిన ఆరోపణను ఆయన తిరస్కరించారు. "ఇందులో దృష్టి మళ్లించడం ఏముంది? మా ప్రభుత్వం రాగానే తిరుమలకు ఈవోగా శ్యామలరావును వేశాం. తిరుమలను ప్రక్షాళన చేయాలని చెప్పాం. ఆయన నాకు ప్రతి రోజూ ఏం చేస్తున్నారో చెప్పరు. మేం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా అన్నీ సరిచేసుకొంటూ వెళ్లారు. నాణ్యతను పరీక్షించి కొన్ని కంపెనీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. నిపుణుల కమిటీ వేసి వారి సలహాలు తీసుకొన్నారు. మంచి నెయ్యి కోసం మళ్లీ టెండర్లు పిలిచి నందినీ నెయ్యిని ఎంపిక చేశారు. ప్రక్షాళన చేశారు. కానీ అవన్నీ బయటకు చెప్పలేదు. ఆ రోజు ఎన్డీయే సమావేశంలో అనుకోకుండా ఈ విషయాలు నా నోటి నుంచి వచ్చాయి. దేముడే చెప్పించాడేమో' అని చంద్రబాబు అన్నారు. జగన్ హయాంలో జరిగిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని వ్యాఖ్యానించారు. "రామతీర్థంలో రాముడి తల తీస్తే పట్టించుకొన్న దిక్కు లేదు. తిరుమలను అపవిత్రం చేస్తున్నారని ఎంతోకాలంగా భక్తులు అంటున్నా పట్టించుకోలేదు. ఇప్పుడవన్నీ బయటకు వచ్చినా పశ్చాత్తాపం లేదు. ఎదురు దాడితో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే మాఫియా డాన్ ఎస్కోబార్‌తో పోల్చాను" అని అన్నారు.

జగన్ ఇంటి దగ్గర తిరుమల సెట్టింగా?

నెయ్యి నాణ్యతను ప్రతి రోజూ మూడుసార్లు పరీక్ష చేస్తున్నారన్న జగన్ వాదనను చంద్రబాబు ఎద్దేవా చేశారు. "తిరుమలలో అసలు ల్యాబ్ లేదు. మరి పరీక్షలు ఎలా చేస్తారు? జగన్ వెళ్లి చేశాడా? వైవీ సుబ్బారెడ్డి వందసార్లు మాల వేసుకొన్నారట! బ్రహ్మోత్సవాల సంప్రదాయాలు ఆయన ఏనాడైనా పాటించారా? జగన్ ఇంటి దగ్గర తిరుమల సెట్టింగ్ వేయించడం ఏం పద్ధతి? ప్రతి ఆలయానికి కొన్ని సంప్రదాయాలు ఉంటాయి. కేరళలో గురువాయూర్ ఆలయం లోపలికి వెళ్లాలంటే చొక్కా తీసి వెళ్లాలి. అది అక్కడ పద్ధతి. తిరుమలలో స్వామివారిని అన్య మతస్థులు దర్శించుకోవాలంటే డిక్లరేషన్ ఇచ్చి వెళ్లాలి. దానిని పాటించారా? ఆలయ సంప్రదాయాలను గౌరవించే బాధ్యత వీరికి లేదా? మనోభావాలను పట్టించుకోరా? గతంలో అనేక మంది పాలకులు వచ్చినా ఎవరూ స్వామివారి విషయంలో లాలూచీ పడలేదు. వీళ్లు వచ్చి విచ్చలవిడిగా చేశారు. పవిత్ర క్షేత్రం విషయంలో ఒళ్లు దగ్గర పెట్టుకొని వ్యవహరించాలన్న జ్ఞానం లేకుండా వ్యవహరించారు" అని ఆయన అన్నారు. తిరుమలలో సంప్రోక్షణ ఎలా చేయాలన్నదానిపై జీయర్లు, కంచి పీఠాధిపతులు, సనాతన ధర్మ నిపుణులు అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకొంటామని ఆయన తెలిపారు. వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన సాయం అందుతున్న తీరుపై శనివారం మరోసారి సమీక్ష చేస్తున్నామని, త్వరగా అందడానికి చర్యలు తీసుకొంటామని చంద్రబాబు తెలిపారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్!

(మొదటి పేజీ తరువాయి)

కల్పించి ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు తమ సమస్యలపై నేరుగా ప్రభుత్వంతో చర్చించేందుకు వీలుగా కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు వారం రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. రాష్ట్రంలో గతంలోనే పెట్టుబడులు పెట్టినవారికి రావాల్సిన రాయితీలు చెల్లించడంతోపాటు, వారితో మరిన్ని పెట్టుబడులు పెట్టించేందుకు రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) శనివారం విజయవాడలో నిర్వహించిన సదరన్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం నుంచి వారు ఏమి ఆశిస్తున్నారో తెలుసుకుని, అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు, ఒప్పందాలను మరొక ప్రభుత్వం మార్చేడం వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వ పీపీఏల రద్దు నిర్ణయం వల్ల రాష్ట్రంతోపాటు దేశం నష్టపోయిందన్నారు. రెన్యువబుల్ ఎనర్జీలో గతంలో ఇతర దేశాల నుంచి పెట్టుబడులు పెట్టగా, వైసీపీ ప్రభుత్వ నిర్ణయం వల్ల దేశానికే చెడ్డ పేరు వచ్చిందని చెప్పారు. ఇలాంటివి భవిష్యత్తులో జరగకూడదనే కన్సల్టేటివ్ ఫోరాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైతే చట్టం తీసుకువచ్చేందుకు కేంద్రంతో చర్చిస్తామన్నారు. గతంలో ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఈడీబీ) ఉండేదని, సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ఉండేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఈడీబీని మూసివేసిందని చెప్పారు. ఇప్పుడు ఈడీబీని పునరుద్ధరించి, ఒక యువ ఐఏఎస్‌ను సీఈవోగా నియమించామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో సీఐఐ కీలక పాత్ర పోషించాలని మంత్రి లోకేశ్ కోరారు. విశాఖను ఐటీ హబ్‌గా రూపొందించడంతోపాటు డేటా సెంటర్, ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాల్లో ఉన్న వనరుల ఆధారంగా పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి తమ ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తుందని హామీ ఇచ్చారు.


సీఐఐ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

పెట్టుబడులకు ఆటంకాలు లేకుండా..

ఐదేళ్లలో పారిశ్రామికంగా గాడి తప్పిన రాష్ట్రాన్ని మళ్లీ పారిశ్రామిక పురోగామిగా ముందుకు తీసుకు వెళ్లేందుకు గతంలో తాము తీసుకువచ్చిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోపాటు కొత్తగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని తీసుకువస్తున్నామని లోకేశ్ తెలిపారు. సదస్సుకు ఈరోజు 70 మంది దిగ్గజ కంపెనీల సీఈవోలు వచ్చారన్నారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కాబట్టి జీరో బడ్జెట్ ప్రకృతి సేద్యంలో మార్గదర్శకంగా ఉంటామని తెలిపారు. లాభసాటి వ్యవసాయంగా మార్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మామిడి, డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూరం వంటి ఉత్పత్తులకు చాలా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీటి పట్ల ఆసక్తి చూపితే జపాన్, అమెరికా, యూరప్ ఖండంలోని దేశాలకు ఎగుమతి చేయవచ్చన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సంప్రదాయేతర విద్యుత్ పీపీఏలు రద్దు కావటం రాష్ట్రానికే కాకుండా యావత్ దేశంపైనా ప్రభావం చూపిందని, భారత్‌కు చెడ్డపేరు వచ్చిందని తెలిపారు. పదే పదే ప్రభుత్వ నిర్ణయాలు మార్చేయకుండా ఓ చట్టం తీసుకురావాలని కేంద్రంతో మాట్లాడతామని చెప్పారు. పెట్టుబడులకు ఇలాంటి ఆటంకాలు లేకుండా తమ ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోందన్నారు. ఇందులో భాగంగా విద్యాపరంగా కేజీ నుంచి పీజీ వరకు సిలబస్ మీద దృష్టి సారిస్తున్నామని, స్కిల్ మీద పూర్తిగా దృష్టి సారించి పరిశ్రమ రంగాలకు సర్టిఫైడ్ వర్క్ ఫోర్స్ డేటా ఇస్తామని తెలిపారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వైపు వేగంగా ముందుకు వెళ్లాలనుకుంటున్నామ, రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) యూనివర్సిటీ స్థాపనకు తాను బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఒక ఉత్తేజకరమైన ఏఐ ఆధారిత యాప్ డ్యాష్‌బోర్డును తీసుకువస్తున్నామన్నారు. కాగా, రాష్ట్రంలో అగ్రి బయోటెక్ క్లస్టర్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్లా సూచించగా, లోకేశ్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో ఈవీ పాలసీకి సంబంధించి జీవో 58ను ఇవ్వటాన్ని హర్షిస్తూ సీఐఐ సభ్యుడు ఆకుల వెంకట రమణ మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కేరళ తరహాలో ఏపీలోనూ పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వం ప్రతి రెండు నెలలకు ఒకసారి కూర్చుని మాట్లాడుకునేలా జీవో తీసుకురావాలని సీఐఐ సదరన్ రీజియన్ కౌన్సిల్(ఎస్ఆర్‌సీ) ఏపీ చైర్మన్ మురళీకృష్ణ విజ్ఞప్తి చేయగా త్వరలో జీవో ఇస్తామని లోకేశ్ తెలిపారు. సమావేశంలో సీఐఐ ఎస్ఆర్ చైర్‌పర్సన్ నందిని, జాన్ ముత్తూట్, దక్షిణంలో మరో ఐదు రాష్ట్రాల ఎస్ఆర్‌సీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు పాల్గొన్నారు.

లం... కొడకా... చంపేస్తా

» వైద్య కళాశాల ప్రొఫెసర్‌పై జనసేన ఎమ్మెల్యే నానాజీ వీరంగం

» ఆచార్యునిపై పంతం మేనల్లుడి దాడి

కాకినాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ రెచ్చిపోయారు. ఎమ్మెల్యేనన్న స్పృహ కోల్పోయి పచ్చిబూతులు తిడుతూ చెలరేగిపోయారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) మైదానంలో కాలేజీ ఫోరెన్సిక్ విభాగాధిపతి, కాలేజీ స్పోర్ట్స్ వైస్ చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై దౌర్జన్యానికి దిగారు. లం..కొడకా... చంపేస్తా... అంటూ బెదిరించారు. ఆ అధ్యాపకుని ఫేస్ మాస్క్‌ను బలవంతంగా తొలగించి కొట్టడానికి ప్రయత్నించారు. అదే సమయంలో వెనుక నుంచి ఎమ్మెల్యే మేనల్లుడు బన్నీ... ప్రొఫెసర్‌పై చేయి చేసుకున్నారు.

గొడవకు నేపథ్యం ఇదీ...

ఆర్ఎంసీ మైదానంలో పంతం నానాజీ అనుచరులు అనధికారికంగా కొన్ని నెలలుగా వాలీబాల్ ఆడుతున్నారు. మైదానంలో ఆడొద్దని కళాశాల అధికారులు సదరు యువకులకు సూచించారు. ఎమ్మెల్యే ఆర్ఎంసీ అధికారులకు ఫోన్ చేయగా, ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపారు. నిర్ణయం తీసుకోకమునుపే శనివారం ఎమ్మెల్యే అనుచరులు మైదానానికి వచ్చారు. వాలీబాల్ నెట్ కడుతుండగా, డాక్టర్ ఉమామహేశ్వరరావు అడ్డుకున్నారు. అనుమతులు వచ్చే వరకు ఆగాలని సూచించారు. దీంతో ఆ యువకులు నేరుగా ఎమ్మెల్యే వద్దకు వెళ్లారు. 'మిమ్మల్ని ఉమామహేశ్వరరావు తిట్టారు' అంటూ ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే పంతం హుటాహుటిన ఆర్ఎంసీ మైదానానికి వచ్చారు. ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావుపై రాయలేని తిట్ల దండకాన్ని అందుకున్నారు. లం..కొడకా... చంపేస్తా... అంటూ దూసుకెళ్లారు. ఆయన ఫేస్ మాస్క్‌ను దురుసుగా తొలగించారు. చెయ్యెత్తి కొట్టడానికి ప్రయత్నించారు. ఈలోగా వెనుక నుంచి ఎమ్మెల్యే మేనల్లుడు బన్నీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావుపై చేయి చేసుకున్నారు. 'సార్ మిమ్మల్ని నేను తిట్టలేదు. వారు చెపుతున్న దానిలో వాస్తవం లేదు' అంటూ ప్రొఫెసర్ చెపుతున్న వివరణను ఎమ్మెల్యే వినే ప్రయత్నం చేయలేదు. అంతా కలసి డాక్టర్‌ను నెట్టేశారు. ఘటనపై ఆర్ఎంసీ వైద్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది.

ఎమ్మెల్యేకు జనసేనాని మందలింపు

ఘటనపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యేను మందలించినట్లు తెలిసింది. కాకినాడ జిల్లా కలెక్టర్ షన్ మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ రాజీ ప్రయత్నాలు చేశారు. క్షణికావేశంలో దురదృష్టవశాత్తు అలా జరిగిపోయిందని ఎమ్మెల్యే చెప్పడంతో... ప్రొఫెసర్ ఒకింత తగ్గారు. కానీ, వైద్య విద్యార్థులు మాత్రం తగ్గలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం ఘటనను తీవ్రంగా ఖండించింది. ఎమ్మెల్యే ఆయన అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యాంసుందర్ డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

వరదంటే వణుకే..!

బుడమేరుకు వరదలు వచ్చాయంటే పరిసర ప్రాంతాల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పటికే ఉప్పలూరులోని బుడమేరు కాలువపై వంతెన శిథిలావస్థకు చేరింది. మంతెనలోని వంతెన కూలిపోయింది. పది రోజుల క్రితం వచ్చిన వరదలతో ఓ ప్రాణం పోగా, వేలాది ఎకరాలు వరద పాలయ్యాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి బుడమేరుపై కొత్తగా వంతెనలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుకుంటున్నారు. - కంకిపాడు

అల్లాడుతున్న బుడమేరు ప్రాంత ప్రజలు, రైతులు



వరదల కారణంగా నీట మునిగిన బుడమేరు వంతెన (ఫైల్‌ఫోటో)

- ఇప్పటికే కూలిన మంతెనలోని బుడమేరు వంతెన
- శిథిలావస్థకు చేరిన ఉప్పలూరు వంతెన
- కాలువపై వంతెనలు నిర్మించాలంటూ విజ్ఞప్తులు

కంకిపాడు మండల పరిధిలోని బుడమేరు కాలువ పరిధిలో ఉప్పలూరు, మంతెన, తెన్నేరు, వేల్పూరు నాలుగు గ్రామాలున్నాయి. వేల్పూరు, మంతెన గ్రామాలు మైనర్ పంచాయతీలు కాగా ఉప్పలూరు, తెన్నేరు గ్రామాలు మేజర్ పంచాయతీలు. అలాగే బుడమేరు పరివాహక ప్రాంతంలోని ఉప్పలూరులో సుమారు 1000 ఎకరాలు, మంతెనలో సుమారు 800 ఎకరా లు, తెన్నేరులో సుమారు 1000 ఎకరాలు, వేల్పూరులో సుమారు 800 ఎకరాల మేర రైతులు సాగు చేస్తున్నారు. వరదల వచ్చి న ప్రతిసారి రైతులు తీవ్రంగా నష్ట పో తున్నారు. ఆ సమయంలో గ్రామాల మ ధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఉప్పలూరు - కేసరపల్లి, ఉప్పలూరు - మంతెన, మంతెన - తెన్నేరు గ్రా మాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి.

ప్రాణం తీసిన వరద

ఈ నెల 7న పెడన మండలానికి చెందిన కలిదిండి ఫణి ఉప్పలూరు బుడమేరు కాలువలో కొట్టుకుపోయిన సంఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. హైదరాబాద్ నుంచి గన్నవరం వచ్చి అక్కడ మిత్రుడిని కలిసి కంకిపాడు మీదుగా పెడన వెళ్తున్నాడు. రాత్రి కావడంతో వరద ఉధృతిని పసిగట్టలేకపోయాడు. దీంతో వరదల్లో కొట్టుకుపోయాడు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పాత వంతెన స్థానంలో కొత్తగా పై వంతెన నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



శిథిలావస్థకు చేరిన ఉప్పులూరులోని బుడుమేరు వంతెన, మంతెనలో కూలిన వంతెన

ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తా

అన్నే ధనయ్య, టీడీపీ జిల్లా కార్యదర్శి



సుమారు వందేళ్ల క్రితం నిర్మించిన వంతెన కావడంతో ఉప్పలూరులోని కాలువపై ప్రస్తుతం ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. దీన్ని పునఃనిర్మించాలని ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించారు. ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లి వంతెన నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

మంతెన వంతెన పునఃనిర్మించాలి

బండి శ్రీను, ఎంపీటీసీ, మంతెన



మంతెనలో బుడమేరు కాలువపై ఉన్న వంతెన ఏడాదిన్నర క్రితమే కూలింది. కొత్త వంతెన నిర్మించాల్సిన అవసరముంది. వంతెన లేక రైతులు పొలం పనులు చేసుకునేందుకు వీల్లేకుండా పోయింది. ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలి.

డీలా పడ్డ రైతులు

రాజాబాబు, రైతు



అస్తవ్యస్త కాలువ కారణంగా ఆయా ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల్లో ఈ కాలువపై వంతెన నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మేరకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎంపీ బాలశౌరి సీఎంతో మాట్లా డి తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



నారా లోకేష్‌కు చెక్కు అందిస్తున్న అమ్మ ప్రతినిధులు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు 'అమ్మ' రూ.26 లక్షల వితరణ

మొగల్రాజపురం, సెప్టెంబర్ 21: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) రూ.26లక్షలను మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. చెక్కు అందచేసిన వారిలో అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గారపాటి సతీష్‌బాబు, జనరల్ సెక్రటరీ సుంకర చంద్రశేఖర్, మాజీ అధ్యక్షుడు బొబ్బా నారాయణరావు, యార్లగడ్డ సుబ్బారావు పాల్గొన్నారు.

లాయర్ ఆత్మహత్య..!



వన్‌టౌన్, సెప్టెంబరు 21: స్థానిక సూర్యారావుపేటలోని పీసపాటివారి వీధిలో ఓ రూమ్‌లో ఉంటున్న పొందుగుల గ్రామానికి చెందిన చుండూరు సాయి సందీప్ (32) శనివారం తన నివాసంలో ఉరేసుకుని చనిపోయాడు. దీనిపై అతడి తండ్రి చుండూరు రామారావు పోలీసులకు ఫిర్యాదు చేస్తూ సందీప్ మృతిపై అనుమానాలున్నాయన్నారు. మైలవరం మండలం, పొందుగుల గ్రామానికి చెందిన రామారావు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. సందీప్ మూడేళ్ల నుంచి పీసపాటివారి వీధిలో ఓ రూమ్‌లో ఉంటూ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నాడు. తన కుమారుడు చనిపోయినట్టు సమాచారం రాగానే నగరంలోని సందీప్ రూమ్‌కు వచ్చాడు. రూమ్‌లో సందీప్ టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి ఫ్యాన్‌కు వేలాడుతున్న మృతదేహాన్ని దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడి మృతిపై అనుమానాలున్నట్టు పోలీసులకిచ్చిన ఫిర్యాదు పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. కొన్ని వ్యక్తిగత కారణాలతో సందీప్ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

అధునాతన పద్ధతిలో స్వచ్ఛత హి సేవ

- కమిషనర్ ధ్యానచంద్ర



వీసీకి హాజరైన కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, సెప్టెంబరు 21: నగర ప్రజలకు పూర్తిస్థాయిలో స్వచ్ఛత హి సేవపై అవగాహన కల్పించి, అధునాతన పద్ధతిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్వచ్ఛ భారత్ మిషన్‌పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతోపాటు కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా వారిని భాగస్వాములు చేస్తూ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎస్‌ఈ ప్రాజెక్ట్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

దక్షిణ ఏసీపీగా బంగార్రాజు



విజయవాడ: దక్షిణ మండలం ఏసీపీగా యూ బంగార్రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీబీలో పని చేస్తున్న ఆయనను కొద్దిరోజుల క్రితం ఎన్టీఆర్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఇంతకుముందు నగరంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. కొంతకాలం జీఆర్పీలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

అండర్-14 క్రికెట్ జట్టు సెలక్టర్‌గా భీమారావు



మొగల్రాజపురం: వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో క్రికెట్ కోచ్‌గా పనిచేస్తున్న దేశమాల బీమారావును గుంటూరు జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక కమిటీకి సెలక్టర్‌గా నియమితులయ్యారు. గతంలో పలు ఇంటర్ వర్సిటీ పోటీల్లో కెప్టెన్‌గా ఎన్నో మ్యాచ్‌లు గెలుపొందడంతో ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం భీమారావును అభినందించారు.

24, 25న స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

భవానీపురం: 2024-25 సంవత్సరానికి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా పశ్చిమలోని పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు ఈ నెల 24, 25న గాంధీజీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల, ఆర్‌సీఎం ఉన్నత పాఠశాలల్లో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి గద్దె సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులు తమ విద్యార్థిని, విద్యార్థులను తీసుకురావలన్నారు.

చిత్రకారుడు బొండాకు మరో అవార్డు



వన్‌టౌన్: నగరానికి చెందిన చిత్రకారుడు బొండా జగన్మోహనరావుకు ఢిల్లీకి చెందిన దిక్రేజీ టేల్స్ వారి ఇన్ఫ్లుఎన్షియల్ ఇండియన్ 2024 అవార్డు లభించింది. సమాజంలోని వివిధ వర్గాలకు సంబంధించిన అంశాలపై ఆలోచింపజేసే రీతిలో చిత్రాలు వేసినందుకు ఈ అవార్డు లభించింది. భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటున్న ఆయనకు కొరియర్‌లో శనివారం ఈ అవార్డును పంపించారు. పలువురు చిత్రకారులు, కళాభిమానులు బొండాను అభినందించారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో యుగంధరాచార్యకు చోటు



వన్‌టౌన్: లక్షకు పైగా జాతకాలను పరిశీలించినందుకు వన్‌టౌన్‌లోని కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఈమేరకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ దివాకర్ సుకుల్ శనివారం సమాచారం పంపించారు. దీనిపై పాఠశాల కార్యదర్శి కూరపాటి నారాయణ రావు మాట్లాడుతూ 1993 నుంచి 2023 వరకు లక్షకు పైగా జాతకాలు పరిశీలించినందుకు యుగంధరాచార్య రికార్డు సాధించారని, ఇందుకు ఆయనకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. సహకార్యదర్శి చంటి, అధ్యాపకబృందం, విద్యార్థుల తల్లిదండ్రులు యుగంధరాచార్యకు అభినందనలు తెలిపారు.

తిరుమల లడ్డూను అపవిత్రం చేయడం దుర్మార్గం: ఎరుబోతు

అజిత్‌సింగ్‌నగర్: కోట్లాది మంది భక్తులు అత్యంత ప్రీతిపాత్రంగా, భక్తి భావంతో స్వీకరించే తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వును కలపడం దుర్మార్గపు చర్యని టీడీపీ నాగవంశ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక్క తిరుమల లడ్డూ తయారీలోనే ఇలా జరిగిందా లేక రాష్ట్రంలోని అన్ని సుప్రసిద్ధ దేవాలయాల లడ్డూ తయారీలోనూ వైసీపీ నేతలు ప్రయత్నించారా అనే కోణంలో విచారణ జరిపించాలని కోరారు. ఈ కల్తీ నెయ్యికి కారణమైన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బీమా క్లెయిమ్‌లపై రవాణా శాఖ పర్యవేక్షణ

బస్టేషన్: వరద ముంపునకు గురైన వాహనాల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను త్వరగా పొందేందుకు రవాణా శాఖ పర్యవేక్షణ చేస్తోందని రవాణా కమిషనరేట్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బీమా కంపెనీలతో సమావేశాలు నిర్వహించి 4,836 పాలసీదార్లకు రూ.1,730.19 లక్షలు అందజేశారన్నారు. 65 సర్వీసింగ్ సెంటర్లలో 2,258 వాహనాలను లోకల్ మెకానిక్‌ల సాయంతో 4,676 వాహనాలను మరమ్మతు చేయించారన్నారు. ఇతర జిల్లాల నుంచి 67 మంది మోటార్ వాహన తనిఖీ అధికార్లను నగరానికి రప్పించి ప్రతి 5 సర్వీసింగ్ స్టేషన్లకు ఒక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్‌ను కేటాయించి రిపేర్లను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. శిశువు మృతి

పాత ప్రభుత్వాసుపత్రి వద్ద బాధితుల ఆందోళన



పాత ప్రభుత్వాసుపత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన, శాంతపరుస్తున్న సౌత్ ఏసీపీ

వన్‌టౌన్, సెప్టెంబరు 21: ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మగశిశువు మృతి చెందాడని ఆ శిశువు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు శనివారం హనుమాన్‌పేటలోని పాత ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేశారు. సౌత్‌జోన్ ఏసీపీ యూ బంగార్రాజు ఆసుపత్రి వద్దకు వెళ్లి మృతిచెందిన శిశువు తండ్రి, బంధువులతో మాట్లాడారు. ఈ సంఘటన వివరాల మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన బి.మనోహర్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ భార్య ఐశ్వర్య (26), కుమార్తెతో ఉంటున్నాడు. ఐశ్వర్య రెండో కాన్పు నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం 1.40 గంటలకు హనుమాన్‌పేటలోని పాత ప్రభుత్వాసుపత్రిలో చేరింది. మధ్యాహ్నం 2.24 గంటలకు మగబిడ్డకు జన్మనిచ్చింది. వైద్యులు ఆ శిశువును ఎన్‌ఐసీయూ యూనిట్‌కు తరలించారు. శిశువు బరువు 2 కేజీల 600 గ్రాములుంది. శనివారం ఉదయం 10.30 గంటలకు వైద్యులు ఐశ్వర్యకు జన్మించిన మగబిడ్డకు గుండెలో బెజ్జం (హోల్) ఉందని చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు శిశువు చనిపోయిందని చెప్పారు. దీనిపై బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం మగబిడ్డ బాగున్నాడని, తరువాత చనిపోయాడని చెప్పటంపై మనోహర్, అతడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు చనిపోయాడని ఆరోపించారు. సౌత్‌జోన్ ఏసీపీ యూ బంగార్రాజు, గవర్నర్‌పేట ఇన్‌చార్జి సీఐ ఆలీ, ఎస్‌ఐలు ఆసుపత్రి వద్దకు వెళ్లారు. ఆందోళన చేస్తున్న మనోహర్, అతడి కుటుంబ సభ్యులతో ఏసీపీ మాట్లాడి న్యాయం చేస్తానని నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు. వైద్యులు మాట్లాడుతూ ఐశ్వర్యకు 7వ నెలలో స్కానింగ్ తీయగా శిశువు గుండెకు హోల్ ఉన్నట్టు రిపోర్టులో ఉందన్నారు. అప్పటికీ వైద్యులు, సిబ్బంది శిశువుకు జాగ్రత్తగా చికిత్స అందించారన్నారు.

4, 5, 6 తేదీల్లో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి

గుణదల, సెప్టెంబరు 21: రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 4, 5, 6న నగరంలో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో - 2024 నిర్వహించనున్నట్టు రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి తెలిపారు. రామవరప్పాడు రింగ్‌రోడ్డు వద్దగల హోటల్ హయత్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రియేటర్స్ ఈవెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ కన్వెన్షన్ నందు మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో జరగనుందన్నారు. రెస్టారెంట్స్ పెట్టాలనుకునే వారికి కమర్షియల్ కిచెన్ ఎక్విప్‌మెంట్, ఇంటికోసం హోమ్ అప్లయన్సెస్, ప్యాకింగ్, సీలింగ్ మెషినరీ, మిల్క్ ప్రొడక్ట్స్ ఇలా ఫుడ్‌కి సంబంధించిన 120 స్టాల్స్ వరకు ఇక్కడ ఏర్పాటవుతాయనానరు. అలాగే 4 కారు ఎక్స్‌పో, లైవ్ ఫుడ్ స్టాల్స్, ఫన్ యాక్టివిటిస్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతాయన్నారు. వివరాలకు 9390672333, 7075183325, 9848677606 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కర్‌రావు, హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, ఏపీ కేటరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వరదరాజులు, ఎక్స్‌పో కో-స్పాన్సర్ ఎమ్వీఆర్ రైస్ అధినేత ఎం వెంకటేశ్వరరావు, ఈవెంట్ నిర్వాహకులు ఉమామహేశ్వరరావు, రేణుకా శ్రీదేవి పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నతస్థానాల్లో నిలవాలి

- టీటీ రాష్ట్రస్థాయి పోటీలను ప్రారంభించిన భానుమూర్తి రాజు



టోర్నీని ప్రారంభిస్తున్న భానుమూర్తి రాజు

విజయవాడ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: క్రమశిక్షణ, నిబద్ధత క్రీడలతో అలవడుతుందని, తద్వారా జీవితంలో ప్రతీ క్రీడాకారుడు ఉన్నతస్థానాల్లో నిలవడానికి అవకాశం ఉంటుందని రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి భానుమూర్తి రాజు పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-19 టేబుల్ టెన్నిస్ పోటీలు స్థానిక పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 12 జిల్లాల నుంచి 150 మంది బాలబాలికలు, అధికారులు పాల్గొన్నారన్నారు. తొలుత క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించారు. నిర్వాహకులైన స్కూల్‌గేమ్స్ అండర్-19 సెక్రటరీ వీ రవికాంత, జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, డీఐఈవో సాల్మన్‌రాజు సత్కరించారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీలు కే రాధాకృష్ణ, ఏపీ రాజు పాల్గొన్నారు.

బాలురలో తూర్పు.. బాలికల్లో కృష్ణా టాప్

తొలిరోజు టీమ్ ఈవెంట్‌లో బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, గుంటూరు (ద్వితీయ), కృష్ణా (తృతీయ) స్థానాలను వశం చేసుకున్నారు. బాలికల విభాగంలో కృష్ణా (ప్రథమ), గుంటూరు (ద్వితీయ), తూర్పుగోదావరి (తృతీయ) స్థానాల్లో నిలిచారు. రెండోరోజు ఆదివారం వ్యక్తిగత టేబుల్ టె న్నిస్ పోటీలు జరుగుతాయి. అనంతరం ప్రతిభ చాటిన క్రీడాకారులతో రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తారు.

బాలుడికి టైఫాయిడ్

- సీఎం చంద్రబాబుకు చేరిన సమాచారం
- బాలుడి ఇంటికి పరుగులు తీసిన అధికారులు
- 11 రోజుల తర్వాత క్షేమంగా ఇంటికి..



విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒక బాలుడు టైఫాయిడ్‌తో బాధపడుతున్నాడు. అంతే అధికారులు ఆగమేఘాలపై బాలుడి ఇంటికి పరుగులు తీశారు. ఆ బాలుడి ఆరోగ్యం విషయం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లడమే దీనికి కారణం. 11 రోజుల క్రితం పాతరాజేశ్వరిపేటకు చెందిన మూడేళ్ల బాలుడు దేవాన్ష్ టైఫాయిడ్‌తో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు వివిధ ఆసుపత్రులకు తిప్పినా తగ్గలేదు. రక్తంలో హిమోగ్లోబిన్ 4శాతానికి పడిపోయింది. ఈ విషయం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. సీఎం పేషీ అధికారులు జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. వైద్య సిబ్బందిని ఇంటికి పంపి పరీక్షలు చేయించారు. మెరుగైన చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి ఎల్‌వోసీ ఇప్పించారు. 11రోజులు చికిత్స పొందిన బాలుడు కోలుకోగా వైద్యులు శనివారం ఇంటికి పంపారు. బాలుడి తల్లిదండ్రులు సీఎంవో సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సత్తా చాటిన కృష్ణాజిల్లా ఎడ్లు

- సబ్ జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానం



అక్కినేని సత్యచౌదరికి బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే బూర్ల

ప్రత్తిపాడు, సెప్టెంబరు 21: జాతీయ ఎడ్లుల బండలాగుడు పోటీలు ప్రత్తిపాడులో రసవత్తరంగా సాగుతున్నాయి. శనివారం సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం, మల్లవల్లి గ్రామానికి చెందిన అక్కినేని సత్య చౌదరి ఎడ్డుల జత 4500 దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన నల్లూరి కృష్ణయ్య చెందిన ఎడ్డులు 3900 అడుగుల దూ రం ద్వితీయ, పల్నాడు జిల్లా నదేండ్లకు చెందిన దేవభక్తుని శ్రీకాంత్ ఎడ్డుల జత 3757.2 అడుగుల దూరం లాగి తృతీయస్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా పెనుమలూరు మండలం, పెద్దపులిపాకకు చెందిన గరికపాటి శ్రీధర్ ఎడ్డుల జత 3000 అడుగుల దూరం లాగి 8వ స్థానంలో నిలిచాయి. విజేతలకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు బహుమతులు అందజేశారు.



ద్విచక్ర వాహనాలు సహా నిందితుల అరెస్టు చూపిస్తున్న పోలీసులు

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

- రూ.6లక్షలు ఖరీదు చేసే 10 ద్విచక్రవాహనాల స్వాధీనం

గుణదల, సెప్టెంబరు 21: ద్విచక్ర వాహనాలు చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ 6లక్షల ఖరీదు చేసే 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్ తెలిపారు. పటమట పోలీస్ స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీ ఎస్వీ రాజశేఖర్ ఆదేశాల మేరకు నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడేవారిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆటోనగర్ కామినేని నగర్‌లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారన్న సమాచారంతో పటమట సీఐ పవన్ కిషోర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 10 వాహనాలను చోరీ చేసిన నిందితులుగా గుర్తించామన్నారు. చోరీ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి నిందితులు పెనమలూరుకు చెందిన దమ్ము కిరణ్ జోజి (20), కానూరుకు చెందిన కెంగువ మనికంఠ (19)ను కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు.



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రైల్వే అధికారులు

టెన్నిస్‌లో వెటరన్స్ డబుల్స్ టైటిల్

వన్‌టౌన్, సెప్టెంబరు 21: 70వ ఆలిండియా రైల్వే టెన్నిస్ టోర్నమెంట్‌లో వెటరన్స్ విభాగంలో గుంటూరు జిల్లా అమరావతిలోని ఆర్‌సీటీ అదనపు రిజిస్ట్రార్ కె.రాజేంద్రప్రసాద్, ఎలక్ట్రికల్ మెయింటినెన్స్ టెక్నీషియన్ సంపత్‌కుమార్ డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఈనెల 17 నుంచి 21 వరకు చెన్నైలోని ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీలో రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు నిర్వహించిన టోర్నమెంట్‌లో డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఆసక్తికరంగా సాగిన ఫైనల్‌లో దక్షిణమధ్య రైల్వేకు చెందిన శ్రీనివాసరావు, మునీర్‌ను ఓడించారు. ఆర్‌సీటీ అదనపు రిజిస్ట్రార్ కె.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తమ టీమ్‌వర్క్‌తో టెన్నిస్‌లో నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను గెలుచుకున్నట్టు తెలిపారు.



ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన వర్క్‌షాపులో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

యువతకు ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టాలి

- ఏఐఎస్ఎఫ్ వర్క్‌షాపులో లక్ష్మీనారాయణ

గవర్నర్‌పేట, సెప్టెంబరు 21: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేయడంతో పాటు స్థానిక వనరులు ఉపయోగించడం ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వాలు దృషి పెట్టాలని సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్క్‌షాపులో భాగంగా శనివారం లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ అధికారుల సంఘ భవన్‌లో జరిగిన సమావేశంలో ఏపీ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి యువత ముందున్న బాధ్యతనే అంశంపై లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి సాధించాలంటే రాష్ట్రంలో ఉన్న చిన్న, మధ్య తరహా, భారీ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీ విద్యా విభాగం డైరెక్టర్ ఎల్వీకే ప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, నక్కి. లెనిన్‌బాబు, నేతలు ఎం. యుగంధర్, సంతోష్‌కుమార్, ఎంవీ సుబ్బారావు, కత్తి రవి, షేక్ సుభానీ, వై. బాజీ, లంకా గోవిందరాజులు ప్రసంగించారు.

గొలుసు దొంగను పట్టుకున్న రైల్వే పోలీసులు



రైల్వేస్టేషన్, సెప్టెంబరు 21: రైళ్లలో ప్రయాణికుల నుంచి గొలుసులు దొంగతనాలకు పాల్పడిన ఉత్తరప్రదేశ్ ఉన్నావ్ జిల్లాకు చెందిన సూర్యపాల్ సింగ్ (34)ను రైల్వే పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు. ఇతడి నుంచి రూ.1,02,000 విలువైన 34 గ్రాముల బంగారు మంగళసూత్రాల గొలుసు, రూ.70 వేల విలువ గలిగిన శాంసంగ్ మొబైల్ ఫోన్, రూ.15వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

దసరా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ రాజశేఖర్ బాబు

వన్‌టౌన్, సెప్టెంబరు 21: దుర్గగుడిలో అక్టోబరు 3 నుంచి దసరా మహోత్సవాల ఏర్పాట్ల పనులను శనివారం పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం భక్తులు సౌకర్యార్థం అధికారులు చేపట్టిన ఏర్పాట్లను ఇంజనీరింగ్, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఘాట్ రోడ్డు, ఓం టర్నింగ్ నుంచి ఉచిత, రూ.100, రూ.300, రూ.500 క్యూలు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, వీఐపీ క్యూ, దేవస్థానం లోపల క్యూలు, కౌంటర్లను పరిశీలించారు. పూజలనంతరం ఉభయదాతల క్యూలైన్ల ఏర్పాటను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. సీపీ వెంట డీసీపీ గౌతమీశాలి, ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావు, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు

ఐరన్ మెట్ల ఏర్పాటు పనులు వేగవంతం

దుర్గగుడిలో అక్టోబరు 3 నుంచి జరగనున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శివాలయం మెట్ల పక్కన ఐరన్ మెట్లను ఏర్పాటుకు ఇంజనీరింగ్ అధికారులు పనులు వేగవంతం చేశారు. శివాలయం మెట్ల పక్క దిగువన నూతనంగా అన్నదాన భవన నిర్మాణం చేస్తున్నారు. ప్రతి ఏడాది దసరా, భవానీదీక్షలు పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకున్న భక్తులు శివాలయం మెట్ల మార్గం నుంచి కిందకు దిగనున్నారు. అయితే అన్నదాన భవన నిర్మాణంతో ఆ మార్గం నుంచి కిందకు దిగే అవకాశం లేదు. దీంతో అధికారులు భక్తులకు ఇబ్బంది లేకుండా మెట్ల పక్కనున్న ఖాళీస్థలంలో ఐరన్ మెట్ల ఏర్పాటుకు పనులు వేగవంతంగా చేశారు. ఏర్పాట్లను సిటీ స్పెషల్ బ్రాంచి సీఐలు మహేంద్ర, చంద్రశేఖర్ పరిశీలించి దేవస్థానం ఏఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సింహాచలంలోనూ కల్తీ నెయ్యే

- ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రాథమిక నిర్ధారణ
- వాసన లేదు.. రంగులో తేడా.. 945 కిలోలు సీజ్

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో ప్రసాదాల తయారీకి వినియోగిస్తున్న నెయ్యి కల్తీదని ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. తిరుమలలో లడ్డూల తయారీకి కల్తీ నెయ్యి ఉపయోగిస్తున్నట్టు వార్తలు రావడంతో సింహాచలం దేవస్థానంలో పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీసింది. ఇక్కడ కూడా లడ్డూ తయారీకి నెయ్యి కిలో రూ.344 చొప్పున కొంటున్నట్టు అధికారులు తెలిపారు. అంత తక్కువ ధరకు నెయ్యి ఎలా వస్తుందని 'ఆంధ్రజ్యోతి' శనివారం కథనం ప్రచురించడంతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సింహాచలం వెళ్లి తనిఖీలు నిర్వహించారు. కాంట్రాక్టర్ సరఫరా చేసిన నెయ్యికి వాసన లేదు. రంగు తేడాగా కనిపించింది. దీంతో అందులో కల్తీ ఉందని డివిజన్-3 ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జీవీ అప్పారావు స్పష్టంచేశారు. అందులో వనస్పతి కలిపినట్టు గుర్తించారు. చేతికి రంగు అంటుకోవడంతో అందులో కలర్ కలిపినట్టు తేల్చారు. కల్తీ నెయ్యేనంటూ పరీక్షల కోసం నమూనాలు తీసుకున్నారు. కాంట్రాక్టర్ నుంచి వచ్చిన 945 కిలోల నెయ్యిని సీజ్ చేశారు. శెనగపిండి నమూనాలు కూడా తీసుకున్నామన్నారు.



లడ్డూ ప్రసాదాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం లడ్డూ రుచిగా లేదు

- అప్పన్న ప్రసాదాలకు పూర్వవైభవం తెస్తాం: ఎమ్మెల్యే గంటా

సింహాచలం, సెప్టెంబరు 21: సింహాచలం దేవస్థానంలో వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యం నివేదన చేసి భక్తులకు విక్రయాలు జరిపే లడ్డూ రుచిగా లేదని, సువాసన రావడం లేదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అప్పన్న దేవస్థానంలో ప్రసాదాల నాణ్యతను శనివారం ఆయన పరిశీలించారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలను రుచి చూశారు. గతంతో పోలిస్తే లడ్డూ రుచి లేదని, నెయ్యి వాసన అసలే రావడం లేదని చెప్పారు. మార్కెట్‌లో ఎక్కడా లేనివిధంగా అతితక్కువ ధర (కిలో రూ.344)కు సరఫరా చేయగలగడం వెనుక ఆంతర్యం అవగతమవుతోందన్నారు. ఇంత జరుగుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏం చేస్తున్నట్టు అంటూ వారిని నిలదీశారు. శనివారం తనిఖీ నిర్వహించే సమయానికి స్టోర్స్‌లో ఉన్న 63 డబ్బాల నెయ్యిని నాణ్యతా పరీక్షల రిపోర్టు వచ్చేవరకు వినియోగించరాదంటూ అధికారులను ఆదేశించారు. ఆ తరువాత నిత్యాన్న ప్రసాద పథకంలో భాగంగా భక్తులకు పెడుతున్న భోజనాన్ని గంటా రుచి చూశారు. గాడితప్పిన వ్యవస్థను సరిచేసి తిరిగి అప్పన్న ప్రసాదాలకు పూర్వవైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అప్పన్న ఆలయంలో కూడా పండితులతో చర్చించి సంప్రోక్షణ కార్యక్రమాన్ని చేపట్టాలని దేవస్థానం ఈవోను ఆయన ఆదేశించారు.

తాడేపల్లి బ్యాచ్ ఎంతకైనా తెగిస్తుంది: డొక్కా

తుళ్లూరు, సెప్టెంబరు 21: కిరాయి కోసం తాడేపల్లి కల్కి కాంపెక్స్‌లో ఉన్న వైసీపీ బ్యాచ్ ఎంతకైనా తెగిస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం రాజధానిలోని వెంకటపాలెంలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన తుళ్లూరులో విలేకరులతో మాట్లాడారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారని, కిరాయి కోసమే సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు ఐపీఎస్‌లు ముంబై నటి జెత్వానీపై అక్రమ కేసు పెట్టారని అన్నారు. సజ్జల తనను కూడా కొన్ని దుర్మార్గపు పనులు చేయమన్నారని, అయితే అది తనకు నచ్చలేదని పేర్కొన్నారు. ఆలయానికి వస్తే వాళ్లు చేసిన దుర్మార్గాలపై ప్రమాణం చేస్తానని డొక్కా సవాల్ చేశారు.

అఖండ గోదావరి పేరుతో పర్యాటక సర్క్యూట్

- జనవరిలో కాకినాడ, వైజాగ్‌లో బీచ్ ఫెస్టివల్: కందుల దుర్గేష్

కాకినాడ, సెప్టెంబరు 21: పర్యాటక ప్రాంతాలు, ప్రముఖ దేవాలయాలను అనుసంధానం చేస్తూ అఖండ గోదావరి పేరుతో సర్క్యూట్ ఏర్పాటు చేసి సందర్శకులు, యాత్రికులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా కాకినాడ రూరల్‌లోని ఎన్టీఆర్ బీచ్‌ను స్థానిక ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే పంతం నానాజీతో కలసి శనివారం ఆయన సందర్శించారు. జనవరిలో కాకినాడ, వైజాగ్‌లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. సాగర తీర అందాలు, దేవాలయాలు, ప్రకృతి శోయగాల వైపు పర్యాటకులను మరింత ఆకర్షించేలా కాకినాడ జిల్లా, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఉన్న ప్రముఖ దేవాలయాలు, ఏకో టూరిజం, ఎడ్వంచర్ టూరిజంతో కలిపి అఖండ గోదావరి సర్క్యూట్ ఏర్పాటు చేస్తామన్నారు.

విజయసాయిరెడ్డి నీతులు చెప్పడం విడ్డూరం!

- జగన్‌తోపాటు వైసీపీ నేతలు త్వరలో జైలుకు : బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 21: చంద్రబాబు, లోకేశ్‌లను విమర్శిస్తూ ట్వీట్ చేసిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శలు గుప్పించారు. శనివారం విజయవాడలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుద్దా వెంకన్న మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకే విజయసాయిరెడ్డి 'ఎక్స్'లో పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. తప్పుడు లెక్కలు రాసి 16 నెలలు జైలులో ఉన్న విజయసాయిరెడ్డి నీతులు చెప్పటం విడ్డూరమన్నారు. జగన్, విజయసాయిరెడ్డితో పాటు మరికొందరు వైసీపీ నేతలు త్వరలోనే జైలుకు వెళతారన్నారు. వైసీపీకి ఉన్న 11 మంది ఎమ్మెల్యేల్లో 10 మంది టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. జైలులో మళ్లీ చిప్పకూడు తినేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

అన్న క్యాంటీన్లకు టీడీపీ జెండా రంగులు వేయకుండా నిలువరించాలని పిల్

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లకు తెలుగుదేశం పార్టీ జెండా రంగులు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదంటూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఏపీఎన్జీవో సంఘం పూర్వ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఈ పిల్ దాఖలు చేశారు. ఇకపై ప్రారంభించే అన్న క్యాంటీన్లు, ఇతర ప్రభుత్వ భవనాలకు టీడీపీ జెండా రంగులు వేయకుండా అధికారులు, టీడీపీ సభ్యులను నిలువరించాలని పిటిషన్‌లో కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి వ్యక్తిగత హోదాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, పురపాలక మంత్రి పి.నారాయణను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

విమానయాన ముఖచిత్రం మార్చేస్తాం: రామ్మోహన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో భారత విమానయాన ముఖచిత్రాన్ని మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. విమాన ప్రయాణాన్ని ప్రతి సామాన్యుడికీ అందుబాటులోకి తీసుకురావాలన్న తన లక్ష్యానికి ప్రధాని మోదీ వెన్నుదన్నుగా నిలిచారని ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు.

యువతిని 30 ముక్కలు చేసి.. ఫ్రిజ్‌లో దాచి

బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు వయ్యాలికావల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. ఓ ఇంట్లో యువతిని హత్యచేసి 30 ముక్కలు చేసి ఫ్రిజ్‌లో దాచారు. ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పదిరోజులకు ముందే హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. హతురాలి పేరు మహాలక్ష్మి అని సెంట్రల్ విభాగం ఏసీపీ సతీశ్ వెల్లడించారు. వేరే రాష్ట్రానికి చెందిన ఆమె ఇక్కడే స్థిరపడ్డారని, భర్తకు దూరమయ్యారని తెలిపారు. ఇంట్లో ఆమె ఒక్కరే నివసిస్తున్నారని తెలిపారు. రెండు రోజులుగా ఆమె ఇంటినుంచి దుర్వాసన వస్తుండడంతో అదే భవనంలో నివసించేవారు ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. యువతి అక్క, తల్లి ఇంటికి వచ్చి తలుపులు బద్దలుకొట్టారు. ఫ్రిజ్‌ను తెరిచి చూసి హత్య జరిగినట్లు గుర్తించారు. కొన్ని రోజులుగా ఆమెను పికప్, డ్రాప్ చేసేందుకు ఓ యువకుడు వచ్చేవాడని, అతడే దారుణానికి పాల్పడి ఉంటాడని ఏసీపీ తెలిపారు.

'లడ్డూ' వద్దా జగన్?

- అడ్డంగా బుక్ అయిన వైసీపీ అధినేత
- ఎప్పట్లాగే బెంగళూరు ప్యాలెస్‌కు పలాయనం
- ఐదేళ్ల అడ్డగోలుతనంపై శ్రేణుల్లోనూ అసహనం
- ఈ టైమ్‌లో ఏపీ దాటడంపై మరింత అసంతృప్తి
- తప్పు చేయకపోతే తన వాదన వినిపించవచ్చు
- ఇక్కడే ఉండి పోరాడవచ్చు కదా అంటూ ప్రశ్నలు

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఏ కష్టం వచ్చినా, తన చుట్టూ ఏ వివాదం రేగినా వైసీపీ అధినేత జగన్ బెంగళూరు చేరుకోవడం పరిపాటిగా మారింది. తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపిన వైనంపై దేశమంతా భగ్గుమంటున్న వేళ, యథాప్రకారం జగన్ బెంగళూరుకు వెళ్లిపోవడం ఆ పార్టీ శ్రేణులను సైతం అసంతృప్తికి గురిచేస్తోంది. విజయవాడకు కనీవినీ ఎరుగనిరీతిలో వరదలు వచ్చినప్పుడు కూడా... ఒక రోజు మొక్కుబడిగా బాధితులను కలుసుకుని, రెండో రోజే ఆయన బెంగళూరులోని యెలహంక ప్యాలెస్‌కు వెళ్లిపోయారు. లడ్డూ వ్యవహారంతో గతంలోని ఏ అంశంతోనూ పోల్చడానికి లేదని వైసీపీ శ్రేణులు అంటున్నాయి. ఇది ఎక్కడ తమను, వైసీపీని తిరుమల స్వామి భక్తుల ఆగ్రహ జ్వాలలకు బలి చేస్తుందోనని కలవరపడుతున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో జగన్ రాష్ట్రం దాటిపోవడం పట్ల వారు మరింత అసంతృప్తితో ఉన్నారు. తప్పు చేయకపోతే....లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిందంటూ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలను జగన్ ఖండించవచ్చు... తన వాదనను వినిపించవచ్చు... ఇక్కడే ఉండి పోరాడవచ్చు కదా అని ప్రశ్నలవర్షం కురిస్తున్నారు. అది వదిలేసి కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా పోవడం ఏమిటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. జగన్ ఫొటోను ఈ స్థాయిలో కాలితో తన్నుతూ .. చెప్పులతో కొడుతూ .. కాల్చిబూడిద చేయడం గతంలో చూడలేదని కొందరు వైసీపీ నేతలు చెబుతున్నారు. భక్తుల మనోభావాల విషయంలో రాజకీయపక్షాలు చాలా సున్నితంగా వ్యవహరిస్తాయని, ఒకసారి అవి దెబ్బతిని ఆగ్రహ జ్వాలలు రేగితే చల్లార్చడం కష్టమని ఆందోళన చెందుతున్నారు. లడ్డూ కల్తీ ప్రభావం .. వ్యక్తిగతంగాను, పార్టీపరంగాను తీవ్రంగా ఉండబోతోందని అంగీకరిస్తున్నారు.

యెలహంకకు జగన్ దంపతులు

వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి దంపతులు బెంగళూరులోని యెలహంక ప్యాలెస్‌కు చేరుకున్నారు. దాదాపు ప్రతి వారం శుక్రవారం అక్కడకు వెళ్లి, సోమవారం తిరిగి తాడేపల్లి ప్యాలెస్‌కు వారు చేరుకుంటున్నారు. పాస్‌పోర్టు ప్రతిబంధకంతో లండన్ పర్యటనను ఇప్పటికే వారు ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. మరోవైపు తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి ఉండటంతో హైదరాబాద్ లోటస్ పాండ్‌కు వెళ్లడాన్ని జగన్ దంపతులు తగ్గించేశారు. లోటస్ పాండ్ నివాసంలో జగన్‌ను ఎవరు కలిసినా క్షణాల్లో బయటకు పొక్కుతోంది. దీంతో తమ వారాంతాలను వారు బెంగళూరు యెలహంక ప్యాలెస్‌లో గడుపుతున్నారని చెబుతున్నారు. రాష్ట్రంలో అధికారం మారినప్పటినుంచీ రాజకీయ మంతనాలకు యెలహంక ప్యాలెస్ ప్రధాన అడ్డాగా మారింది. తెలంగాణలో మాదిరిగానే.. కర్ణాటకలోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంది. సాధారణంగా అయితే, తెలంగాణకు వెళితే ఎదురయ్యే ప్రతిబంధనాలే బెంగళూరులోనూ ఎదురు కావాలి. అయితే. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో జగన్‌కు అతి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెబుతున్నారు. దీనివల్లే నిఘా భయం లేకుండా యెలహంక ప్యాలెస్‌లో ఎవరితోనైనా స్వేచ్ఛగా సమావేశాలను నిర్వహించుకునే వీలు జగన్‌కు దొరకుతోందని అంటున్నారు. లడ్డూ వ్యవహారంలో జగన్ పూర్తిగా ఆత్మరక్షణలో పడ్డారు. ఈ సమస్య నుంచి బయటపడేమార్గాలను బెంగళూరు ప్యాలెస్ వేదికగా వెతికే పనిలో జగన్ ఉన్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

టీటీడీలో అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ

- వర్ల రామయ్య డిమాండ్



అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో టీటీడీలో జరిగిన అవినీతి, అక్రమాలు, దుర్మార్గాలపై వెంటనే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించాలని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సీఎం చంద్రబాబును కోరారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'జగన్ పాలనలో టీటీడీని అవినీతిమయం చేశారు. కల్తీ ప్రసాదం ఇచ్చి, భక్తుల నమ్మకాన్ని దెబ్బతీశారు. వైసీపీ మాఫియా టీటీడీ సొమ్మును దండుకుంది. టూరిజం శాఖకు టీటీడీ నుంచి వచ్చే స్వామివారి టికెట్లను బుక్ మై దర్శన్ పేరుతో మాజీ మంత్రి రోజా గోల్‌మాల్ చేసి, లక్షలు కాజేసింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో కళాధర్ ట్రావెల్స్ రోజూ 800 టికెట్లను గోల్‌మాల్ చేసింది. నాటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వామి వారి సేవకు బదులు అవినీతి మంత్రుల సేవలో తరించాడు. పోలీసులు దృష్టి పెట్టకపోతే.. ధర్మారెడ్డి విదేశాలకు పారిపోయే అవకాశముంది. వైవీ సుబ్బారెడ్డి తనపై విచారణ వద్దని హైకోర్టును ఆశ్రయిస్తే.. జగన్, బొత్స సత్యనారాయణ ఏ విచారణకైనా సిద్ధమనడం వైసీపీ నేతల దగుల్బాజీ తనానికి నిదర్శనం' అని విమర్శించారు.

అన్యమతస్థులే టీటీడీని దెబ్బతీశారు: ఆనంద్ సూర్య



హిందూ మతాన్ని దెబ్బతీసేందుకు జగన్ కుట్ర పన్నాడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య ఆరోపించారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్యమతస్థులు జగన్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి టీటీడీ పవిత్రతను మంటగలిపారని విమర్శించారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని ధ్వజమెత్తారు. రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహం తల నరికినా, అంతర్వేదిలో రథం తగలబెట్టినా, దుర్గమ్మ గుడిలో వెండి సింహాలు కొట్టేసినా జగన్ పట్టించుకోలేదని మండిపడ్డారు. వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా ప్రమాణం చేసినప్పుడు తన భార్య చేతిలో ఏ గ్రంథం ఉందో అందరూ చూశారని, ఆ గ్రంథంపై ప్రమాణం చేసి, శ్రీవారి ప్రసాదాల్లో అపచారం జరగలేదని వైవీ సుబ్బారెడ్డి చెప్పగలడా అని నిలదీశారు. కల్తీ ఆవు నెయ్యి కుట్రలో వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి పాత్ర ఉందని, కమీషన్ల కక్కుర్తితోనే అపచారానికి పాల్పడ్డారని ఆరోపించారు.



మహాగణపతి విగ్రహం వద్ద అఖండ దీపారాధనను ప్రారంభిస్తున్న వద్దిపర్తి పద్మాకర్

తిరుమల లడ్డూకు అపవిత్రత తొలగాలి

- మహా గణపతి విగ్రహం వద్ద అఖండ దీపారాధన

విజయవాడ, సెప్టెంబరు 21: తిరుమల లడ్డూ అపవిత్రం అయ్యిందని, దీనికి విఘ్నాలు తొలగాలని కోరుతూ విజయవాడ విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్స్‌లో కొలువైన 72 అడుగుల విజయ మహాగణపతి విగ్రహం వద్ద డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో అఖండ దీపారాధనను శనివారం రాత్రి నిర్వహించారు. మహా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ ఈ అఖండ దీపారాధనను ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్ఎల్‌వీ రాజు, డూండీ రాకేశ్ పాల్గొన్నారు.

దేవుడి శిక్షను తప్పించుకోలేరు: బ్రహ్మం చౌదరి

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రసాదంతో ఆడుకున్న జగన్ అండ్ కో టీమ్‌కు దేవుడి సన్నిధిలో శిక్ష తప్పదని టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మంచౌదరి హెచ్చరించారు. వైసీపీ నేతలు చేసిన తప్పుడు పనుల వల్ల కోట్ల మంది ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. తప్పు చేయకపోతే వైవీ సుబ్బారెడ్డి విజిలెన్స్ విచారణ ఆపమని కోర్టుకు ఎందుకు వెళ్లాడని నిలదీశారు. జగన్ టీమ్ అక్రమాలన్నీ ఎప్పటికైనా బయటకు వస్తాయని స్పష్టం చేశారు.

నాణ్యమైన నెయ్యి అందిస్తాం

- ఇతర పాల ఉత్పత్తులు కూడా ఇచ్చేందుకు విజయ డెయిరీ సిద్ధం
- టీటీడీ ఈవోకు తెలంగాణ పశుసంవర్ధక శాఖ లేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి అవసరమైన నెయ్యితో పాటు, ఇతర పాల ఉత్పత్తులను విజయ డెయిరీ తరఫున సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ పశుసంవర్ధక శాఖ పేర్కొంది. ఈ మేరకు శనివారం శాఖ ముఖ్య కార్యదర్శి సబ్యసాచి ఘోష్ టీటీడీ ఈవో శ్యామలరావుకు లేఖ రాశారు. నెయ్యి సరఫరా కోసం అవకాశం ఇవ్వాలని, దేవస్థానానికి, భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. అధిక నాణ్యత గల నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల అవసరాలను తీర్చడానికి విజయ డెయిరీ సిద్ధంగా ఉందని తెలిపారు.

తమిళనాట 2 డెయిరీల్లో తనిఖీలు

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని దిండుగల్ జిల్లాలో ఉన్న రెండు ప్రైవేటు డెయిరీల్లో కేంద్ర ఆహార భద్రతా విభాగం ఉన్నతాధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. దిండుగల్‌లోని ఏఆర్ డెయిరీ సంస్థ టీటీడీకి గతంలో నెయ్యి సరఫరా చేసింది. ఆ డెయిరీలో నెయ్యి తయారు చేసే విభాగంలో సుమారు రెండు గంటలపాటు తనిఖీలు చేసి, నెయ్యి, వెన్న, పెరుగు నమూనాలు సేకరించారు. అలాగే జిల్లాలోని సెంధురై పళనిపట్టి ప్రాంతంలో ఉన్న రాజ్ మిల్క్ ఫ్యాక్టరీలోనూ తనిఖీలు నిర్వహించి, శాంపిళ్లను సేకరించారు.

నెయ్యి వాహనాలకు జీపీఎస్: కేఎంఎఫ్

బెంగళూరు, సెప్టెంబరు 21: తిరుమల పంపే నెయ్యి వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ఉన్నతాధికారి తెలిపారు. టీటీడీకి నెల రోజుల క్రితం నెయ్యి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆ సంస్థ ఎండీ ఎంకే జగదీశ్ చెప్పారు. వాహనాలకు జీపీఎస్‌తో పాటు జియో లొకేషన్ పరికరాన్ని అమర్చాం అన్నారు.

నెయ్యి కల్తీపై సీబీసీఐడీ విచారణ

- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో ప్రసాదం తయారీకి తక్కువ ఖరీదు నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారని, దీనిపై సీబీసీఐడీ విచారణ చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన సింహాచలం దేవస్థానానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. జీఎస్టీతో కలుపుకొని కిలో రూ.385కి కొనుగోలు చేస్తున్నట్టు తేలిందని, అంత తక్కువ ధరకు నెయ్యి ఎలా వస్తుందని ప్రశ్నించారు.

హమాస్, హిజ్బుల్లాపై ఇజ్రాయెల్ ముప్పేట దాడులు

టెల్అవీవ్, సెప్టెంబరు 21: హమాస్, హిజ్బుల్లా ఉగ్రవాదులే లక్ష్యంగా ఇజ్రాయెల్ శనివారం ముప్పేట దాడులు చేసింది. గాజాతోపాటు.. దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వైమానిక దళం క్షిపణుల వర్షం కురిపించింది. శుక్రవారం బీరుట్‌లోని హిజ్బుల్లా ఉగ్రవాదులను టార్గెట్‌గా చేసుకున్న దాడుల్లో.. ఓ భవనం కుప్పకూలిన విషయం తెలిసిందే.! ఈ ఘటనలో మరణాలు 37కు చేరుకున్నాయని.. 68 మంది గాయపడ్డారని లెబనాన్ రవాణా మంత్రి అలీ హమీద్ తెలిపారు. అమెరికా రూ.58 కోట్ల(7 మిలియన్ డాలర్లు) రివార్డు ప్రకటించిన రద్వాన్ బ్రిగేడ్ కమాండర్ ఇబ్రహీం అఖిల్ కూడా మృతుల్లో ఉన్నారు. అటు దక్షిణ గాజాలో ఓ శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన బాంబింగ్‌లో 22 మంది మృతిచెందారు.

పీఆర్ బదిలీల్లో సిఫారసులకు చెక్

- గ్రామీణాభివృద్ధి శాఖలో బదిలీల ప్రక్రియ కొలిక్కి
- రాజకీయ జోక్యం, పైరవీలకు డిప్యూటీ సీఎం పవన్ చెక్
- సుదీర్ఘ కసరత్తుతో సమర్థులైన అధికారుల నియామకం!
- డ్వామా పీడీ, జడ్పీ సీఈఓలుగా పీఆర్ అధికారులే
- ఇతర శాఖల నుంచి వచ్చిన వారికి నో ఎంట్రీ
- సొంత జిల్లాల వారికీ నో చాన్స్.. నేడో రేపో ఉత్తర్వులు

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు సంబంధించి బదిలీల ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, డైరెక్టర్ కృష్ణ తేజ, పంచాయతీరాజ్ అధికారులు రెండు రోజులుగా కసరత్తు చేసి బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. ఉపముఖ్యమంత్రి తన శాఖకు సంబంధించి రాజకీయ జోక్యం, పైరవీలకు తావు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు సమాచారం. సొంత పార్టీ వాళ్లను సైతం అధికారుల బదిలీల విషయంలో జోక్యం చేసుకోకుండా కట్టడి చేశారు. కేంద్రం నుంచి గ్రామీణాభివృద్ధి శాఖకు భారీగా నిధులు సమీకరిస్తున్నందున ఆ నిధులను సక్రమంగా ఖర్చు చేసి అభివృద్ధి పరుగులు పెట్టించగలిగే సమర్థవంతమైన అధికారులను నియమించుకోవాలని నిర్ణయించారు. రెండు విషయాల్లో పట్టుదలగా కఠినంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఇతర శాఖలకు సంబంధించిన అధికారులను ఈ దఫా డ్వామా పీడీలు, జడ్పీ సీఈఓలు నియమించుకోరాదని నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో పాటు సొంత జిల్లాకు చెందిన అధికారులు ఆ జిల్లాల్లో పనిచేయరాదన్న నిబంధనలను గట్టిగా అమలు చేసినట్లు సమాచారం. ఒకటీ, రెండు బదిలీల విషయాల్లో తప్ప మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఈ నిబంధనలు కఠినంగా అమలు చేసినట్లు తెలిసింది. 26 జిల్లాలకు సంబంధించి డ్వామా పీడీలు, జడ్పీ సీఈఓలు, డీఎల్‌డీఓలు, డీపీఓ పోస్టుల విషయంలో పవన్‌కల్యాణ్ స్వయంగా బదిలీలను పర్యవేక్షించారు. జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలిచ్చినా.. ఆయా అధికారుల అనుభవం, ట్రాక్‌రికార్డు, సమర్థతను పరిగణనలోకి తీసుకుని ఈ కసరత్తు చేసినట్లు తెలిసింది. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ప్రతి అధికారి సమర్థత, నిజాయితీల గురించి తెలిసిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ వెంకటకృష్ణ ఈ బదిలీల విషయంలో పూర్తిస్థాయి కసరత్తు చేశారు. ఏ అధికారి ఏ పోస్టుకు సమర్థులో చర్చించి నియమించినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం డ్వామా పీడీలు, జడ్పీ సీఈఓల బదిలీల విషయంలో అడ్డగోలుగా వ్యవహరించిన విషయం తెలిసిందే. అప్పట్లో జైలు అధికారులు, రిటైర్ అయిన అధికారులు, గ్రామీణాభివృద్ధిశాఖకు సంబంధించి ఎలాంటి అవగాహన లేని ట్రెజరీ అధికారులు కూడా డ్వామా పీడీలుగా వ్యవహరించారు. దీంతో గత ఐదేళ్లు పలు జిల్లాల్లో ఉపాధి హామీ పథకం మొక్కుబడిగా మారింది. డ్వామా కార్యాలయాలు అవినీతికి నిలయంగా మారాయి. సాక్షాత్తు ఉపాధి హామీ పథకం డైరెక్టరే రిటైర్ అధికారి కావడంతో ఎక్కడా జవాబుదారీ లేకుండా పోయింది. ఆ పరిస్థితి నుంచి గట్టెక్కడానికి అధికారుల నియామకంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి దృఢమైన అభిప్రాయంతో ఉన్నట్లు తెలిసింది. అవినీతి అధికారుల విషయంలో ఆయన కఠినంగా వ్యవహరించినట్లు చెప్పుకొంటున్నారు. అవినీతి ట్రాక్ రికార్డు ఉన్న అధికారులను డ్వామా పీడీలుగా, జడ్పీసీఈఓలుగా నియమించకుండా అడ్డుకున్నారు. గతంలో డ్వామా పీడీలుగా, జడ్పీ సీఈఓలుగా పనిచేసిన కొంత మందికి ఈ దఫా కూడా అవకాశం దక్కినా, వారి సేవలు ఇతర జిల్లాల్లో వాడుకునేలా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.



అనంతపురం జిల్లా గడేకల్లు ప్రజా వేదికపై ప్రసంగిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అప్పుల్లో ఉన్నా.. హామీలన్నీ నెరవేరుస్తాం

- కన్నయ్య నాయుడుకు త్వరలో సన్మానం: మంత్రి పయ్యావుల

విడపనకల్లు, సెప్టెంబరు 21: రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలంలోని గడేకల్లులో శనివారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజావేదికలో ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడే సమయానికి రాష్ట్రం వేల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. రాష్ట్రంలో ఆదాయం అంతంత మాత్రమే ఉందని, అప్పులు కట్టాల్సి పరిస్థితిలో రాష్ట్రం ఉందని, అయినా ప్రతి హామీని నెరవేరుస్తామని చెప్పారు. తుంగభద్ర డ్యాం గేటు వరదలకు కొట్టుకుపోతే.. వారం రోజుల్లో స్టాప్‌లాగ్‌ను ఏర్పాటు చేయించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. స్టాప్ లాగ్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన కన్నయ్యనాయుడును రైతుల తరఫున సన్మానం చేయాల్సి బాధ్యత తమపై ఉందని మంత్రి చెప్పారు.

జగన్‌కు కఠిన శిక్ష పడాల్సిందే: మంత్రి సవిత

హిందూపురం, సెప్టెంబరు 21: కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన మాజీ సీఎం జగన్‌కు కఠిన శిక్ష పడాల్సిందేనని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. తిరుమల లడ్డూను కల్తీ నెయ్యితో తయారు చేయించడం దుర్మార్గమని మండిపడ్డారు. వేంకటేశ్వరస్వామి ప్రసాదంతో ఆడుకున్న జగన్ అండ్ కోకు కాలం దగ్గర పడిందని మండిపడ్డారు.

ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్‌పై కేసు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ తోట చంద్రశేఖర్, ఆ సంస్థ ప్రతినిధులపై సీసీఎస్‌లో కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చంద్రశేఖర్ తన కంపెనీకి ఇవ్వాల్సిన రూ.28 కోట్లు ఇవ్వకుండా మోసం చేశారని సాయి తిరుమల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ వాకాడ తిరుమలరావు ఈ ఏడాది ఏప్రిల్ 27న సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ప్రకారం.. 'ఆదిత్య' తమకు చెందిన చెందిన 220 ప్లాట్లను అభివృద్ధి చేసేందుకు 2021 మార్చిలో 'సాయి తిరుమల' అనుబంధ సంస్థ ఎస్ఎస్టీ బిల్డర్స్‌తో ఒప్పందం కుదుర్చుకుని వర్క్ ఆర్డర్ ఇచ్చింది 'సాయి తిరుమల' రూ.50కోట్లు పెట్టుబడి పెట్టి 90శాతం పనులు పూర్తి చేసి అప్పగించింది. ప్లాట్లను విక్రయించిన 'ఆదిత్య' ప్రతినిధులు.. బిల్లులు చెల్లించకుండా వేధిస్తున్నారని తిరుమలరావు ఫిర్యాదుచేశారు. దాంతో తోట చంద్రశేఖర్, తోట సత్యనారాయణ, తోట అనిరుధ్, తోట మణిబాబు, అజయ్, శివపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యతో ఉన్న యువకుడి మర్మాంగాన్ని కత్తిరించిన భర్త

బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న యువకుడి మర్మాంగాన్ని భర్త కత్తిరించాడు. కర్ణాటక రాష్ట్రం బీదర్ తాలూకా బంబుళగి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. పనిమీద బయటకు వెళ్తున్నానని, రాత్రికి రాలేనని భర్త చెప్పడంతో.. గురువారం రాత్రి ఆమె తన ప్రియుడిని రప్పించుకుంది. రాత్రి ఉన్నపళంగా భర్త ఇంటికిరావడంతో ఇద్దరూ దొరికిపోయారు. తీవ్ర ఆగ్రహానికి లోనైన భర్త ఇద్దరినీ చితకబాదాడు. యువకుడి మర్మాంగాన్ని కత్తెరతో కత్తిరించాడు. శుక్రవారం ఉదయం ఇరుగుపొరుగు గమనించి, యువకుడిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జమిలి దేశానికే ముప్పు: కమల్‌హాసన్

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేశం ఒకే ఎన్నిక' విధానం దేశానికే ముప్పు కలిగిస్తుందని ప్రముఖ సినీ నటుడు, 'మక్కల్‌నీదిమయ్యం' పార్టీ అధినేత కమల్‌హాసన్ పేర్కొన్నారు. శనివారం చెన్నైలో జరిగిన పార్టీ ద్వితీయ సర్వసభ్యమండలి సమావేశం కమల్‌కే మళ్లీ పగ్గాలు అప్పగిస్తూ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా కమల్ మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు ఫెడరల్ రాజ్యాంగ విధానానికి వ్యతిరేకమని, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని అభిప్రాయపడ్డారు. తమిళుడు ప్రధాని కావాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా పార్టీ బలోపేతానికి ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ 5 వేల మందిని సభ్యులుగా చేర్చాలని పార్టీ తీర్మానం చేసింది.

గంజాయి స్మగ్లర్‌గా ఐఐటీయన్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అతడో ఐఐటీ విద్యార్థి.. కానీ, మత్తుకు బానిసై ఉన్నత చదువులను వదిలేశాడు.. మరొకడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. రూ.లక్షల్లో జీతం.. కానీ, మాదక ద్రవ్యాలకు అలవాటుపడి చేజేతులా పోగొట్టుకున్నాడు.. ఇంకొకడు లారీ డ్రైవర్.. సులభంగా డబ్బు సంపాదించాలని అక్రమ రవాణాకు తెగించాడు.. ఆఖరికి వేరే రాష్ట్రం కూలీ కూడా స్మగ్లర్‌గా మారాడు.! గంజాయికి లొంగిపోయి.. దాని అమ్మకాన్నే ఉపాధిగా మార్చుకున్న వీరంతా హైదరాబాద్‌లో పోలీసులకు చిక్కారు. ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన పవన్ పేరొందిన ఐఐటీ విద్యార్థి. స్నేహితుల ద్వారా గంజాయికి అలవాటు పడ్డాడు. చదువును మధ్యలోనే ఆపేశాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎస్ఆర్‌నగర్‌లోని వినాయక ఎగ్జిక్యూటివ్ హాస్టల్‌లో ఉంటూ నెల్లూరు జిల్లాకు చెందిన కొలి మణికంఠ చౌదరితో కలిసి గంజాయి విక్రయించసాగాడు. ఈ నేపథ్యంలో ఎస్‌టీఎఫ్ టీమ్ హాస్టల్‌పై చాకచక్యంగా దాడి చేసి పవన్, మణికంఠను అరెస్టు చేసింది. 1.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుంది. 20 గ్రాముల గంజాయిని రూ.1000 చొప్పున విక్రయిస్తున్నట్లు తేలింది. ఏపీలోని నెల్లూరు జిల్లా అల్లంపాడు ప్రాంతానికి చెందిన లోకేష్.. హైదరాబాద్ మణికొండలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. లక్షకు పైనే జీతం వచ్చేది. అయితే, స్నేహితుల ద్వారా అలవాటైన గంజాయి వ్యసనంగా మారింది. విధులను నిర్లక్ష్యం చేయడంతో ఉద్యోగం పోయింది. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో గంజాయి సరఫరా చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించాడు. కూకట్‌పల్లిలో ఉండే నెల్లూరుకే చెందిన స్నేహితుడు శ్రీకాంత్ ద్వారా లోకేష్ సైతం స్మగ్లర్‌గా మారాడు. శ్రీకాంత్ వద్ద, ధూల్‌పేట నుంచి గంజాయి తెచ్చి తాను తీసుకుంటూ అమ్ముతున్నాడు. ఎక్సైజ్ ఎస్టీఎఫ్ (స్టేట్ టాస్క్ ఫోర్స్) పోలీసులు.. లోకేష్ ఇంటిపై దాడి చేసి 1.75 కిలోల గంజాయిని పట్టుకున్నారు. శ్రీకాంత్‌నూ అరెస్టు చేశారు. వీరు కిలో గంజాయిని రూ.20 వేలకు విక్రయిస్తున్నట్లు ఎస్టీఎఫ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపారు. కాగా, పవన్, లోకేష్ వద్ద గంజాయి కొన్న 22 మందిపై కేసులు నమోదు చేశారు. కాగా, అన్నవరం నుంచి హైదరాబాద్‌కు హాష్ ఆయిల్‌ను సరఫరా చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు. నలుగురిని అరెస్టు చేసి 2.3 కేజీల హాష్ ఆయిల్ సహా.. రూ.21 లక్షల సరుకును స్వాధీనం చేసుకున్నారు.

బెంగళూరు-గౌహతి ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

గోపాలపట్నం (విశాఖపట్నం), సెప్టెంబరు 21: బెంగళూరు నుంచి గౌహతి వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు శనివారం రాత్రి ప్రమాదం తప్పింది. ఓ బోగీ కింద నుంచి మంటలు, పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు గమనించి చైన్ లాగారు. సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను అదుపుచేశారు. బెంగళూరు నుంచి గౌహతి వెళుతున్న (నంబరు 12509) రైలు విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి శనివారం రాత్రి 8.50 గంటలకు బయలుదేరింది. ఎస్-7 బోగీ చక్రాలకు బ్రేక్ షూలు పట్టేయడంతో తీవ్రమైన రాపిడి జరిగి మంటలు రావడంతో పాటు పొగలు వ్యాపించాయి. ఇది గమనించిన ప్రయాణికులు చైన్ లాగారు. సమీపంలో ఉన్న భద్రతా సిబ్బంది, స్టేషన్ అధికారులు స్పందించి అగ్నిమాపక యంత్రంతో మంటలను అదుపుచేశారు.

ఆయుధాలు వెనక్కిచ్చేలా పోలీసులను ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి


అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా తను అప్పగించిన బోర్ పిస్టల్, రివాల్వర్, డబుల్ బ్యారెల్ గన్‌ను వెనక్కి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత కూడా ఆయుధాలను అధికారుల వద్దే ఉంచుకున్నారన్నారు. తన ఆయుధాలు అన్నింటికీ లైసెన్సులు ఉన్నాయన్నారు. ప్రాణహాని ఉన్న నేపథ్యంలో వాటిని వెనక్కి ఇచ్చేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు.

ఏపీ ఫైబర్ నెట్ ఈడీ జగన్మోహనరావు సస్పెండ్

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ - బిజినెస్ ఆపరేషన్స్) పిల్లా జగన్మోహనరావును సస్పెండ్ చేస్తూ మేనేజింగ్ డైరెక్టర్ దినేశ్ కుమార్ ఉత్తర్వులిచ్చారు. ఈడీని సస్పెండ్ చేయాలని ఫైబర్ నెట్ ఎండీ తీసుకున్న నిర్ణయాన్ని ఇదివరకే 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. ప్రభుత్వ ఉత్తర్వు 516 ప్రకారం పిల్లా జగన్మోహనరావును సస్పెండ్ చేసినట్లు ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ పేర్కొంది. ఈ సస్పెన్షన్ సమయంలో జగన్మోహనరావు హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని, ప్రతిరోజూ కార్యాలయానికి రావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు. డిగ్రీ ప్రోగ్రామ్‌లలో రెండు, మూడు సంవత్సరాలు; పీజీలో రెండో సంవత్సరం చదువుతున్నవారు; ఓల్డ్ బ్యాచ్ స్టూడెంట్స్ కూడా తమ ట్యూషన్ ఫీజులు చెల్లించవచ్చు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో వివిధ కోర్సులు



డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసిన వారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూ మీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

- బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

పీజీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

- హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎస్‌జీటీఎస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ ఛైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

- ఎర్లీ ఛైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

బెంగళూరు ఐఐఎంలో పీజీపీఈఎం

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంబీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్(పీజీపీఈఎం)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. జాతీయ పరీక్ష స్కోర్/ఐఐఎంబీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ఎంబీఏ డిగ్రీని ప్రదానం చేస్తారు.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. సీఏ/ఐసీడబ్ల్యుఏ/సీఎస్ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2025 మార్చి 31 నాటికి కనీసం నాలుగేళ్ల అనుభవం తప్పనిసరి. క్యాట్ 2024/జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే ఐఐఎంబీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

ఐఐఎంబీ ఎంట్రెన్స్ టెస్ట్: ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. క్వాంటిటేటివ్, వెర్బల్, లాజికల్, డేటా ఇంటర్‌ప్రిటేటివ్ ఎబిలిటీస్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 జనవరి 22
- **ఐఐఎంబీ టెస్ట్ తేదీలు:** రౌండ్ 1 టెస్ట్ తేదీ-నవంబరు 17న; రౌండ్ 2 టెస్ట్ తేదీ-2025 ఫిబ్రవరి 2న
- **ఇంటర్వ్యూ సెంటర్:** బెంగళూరు
- **ఇంటర్వ్యూలు:** 2025 ఫిబ్రవరి 15, 16
- **వెబ్‌సైట్:** iimb.ac.in

సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్



కేంద్ర ఉన్నత విద్యా శాఖ- కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థుల కోసం అందిస్తున్న సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ పథకానికి నోటిఫికేషన్ వెలువడింది. దేశవ్యాప్తంగా మొత్తం 82,000 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. వీటిలో సగాన్ని మహిళలకు కేటాయించారు. ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఈ స్కాలర్‌షిప్ పథకాన్ని ఉద్దేశించారు. ప్రస్తుతం డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులు చేస్తున్నవారికి ఈ స్కీమ్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తారు. వివిధ రాష్ట్రాల్లో 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న జనాభా ప్రాతిపదికన స్టేట్ ఎడ్యుకేషన్ బోర్డులకు స్కాలర్‌షిప్‌లు కేటాయిస్తారు. వీటిని ఎస్ఈబీలు హ్యుమానిటీస్, సైన్స్, కామర్స్ విద్యార్థులకు 3:3:1 నిష్పత్తిలో అందిస్తాయి. ఈ పథకం సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ అభ్యర్థులకు కూడా వర్తిస్తుంది. ఆసక్తి గలవారు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అప్లయ్ చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. ఏఐసీటీఈ/ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన కళాశాలలు/యూనివర్సిటీలలో డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. దూరవిద్య, కరస్పాండెన్స్ కోర్సుల్లో చేరినవారు; డిప్లొమా అభ్యర్థులు; ఇంటర్ తరవాత డ్రాప్ తీసుకున్న వారు; ఇతర స్కాలర్‌షిప్/ఫీ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం పొందుతున్న వారు దరఖాస్తుకు అనర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం నాలుగున్నర లక్షలకు మించకూడదు.

స్కాలర్‌షిప్: ఒక్కో విద్యార్థికి అయిదేళ్ల వరకు ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు. డిగ్రీ నుంచి పీజీ స్థాయి వరకు ఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. డిగ్రీ లెవెల్లో మూడేళ్లపాటు ఏటా రూ.12,000; పీజీ లెవెల్లో రెండేళ్లపాటు ఏటా రూ.20,000 చెల్లిస్తారు. బీఈ/బీటెక్ కోర్సుల్లో చేరినవారికి మొదటి మూడేళ్లు ఏటా రూ.12,000; చివరి ఏడాది రూ.20,000 ఇస్తారు. అలాగే అయిదేళ్ల వ్యవధి గల ప్రొఫెషనల్/ఇంటిగ్రేటెడ్ కోర్సులు చేసేవారికి చివరి రెండేళ్లు ఏటా రూ.20,000 ఇస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని అభ్యర్థి ఖాతాకు జమ చేస్తారు. చదువుతున్న కోర్సులో ఏటా 75 శాతం అటెండెన్స్, కనీసం 50 శాతం మార్కులు ఉంటేనే రెన్యువల్ అవకాశం లభిస్తుంది.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో టీచర్లు



దేశంలోని వివిధ కంటోన్మెంట్స్, మిలిటరీ స్టేషన్లలోని 139 ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ దరఖాస్తులు కోరుతోంది.

తెలుగు రాష్ట్రాల్లో ఆర్మీ పబ్లిక్ స్కూళ్లున్న ప్రాంతాలు: సికింద్రాబాద్(ఆర్‌కేపీ), సికింద్రాబాద్(బొల్లారం), గోల్కొండ.

1. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)
2. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)
3. పీఆర్‌టీ(ప్రైమరీ టీచర్)

సబ్జెక్టులు: బయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, జాగ్రఫీ, హిస్టరీ, హిందీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, సైకాలజీ, సంస్కృతం, ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్, పీజీ, డీఈఎల్ఈడీ, బీఈఎల్ఈడీ, బీఈడీ, బీపీఈడీ ఉత్తీర్ణతతో పాటు, సీటెట్, టెట్ అర్హత తప్పనిసరి.

వయో పరిమితి: 2024 ఏప్రిల్ 1 నాటికి ఫ్రెషర్స్ 40 ఏళ్లలోపు, అనుభవజ్ఞులైన అభ్యర్థులు 57 ఏళ్లలోపు ఉండాలి.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ, టీచింగ్ స్కిల్స్, కంప్యూటర్ ప్రావీణ్యం, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్

దరఖాస్తు రుసుము: రూ.385

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 25

పరీక్ష తేదీలు: నవంబరు 23, 24

ఫలితాల వెల్లడి: డిసెంబరు 10

వెబ్‌సైట్: https://awesindia.com

జాబ్ కార్నర్

ఐఐసీటీలో ప్రాజెక్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ)... తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 26

- ప్రాజెక్ట్ అసోసియేట్-1: **7 పోస్టులు**
- ప్రాజెక్ట్ అసోసియేట్-2: **2 పోస్టులు**
- ప్రాజెక్ట్ అసిస్టెంట్-1: **5 పోస్టులు**
- ప్రాజెక్ట్ అసిస్టెంట్-2: **7 పోస్టులు**
- ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్:**1**
- ప్రాజెక్ట్ అసోసియేట్-1/ప్రాజెక్ట్ అసోసియేట్-2: **4 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఎమ్మెస్సీ, ఎంఫార్మసీ, నెట్/గేట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్-1 పోస్టుకు రూ.25,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్-2కు రూ.20,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్-1కు రూ.18,000; ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.49,000; ప్రాజెక్ట్ అసోసియేట్-2కు రూ.28,000.

గరిష్ఠ వయోపరిమితి: ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుకు 40 ఏళ్లు; ఇతర పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్

ఇంటర్వ్యూ తేదీలు: సెప్టెంబరు 27, 30

వేదిక: ఐసీఎంఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ), హైదరాబాద్.

వెబ్‌సైట్: www.iict.res.in/

CSIR - IICT
Touching Lives

రైట్స్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్లు

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 15

పోస్టుల వివరాలు

1. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ(మెకానికల్ ఇంజనీరింగ్): **10 పోస్టులు**
2. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ): **5 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2024 స్కోరు తప్పనిసరి.

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, గేట్-2024 స్కోర్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.600, ఈడబ్ల్యుఎస్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.300.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24

వెబ్‌సైట్: https://www.rites.com/

నార్మ్‌లో యంగ్ ప్రొఫెషనల్ ఖాళీలు

రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఎన్ఏఏఆర్ఎం)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

ఖాళీలు: 2

అర్హత: అగ్రికల్చరల్ సైన్స్, ఎకనామిక్స్, అగ్రిబిజినెస్‌లో పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.42,000

వయోపరిమితి: 21 నుంచి 45 ఏళ్లు ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీ: అక్టోబరు 4

వేదిక: ఐసీఏఆర్ - ఎన్ఏఏఆర్ఎం, రాజేంద్రనగర్, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://naarm.org.in/home/

नार्म
naarm

ఎన్ఐసీహెచ్‌డీఆర్‌లో ఖాళీలు

న్యూఢిల్లీలోని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. కన్సల్టెంట్(నాన్ మెడికల్): **1 పోస్టు**
2. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-2(ఎక్స్-రే టెక్నీషియన్): **1 పోస్టు**
3. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1: **2 పోస్టులు**

అర్హత: టెన్త్, ఇంటర్మీడియట్, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు కన్సల్టెంట్ పోస్టుకు రూ.70,000. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-2కు రూ.20,000. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1కు రూ.18,000.

వయోపరిమితి: కన్సల్టెంట్ పోస్టుకు 70 ఏళ్లు, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ పోస్టుకు 28 నుంచి 30 ఏళ్లు మించకూడదు.

పని ప్రదేశం: స్టేట్ టీబీ సెల్, జీఎంఎస్‌హెచ్ సెక్టార్-16, చండీగఢ్.

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 25

వేదిక: స్టేట్ టీబీ సెల్, జీఎంఎస్‌హెచ్ సెక్టార్-16, చండీగఢ్.

వెబ్‌సైట్: https://main.icmr.nic.in/

లిటిల్స్



చెడు సావాసం

అనగనగా అడవిలో ఒక తోడేలు ఉండేది. దానికి అడవిలో వేటాడాలంటే బద్ధకం. రాత్రులు అడవికి దగ్గర్లోఉన్న గ్రామానికి చాటుగా వెళ్లి,అక్కడి కాపరులకు తెలియకుండా మేకలను, గొర్రెలను ఎత్తుకొచ్చి, తింటూ ఉండేది. పక్కనేఉన్న చెట్టు మీద నివసించే కోతి ఒకటి తోడేలు చేసే పనులన్నీ ఆసక్తిగా గమనిస్తూ ఉండేది. ఇది తెలుసుకున్న తోడేలు ఇంకా తనెంత తెలివైనదో, ఎలా గొర్రెల కాపరుల కన్నుగప్పి, గొర్రెలను ఎత్తుకొస్తున్నదో కథలు కథలుగా వర్ణించి చెప్పేది. ఇలా కొన్నాళ్లు విన్నాక, కోతి తోడేలును ఇలా అడిగింది. 'మిత్రమా..నీ సాహసం వింటూ ఉంటే నాకు కూడా ఒక రోజు రాత్రి నీతో పాటు వచ్చి నీ సాహసాన్ని చూడాలనున్నది.నన్ను కూడా ఒక రోజు నీతో పాటు తీసుకుపోవూ?' అని అడిగింది.




ఆ మాటలు విన్న తోడేలు తన గొప్పతనానికి మురిసిపోతూ, 'అయ్యో దానికేం భాగ్యం? అలాగే. రేపే నిన్ను నాతో తీసుకువెళతాను అన్నది. అన్నట్టుగానే ఆ రోజు రాత్రి తోడేలు కోతిని తీసుకుని ఎప్పటిలాగే మేకలను దొంగతనం చేయడానికి వెళ్లింది. అంతకుముందు కొన్ని రోజులుగా తమ మందలలో గొర్రెలు, మేకలు ఉన్నట్టుండి మాయం అవుతుండటం గమనించుకున్న గ్రామస్తులు రాత్రివేళల్లో కాపలాగా తిరిగేటందుకు కొందరు యువకులను నియమించారు.

ఈ విషయం తెలియని తోడేలు అలవాటుగా గొర్రెల మంద దగ్గరికి వెళ్లగానే అక్కడే సిద్ధంగాఉన్న కాపలా యువకులు కర్రలతో తోడేలును కొట్టి చెట్టుకు కట్టేసారు ఆ సందడిలో కోతికి కూడా కర్రతో దెబ్బలు బాగానే పడ్డాయి.ఆ దెబ్బలు తట్టుకోలేక కోతి 'మీ గొర్రెలను ఎత్తుకెళుతోంది నేను కాదు కదా ఈ తోడేలు రోజూ మీ మందలలో మేకలు, గొర్రెలను మాయం చేస్తోంది.నన్ను ఎందుకు కొడుతున్నారు?'అని గట్టిగా కేకలు పెట్టింది.

దానికి ఆ గ్రామస్తులు 'నువ్వు దొంగతనం చేయకున్నా, చేసే తోడేలుకు సాయంగా వచ్చావు కాబట్టి, నీకు కూడా శిక్ష పడాల్సిందే'అన్నారు కాసేపటికి తోడేలును అక్కడే వదిలి, కోతి నెమ్మదిగా చెట్ల కొమ్మలలో దాగి అక్కడి నుండి తను ఉండే చోటికి వెళ్లిపోయింది. తాను తప్పు చేయకున్నా చెడు సావాసం చేయడంవలన తనకు దెబ్బలు తగిలిన విషయం గుర్తు పెట్టుకున్న కోతి ఇకపై అలాంటి పనులు చేసే వారితో స్నేహం చేయకూడదనుకుంది.


7 తేడాలను కనిపెట్టండి



కుక్కలు ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 416

	1				8		9	5
4	3					8		
	8	6						
			6	4				7
	4		8		7		2	
8				9	3			
						7	3	
		4					1	9
9	5		7				4	

సుడోకు - 415 సమాధానం

2	5	1	8	9	4	7	3	6
6	9	3	2	5	7	1	8	4
7	8	4	6	1	3	9	5	2
3	6	8	9	4	5	2	1	7
9	7	2	3	6	1	5	4	8
1	4	5	7	2	8	6	9	3
5	1	7	4	3	6	8	2	9
4	2	6	1	8	9	3	7	5
8	3	9	5	7	2	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.